
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ప్రకాశం 5
జిల్లా వార్తలు
బుధవారం 13, మార్చి 2024





సమావేశంలో నేతలకు సూచనలిస్తున్న బీఎన్ విజయకుమార్

ఉమ్మడి సభకు సమాయత్తం

- 17న చిలకలూరిపేటలో టీడీపీ కూటమి భారీ సభ
- హాజరుకానున్న ప్రధాని మోదీ, చంద్రబాబు, పవన్
- లోకేష్ సమీక్షకు హాజరైన దామచర్ల బ్రదర్స్, ఎరిక్షన్
- జనసమీకరణపై పార్టీ ఇన్‌చార్జిల దృష్టి
- భారీగానే తరలివెళ్లనున్న శ్రేణులు

ఒంగోలు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : పల్నాడు జిల్లా చిలకలూరిపేట సమీపంలోని బొప్పూడి వద్ద ఈనెల 17న టీడీపీ, జనసేన, బీజేపీలు నిర్వహిస్తున్న సభకు జిల్లా నుంచి భారీగా జన సమీకరణకు ఆ పార్టీల శ్రేణులు సన్నద్ధమవుతున్నాయి. వచ్చే ఎన్నికల్లో మూడు పార్టీలు కూటమిగా పోటీ చేయాలన్న లక్ష్యంతో పొత్తులు కుదుర్చుకున్నాయి. అనంతరం తొలిగా రాష్ట్రస్థాయిలో భారీ బహిరంగ సభను చిలకలూరిపేట సమీపంలో నిర్వహిస్తున్నారు. టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లతోపాటు ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఈ సభకు వస్తున్నారు. దీంతో మరింత ప్రతిష్ఠాత్మకంగా సభ నిర్వహణకు మూడు పార్టీలు సిద్ధమయ్యాయి. టీడీపీ మరింత సీరియస్‌గా తీసుకుంది. కాగా సభ జరిగే ప్రాంతం ఉమ్మడి ప్రకాశం జిల్లా సరిహద్దు కావడంతో ఇక్కడి నుంచి భారీగానే జనసమీకరణ చేయాలని నేతలకు అధిష్ఠానం నుంచి సంకేతాలు అందాయి. దీంతో తక్షణం ఆవైపు జిల్లాలోని టీడీపీ నియోజకవర్గ నేతలు ఇప్పటికే దృష్టిసారించారు. ప్రాంతాల వారీ సమావేశాలు నిర్వహిస్తున్నారు. అందులోభాగంగా సంతనూతలపాడు నియోజకవర్గ సమావేశం మంగళవారం ఒంగోలు మంగమూరురోడ్డులోని ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ కార్యాలయంలో జరిగింది. విజయకుమార్ నేతృత్వంలో నిర్వహించిన సమావేశంలో నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు వంటి ముఖ్యనేతలు పాల్గొన్నారు. అధిష్ఠానం సూచనలకు అనుగుణంగా ఆయా మండలాలు, గ్రామాల నుంచి శ్రేణులు, ప్రజలు తరలివచ్చేలా చూడటంపై చర్చించారు. పొదిలిలో ముఖ్యనేతలతో మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల నారాయణరెడ్డి కూడా సమావేశం నిర్వహించారు. అలాగే బుధ, గురువారాల్లో ఇతర నియోజకవర్గాల్లోనూ ఏర్పాటు చేస్తున్నారు. ఇదిలా ఉండగా పేట సభ విజయవంతం కోసం రాష్ట్ర స్థాయిలో మూడు పార్టీల నేతలతో పలు కమిటీలను ఏర్పాటు చేశారు. ఆ సభ్యుల సమన్వయ సమావేశం మంగళవారం ఉండవల్లిలోని పార్టీ అధినేత చంద్రబాబు నివాసంలో యువనేత నారా లోకేష్ నేతృత్వంలో జరిగింది. కమిటీ సభ్యులుగా ఉన్న మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య వైపాలెం ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు పాల్గొన్నారు. అలాగే ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, గొట్టిపాటి రవికుమార్‌లతోపాటు ఇన్‌చార్జిలు ఎం.ఎం.కొండయ్య, ఇంటూరి నాగేశ్వరరావు కూడా హాజరయ్యారు.

వైసీపీ పాలనలో జిల్లాలో అభివృద్ధి పడకేసింది. కీలక సంస్థల ఏర్పాటు అడుగు ముందుకు పడలేదు. ఇందుకు జాతీయ పారిశ్రామిక ఉత్పాదక మండలి (నిమ్జ్) నిదర్శనం. ఎన్నికలకు ముందు జగన్‌రెడ్డి నిమ్జ్ ఏర్పాటుకు కృషిచేసి ఉద్యోగం, ఉపాధి కల్పిస్తామని కనిగిరి ప్రాంత ప్రజలకు గట్టి హామీ ఇచ్చారు. కానీ దాన్ని కలగానే మిగిల్చారు. జిల్లాలోని పశ్చిమప్రాంత ప్రజలు ఎదురుచూస్తున్న ప్రతిష్ఠాత్మక సంస్థల ఏర్పాటుపై వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చూపింది. ఐదేళ్ల పాలనలో నిమ్జ్ ఊసే లేకుండా పోయింది. దీంతో వేలాది మందికి ఉపాధి అవకాశాలు సన్నగిల్లాయి. కనిగిరి ప్రాంతంలో సెజ్ ఏర్పాటుతో అవకాశాలు పెరిగి వలసలు నిలిచిపోతాయనుకున్న నిరుద్యోగుల ఆశలు నెరవేరలేదు.



నిమ్జ్ ఏర్పాటు కోసం గుర్తించిన భూములు

నిమ్జ్ ఏర్పాటుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తా



కనిగిరి ప్రాంతం అభివృద్ధే నా లక్ష్యం. అందులోభాగంగా చేపట్టిన ఐదు ప్రణాళికలలో నిమ్జ్ ఒకటి. అది ఏర్పాటైతే ఈ ప్రాంతం పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందుతుంది. వలసలు ఆగుతాయి. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయి. ఇక్కడి ప్రజలు పరాయి ప్రాంతాల్లో పనులు చేయడం చూసినప్పుడల్లా నా మనసు కలచివేస్తుంది. ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన వైసీపీ పాలకులు నిమ్జ్‌పై నిర్లక్ష్యం వహించారు. టీడీపీ అధికారంలోకి రాగానే నిమ్జ్ ఏర్పాటు ప్రక్రియ పూర్తిచేసి నిరుద్యోగుల కల నెరవేరుస్తాం.

- డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి, కనిగిరి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి

నిమ్జ్‌పై నిర్లక్ష్యం

- ఐదేళ్ల పాలనలో వదిలేసిన వైసీపీ
- టీడీపీ ప్రభుత్వ హయాంలోనే భూసేకరణ పూర్తి
- 12వేల ఎకరాలకుపైగా గుర్తింపు
- ఉద్యోగాలు, ఉపాధి కల్పిస్తామని జగన్ హామీ
- అధికారంలోకి వచ్చాక ఆ ఊసే కరువు
- వేలాది మంది నిరుద్యోగుల ఆశలపై నీళ్లు





నిమ్జ్ ప్రతిపాదిత ప్రాంతమైన రేణిమడుగు వద్ద ఏపీఐఐసీ ఏర్పాటు చేసిన బోర్డు

కనిగిరి, మార్చి 12 : వేలాది మందికి ఉపాధి కల్పించే నిమ్జ్ (జాతీయ పారిశ్రామిక ఉత్పాదక మండలి)లో కదలిక లేకుండా పోయింది. నిమ్జ్‌కు తొలి అడుగు 2013లో పడినా భూసేకరణ సర్వే మాత్రం రాష్ట్ర విభజన తరువాత తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరమే ముందుకు సాగింది. ఏడేళ్ల క్రితం సీఎం చంద్రబాబు సీఎస్‌పురం మండలంలో జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆ సందర్భంగా నిమ్జ్ ఏర్పాటుకు పూర్తిగా సహకరించి నిరుద్యోగ సమస్యను పారదోలుతామని ప్రకటించారు. వెనువెంటనే ఆ దిశగా అడుగులు పడుతూ భూసేకరణ సర్వే ప్రక్రియ వేగవంతమైంది.

నిమ్జ్‌పై వైసీపీ చిన్నచూపు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రూ.10వేల కోట్ల అంచనాలతో మూడు దశల్లో నిమ్జ్‌ను 2040 నాటికి పూర్తి చేయాలన్నది లక్ష్యం. కనిగిరి నియోజకవర్గంలోని పామూరు, పీసీపల్లి మండలాల్లో నిమ్జ్ ఏర్పాటుకు టీడీపీ ప్రభుత్వం భూముల సర్వేను పూర్తిచేసింది. అప్పట్లో సకాలంలో కేంద్ర ప్రభుత్వం సహకరించి ఉంటే తొలివిడత రూ.4,370కోట్లు మంజూరయ్యేవి. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లోనైనా నిమ్జ్‌కు కేటాయింపులు రాబట్టేందుకు కనీస ప్రయత్నం కూడా చేయలేదు. నిమ్జ్ కార్యరూపం దాల్చితే ప్రత్యక్షంగా లక్ష మందికి, పరోక్షంగా మరో 2లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభించేవి. పారిశ్రామిక రంగాలకు సంబంధించి నైపుణ్యం, అర్హతలు సాధిస్తే మరో ప్రాంతానికి ఉపాధి కోసం వెళ్లకుండా నిమ్జ్ పారిశ్రామిక కారిడార్ ద్వారా చక్కటి బాటలు వేసుకునే అవకాశం ఉండేది. పరిశ్రమలు రావడం ద్వారా భూములకు విలువలు పెరగడంతోపాటు పరోక్షంగా వ్యాపారాలు పెరిగి ప్రజలు ఆర్థిక పురోగతి చెందేవారు. కానీ వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా జిల్లాలోని పశ్చిమప్రాంతం ప్రజలతోపాటు కనిగిరికి చెందిన వారు ఉపాధి కోసం వలస బాట పడుతున్నారు.

టీడీపీ ప్రభుత్వంలోనే భూసేకరణ పూర్తి

నిమ్జ్ ఏర్పాటుకు అవసరమైన భూసేకరణను టీడీపీ ప్రభుత్వ హయాంలో దాదాపుగా పూర్తి చేశారు. కనిగిరి నియోజకవర్గంలోని పీసీపల్లి మండలం పెదఇర్లపాడు పంచాయతీ పరిధిలోని గుంటూరు లింగన్నపాలెం వద్ద పక్కా భూమి 213.79 ఎకరాలు, అసైన్డ్ భూమి 440.19 ఎకరాలు, ప్రభుత్వ భూమి 918.29 ఎకరాలను నిమ్జ్ కోసం ఏపీఐఐసీకి అప్పగించారు. పామూరు మండలంలోని అయ్యన్నకోట, రేణిమడుగు, సిద్ధవరం, మాలకొండాపురం, బోడవాడ గ్రామాల్లో కూడా భూసేకరణ పూర్తిచేశారు. రెండు మండలాల్లో 12,538 ఎకరాలు గుర్తించగా ఇందులో పట్టా భూములు 6,810 ఎకరాలు, ప్రభుత్వ భూములు 3,030 ఎకరాలు, అసైన్డ్ భూములు 2,698 ఎకరాలు ఉన్నాయి. భూములు కోల్పోయిన రైతులతో సమావేశాలు నిర్వహించి వారిని ఒప్పించారు. ఈ ప్రక్రియ మొత్తం టీడీపీ ప్రభుత్వ హయాంలోనే పూర్తయింది.

నిరుద్యోగుల ఆశలు ఆవిరి

జిల్లాలోనే వెనుకబడిన ప్రాంతమైన కనిగిరి నియోజకవర్గంలో ఎటువంటి పరిశ్రమలు లేక కూలీలతోపాటు నిరుద్యోగులు వలసబాట పడుతున్నారు. స్వాతంత్య్రం అనంతరం ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఇంతవరకూ ఇక్కడ ఏ ఒక్క పరిశ్రమ ఏర్పాటు కాలేదు. దీంతో వలసలు నిత్యకృత్యమయ్యాయి. ఈనేపథ్యంలో తెరపైకి వచ్చిన నిమ్జ్‌పై కనిగిరి ప్రాంత ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. దశాబ్దకాలంగా ఎదురు చూస్తున్నారు. రాష్ట్ర విభజన అనంతరం అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం నిమ్జ్ ఏర్పాటుకు శ్రీకారం పలికి భూసేకరణను పూర్తిచేసి నివేదికలు పంపింది. ఆతర్వాత 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ నిమ్జ్ భూసేకరణ కాగితాలకే పరిమితం చేసి, లక్షలాది మంది నిరుద్యోగులు పెట్టుకున్న ఆశలపై నీళ్లు చల్లింది. కేంద్రప్రభుత్వం బడ్జెట్‌లో నిమ్జ్‌కు కేటాయింపులు చేయకపోవడాన్ని కనీసం ప్రశ్నించలేని స్థితిలో వైసీపీ ఉండిపోయింది.

సీసీఆర్ ఏర్పాట్లను రెండు రోజుల్లో పూర్తిచేయాలి

- అధికారులకు కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం

ఒంగోలు (కలెక్టరేట్), మార్చి 12 : త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కలెక్టరేట్‌లో సెంట్రల్ కంట్రోల్ రూం(సీసీఆర్) ఏర్పాట్లను రెండు రోజుల్లో పూర్తిచేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. కంట్రోల్ రూంలో జరుగుతున్న పనులను ఆయన జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, డీఆర్వో శ్రీలతతో కలిసి మంగళవారం సాయంత్రం పరిశీలించారు. కంప్యూటర్లు, ప్రింటర్లు, జెరాక్స్ మిషన్లు, ఇంటర్‌నెట్, టీవీలు, కుర్చీలు, టేబుళ్లు ఇతర సదుపాయాలన్నీ కల్పించాలని అధికారులకు సూచించారు. జిల్లాలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు పూర్తిస్థాయిలో మానిటరింగ్ చేసేలా సీసీఆర్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కంట్రోల్ రూంలో ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులు, టోల్‌ఫ్రీ నెంబరు, సోషల్ మీడియా, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా వార్తలు, ఎంసీసీ మానిటరింగ్ తదితర విభాగాలను పర్యవేక్షించేందుకు పలు శాఖల అధికారులు, సిబ్బందిని నియమించినట్లు చెప్పారు. వారికి అవసరమైన శిక్షణ కూడా ఇస్తామన్నారు. పోలింగ్ రోజున వెబ్‌కాస్టింగ్ ద్వారా పర్యవేక్షణకు అవసరమైన ఏర్పాట్లను చేస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ వెంట వివిధ కమిటీల నోడల్ అధికారులు జాలిరెడ్డి, వెంకటేశ్వర్లు, వసుంధర, రవికుమార్, పేరయ్య, మాధురి, మర్దన్‌ఆలీ, సుశీల, సుధాకర్ తదితరులు ఉన్నారు.



సీసీ రూంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్



ఏసీబీ వలలో పంచాయతీ కార్యదర్శి

- రూ.10వేలు లంచం తీసుకుంటూ దొరికిన వైనం
- పట్టించిన అధికార పార్టీ నేత

పుల్లలచెరువు, మార్చి 12: పుల్లలచెరువు మండలంలో ఓ పంచాయతీ కార్యదర్శి ఏసీబీ వలకు చిక్కాడు. వీధి దీపాలు ఏర్పాటు చేసిన వైసీపీ నేత వద్ద బిల్లు చేయడానికి రూ.10వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు. పుల్లలచెరువుకు చెందిన అధికారపార్టీ నాయకుడు హరినాయక్ గ్రామంలో వీధి లైట్లు ఏర్పాటు చేశారు. ఆ బిల్లులు చేయాలంటూ పంచాయతీ కార్యదర్శి బాలునాయక్‌ను కోరారు. అందుకు ఆయన రూ.10వేలు లంచం డిమాండ్ చేశాడు. దీంతో హరినాయక్ ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. మంగళవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఏసీబీ అధికారులు సివిల్ డ్రస్సుల్లో పుల్లలచెరువు ఎంపీడీవో కార్యాలయానికి వచ్చారు. హరినాయక్‌కు కెమికల్ పూసిన నోట్లు ఇచ్చారు. ఆయన వాటిని నేరుగా తీసుకెళ్లి పంచాయతీ కార్యదర్శికి అందజేశారు. అక్కడే మాటు వేసి ఉన్న ఏసీబీ అధికారులు బాలునాయక్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ పశ్చిమప్రాంతంలోని ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో అవినీతిపై ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. లంచం డిమాండ్ చేస్తే వెంటనే 14400, ఒంగోలు ఏసీబీ అధికారి ఫోన్ నెంబరు 9440446189కు సమాచారం ఇవ్వాలన్నారు. ఎక్కడ అవినీతి జరిగినా వెంటనే తెలపాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. దాడుల్లో డీఎస్పీతోపాటు సీఐలు అనూష, శేష పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై కన్నెర్ర

- కొమరోలు సొసైటీ ఉద్యోగులపై క్రిమినల్ చర్యలు
- ఆదేశాలు జారీ చేసిన కలెక్టర్ దినేష్‌కుమార్
- పోలీస్ స్టేషన్‌లోనూ ఫిర్యాదు

ఒంగోలు(విద్య), మార్చి 12 : కొమరోలు విశాల వ్యవసాయ సహకార పరపతి సంఘం (సొసైటీ)లో జరిగిన నిధుల దుర్వినియోగం, పరిపాలనాపరమైన అక్రమాలపై కలెక్టర్ దినేష్‌కుమార్ కన్నెర్ర చేశారు. సొసైటీలో జరిగిన రూ.80.86 లక్షల నిధుల స్వాహా, ఇతర అవకతవకలు, అక్రమాలకు బాధ్యులైన వారిపై క్రిమినల్ చర్యలకు ఆమోద ముద్ర వేశారు. తొలుత సొసైటీలో జరిగిన ఆర్థిక అక్రమాలపై ఏపీ సహకార సంఘాల చట్టం 1964 సెక్షన్ 51 ప్రకారం చట్టబద్ధమైన విచారణకు డీసీవో రాజశేఖర్ ఆదేశించారు. విచారణాధికారిగా పొదిలి సబ్ డివిజనల్ సహకారాధికారి కె.వెంకటేశ్వర్లును నియమించారు. ఆయన విచారించి సొసైటీలో రూ.80.86 లక్షలు స్వాహా అయ్యాయని, పలు ఆర్థిక, పరిపాలనాపరమైన అవకతవకలు జరిగాయని తేల్చారు. ఈ నిధుల స్వాహాకు సొసైటీ మాజీ సీఈవో రావూరి దిలీప్‌కుమార్, సొసైటీ మాజీ చైర్మన్ గజ్జలకొండ చినవెంకటేశ్వర్లు, అప్పటి పీడీసీసీ బ్యాంకు సూపర్‌వైజర్ షేక్ రహంతుల్లా, గిద్దలూరు పీడీసీసీ బ్యాంకు మేనేజర్ దేశెట్టి శ్రీనివాసులును బాధ్యులుగా తేల్చి నివేదికను సమర్పించారు. దీంతో నిధుల దుర్వినియోగానికి బాధ్యులైన ఈ నలుగురిపై ఏపీ సహకార సంఘాల చట్టం 1964సెక్షన్79(1)(ఎ), 79(1)(ఎఫ్), 79(3),(1) ప్రకారం క్రిమినల్ చర్యలకు అనుమతించాలని మార్కాపురం డివిజనల్ డిప్యూటీ రిజిస్ట్రార్ రాజశేఖర్ కలెక్టర్‌కు నివేదించారు. వీటిని పరిశీలించిన కలెక్టర్ ఆ నలుగురిపై విచారణకు అనుమతి ఇస్తూ ఉత్తర్వులు జారీచేశారు. బాధ్యులపై వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఆదేశించారు. కలెక్టర్ ఉత్తర్వుల మేరకు మార్కాపురం డిప్యూటీ రిజిస్ట్రార్ రాజశేఖర్ ఈ నలుగురిపై కొమరోలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఉత్తర్వుల నకళ్లను స్టేషన్ హౌస్ అధికారికి, మార్కాపురం డీఎస్పీకి అందజేశారు.



రసవత్తరంగా దర్శి

- బరిలో టీడీపీ అభ్యర్థే?
- పరిశీలనలో శిద్దా, కృష్ణచైతన్య, డాక్టర్ లక్ష్మి పేర్లు



(ఆంధ్రజ్యోతి, ఒంగోలు) తెలుగుదేశం పార్టీ, జనసేన కూటమి బీజేపీతో జతకట్టిన నేపథ్యంలో జిల్లాలో దర్శి నియోజకవర్గ రాజకీయం రసవత్తరంగా మారింది. తొలుత టీడీపీ, జనసేన మధ్య జరిగిన ఒప్పందంలో దర్శిని జనసేనకు కేటాయించాలని నేతలు నిర్ణయం తీసుకున్నారు. ఆ స్థానం కోసం జనసేన నాయకులు గట్టిగా పట్టుబట్టారు. దీటైన అభ్యర్థిని ఇరు పార్టీలు కలిసి ఎంపిక చేయాలని భావించారు. అయితే బీజేపీతో కూడా ఎన్నికల అవగాహన కుదరడంతో రాష్ట్రంలో టీడీపీ పోటీచేసే స్థానాల్లో ఒకదాన్ని, జనసేన మూడు స్థానాలను వదులుకున్నాయి. జనసేన వదులుకున్న మూడింటిలో దర్శి ఒకటని సమాచారం. దీంతో తెలుగుదేశం పార్టీ నుంచి దర్శి టికెట్ ఆశిస్తున్న వారిలో పోటీ పెరిగింది. అధికారికంగా దర్శి నుంచి టీడీపీ, జనసేనల్లో ఎవరూ పోటీచేస్తారనే విషయం ప్రకటించలేదు. అయినా తెలుగుదేశమే రంగంలో ఉండనున్నట్లు తెలుస్తోంది. జనసేన 24 నుంచి మూడు స్థానాలు తగ్గించుకున్నందున జిల్లాలో మరోస్థానం కోరుకునే అవకాశం కూడా లేదంటున్నారు. పైగా టీడీపీ పోటీ చేయబోయే 144 స్థానాల్లో ఉమ్మడి జిల్లాలో ఆ పార్టీ అభ్యర్థులను ప్రకటించని గిద్దలూరు, మార్కాపురం, చీరాల, కందుకూరు కూడా ఉన్నాయి. దీంతో జనసేన ఇతర జిల్లాల్లో ఉన్న అవసరాల దృష్ట్యా ఉమ్మడి ప్రకాశం జిల్లాలో మరోస్థానం కోరుకునే అవకాశం లేదని తెలుస్తోంది. పైగా ఆపార్టీ తరపున అధినేత పవన్‌కల్యాణ్‌కు నమ్మకస్తుడైన జిల్లా అధ్యక్షుడు రియాజ్‌కు భవిష్యత్‌లో సముచిత అవకాశాలు ఇస్తామని హామీ ఇచ్చినట్లు తెలిసింది. అలాగే మార్కాపురం జనసేన నాయకుడు ఇమ్మడి కాశీనాథ్‌కు కూడా తగు ప్రాధాన్యం ఇస్తామని ఆపార్టీ నేతలు చెప్పినట్లు తెలిసింది. చీరాలకు చెందిన ఆమంచి స్వాములుకు పార్టీలో ప్రాధాన్యత ఉన్నప్పటికీ ఆయన పదవికి రాజీనామా చేయడంతో ఆపార్టీ నాయకులు అసంతృప్తిలో ఉన్నట్లు సమాచారం. పైగా చీరాలలో ఆయన సోదరుడు కృష్ణమోహన్ స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసే అవకాశాన్ని పరిగణనలోకి తీసుకొని ఒక అంచనాకు వస్తున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో దర్శి నుంచి కూడా టీడీపీ అభ్యర్థే రంగంలో ఉండవచ్చనే స్పష్టత కనిపిస్తోంది. దీంతో దర్శి టికెట్ ఆశిస్తున్న ఆశావాహుల నుంచి పోటీ పెరిగింది.

పెరిగిపోయిన ఆశావహులు

వైసీపీ నుంచి టీడీపీలో చేరి దర్శి నుంచి పోటీ చేసేందుకు పలువురు ప్రయత్నిస్తున్నారు. దీంతో టీడీపీ కూడా అభ్యర్థి ఎంపికను సీరియస్‌గా తీసుకొని గెలుపు అవకాశాలను పరిశీలిస్తోంది. మాజీ మంత్రి శిద్దా రాఘవరావు విషయంలో అనేక అవకాశాలు ఇచ్చినప్పటికీ టీడీపీ నుంచి వెళ్లి వైసీపీలో చేరారన్న భావనను ఆ పార్టీ అగ్రనేత వ్యక్తం చేసినట్లు తెలిసింది. అయితే ఇద్దరు కీలక నాయకులు శిద్దాను రంగంలో దింపితే మంచి ఫలితం ఉంటుందని, ఆర్యవైశ్య సామాజికవర్గం నుంచి ఉపయోగం ఉంటుందని సూచించారు. మార్కాపురం నుంచి ఆర్యవైశ్య సామాజికవర్గం అభ్యర్థి పేరును పరిశీలిస్తున్న టీడీపీ అధిష్ఠానం అటు వైపునకు ప్రాధాన్యత ఇస్తోంది. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డితోపాటు టీడీపీలో చేరేందుకు శిద్దా రాఘవరావు సిద్ధమైనట్లు సమాచారం. అయితే టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పార్టీని వీడిన వారిని రానివ్వకూడదనే నిర్ణయంతో ఉన్నందున ఏమి జరుగుతుందో చూడాల్సి ఉంది. జిల్లాలో సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే గరటయ్యతోపాటు అద్దంకి వైసీపీ ఇన్‌చార్జిగా ఉన్న కృష్ణచైతన్యలు టీడీపీలో చేరేందుకు సిద్ధమై బాబును కలిసి ఉన్నారు. డాక్టర్ గరటయ్యకు చంద్రబాబుతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. అద్దంకితోపాటు పర్చూరు, ఎస్ఎన్‌పాడు నియోజకవర్గాల్లో గరటయ్య ప్రభావం ఉండొచ్చనేది జగమెరిగిన సత్యం. వారు ప్రస్తుతం దర్శి టికెట్‌ను ఆశిస్తున్నారు. ఇంకోవైపు మాజీ మంత్రి గొట్టిపాటి హనుమంతరావు మనుమరాలు, మాజీ ఎమ్మెల్యే నరసయ్య కుమార్తె అయిన డాక్టర్ లక్ష్మి కూడా టికెట్‌ను ఆశిస్తున్నారు. ఆమె భర్త డాక్టర్ లలిత్, మామ డాక్టర్ వెంకటేశ్వర్లు నరసరావుపేట టీడీపీలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు. దర్శి నుంచి డాక్టర్ లక్ష్మి ముందుకు రావడంతో ముగ్గురిలో టీడీపీ అవకాశం ఎవరికి దక్కుతుందనేది సందిగ్ధంగా మారింది.

ఆవుపై పెద్దపులి దాడి

భయాందోళనలో లోయ గ్రామాల ప్రజలు



సీసీ కెమెరాలో నమోదైన ఆవుపై పెద్దపులి దాడి చేస్తున్న ఫుటేజీ

వివరాలు లోపలి పేజీల్లో..



మంత్రుల సమక్షంలో వైసీపీకి మద్దతుగా మాట్లాడుతున్న వ్యాయామ ఉపాధ్యాయుడు అశోక్

నిబంధనలు బేఖాతర్

- వైసీపీ భజన చేసిన వ్యాయామ టీచర్

సింగరాయకొండ, మార్చి 12 : ఓ వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రభుత్వ నిబంధనలు, ఈసీ ఆదేశాలను తుంగలో తొక్కారు. సింగరాయకొండలో నిర్వహించిన వైసీపీ కొండపి నియోజకవర్గ దళితుల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న ఆయన ఆపార్టీ భజన చేశారు. దీనిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. టంగుటూరు మండలం జమ్ములపాలెం హైస్కూల్‌లో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న తుల్లిబిల్లి అశోక్ సమావేశానికి హాజరయ్యారు. వేదికపై మంత్రుల పక్కన కూర్చున్నారు. అనంతరం ఆయన రాజకీయ ప్రసంగం చేశారు. దళితులకు వైసీపీ, జగన్‌మోహన్‌రెడ్డి వల్లనే మేలు జరిగిందని ఊదరగొట్టారు. గతంలో ఎమ్మెల్యే అభ్యర్థులుగా వైసీపీ మాల సామాజికవర్గానికి చెందిన వ్యక్తులకు అవకాశం కల్పిస్తే మాదిగలు పనిచేశారన్నారు. ఇప్పుడు మాదిగ కులానికి చెందిన సురేష్ గెలుపు కోసం మాలలు పనిచేయాలని కోరారు. రాజకీయపార్టీల సభలు, సమావేశాలు, ప్రచారాల్లో ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొనరాదని ఈసీ ఇచ్చిన ఆదేశాలను బేఖాతరు చేసి అధికారపార్టీ సమావేశంలో ఆయన ఇలా మాట్లాడటం చర్చనీయాంశమైంది.

అన్ని వర్గాల సంక్షేమమే టీడీపీ అజెండా

- రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్
- క్లాపేటలో ఇంటింటి ప్రచారం

ఒంగోలు(కార్పొరేషన్), మార్చి 12: అన్ని వర్గాల సంక్షేమమే తెలుగుదేశంపార్టీ అజెండా అని, రాబోయే ఎన్నికల్లో టీడీపీ గెలుపుతో ప్రజలు కోరుకున్న సంక్షేమం సాధించుకోవాలని పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. జనం కోసం జనార్దన్ కార్యక్రమాన్ని మంగళవారం నగరంలోని 11వ డివిజన్‌క్లాపేటలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీడీపీ, జనసేన పొత్తులో భాగంగా తాను ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నాని తెలిపారు. ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. గతంలో ఎమ్మెల్యేగా అవినీతికి తావులేకుండా నిస్వార్థంగా పనిచేసి నగరాన్ని అభివృద్ధి చేశానని తెలిపారు. ప్రధానగా నగరంలో రహదారుల విస్తరణ, నగర సుందరికీకరణ, హైమాక్స్ విద్యుత్ దీపాలు ఏర్పాటుతోపాటు పార్కులు అభివృద్ధి చేయడమే కాకుండా వేసవిలోను తాగునీటికి ఇబ్బందులు లేకుండా చేసినట్లు చెప్పారు. తాను చేసిన అభివృద్ధి ప్రజల కళ్ళ ముందు కనిపిస్తుందన్నారు. అలాగే వైసీపీ అధికారంలోకి వచ్చి నాలుగున్నరేళ్ళు అవుతున్నా ఒక్క అభివృద్ధి పని చేయలేదని తెలిపారు. ముఖ్యంగా ఉద్యోగులు, పేద, మధ్య తరగతి ప్రజలపై ఆర్థిక భారాలు మోపిందన్నారు. నిత్యావసర ధరలు పెరుగుదల, కరెంటు చార్జీల మోత, ఆర్టీసీ చార్జీలు భారం, అలాగే చెత్తపైనా పన్ను వేసిన చెత్త ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. ఒక్కచాన్స్ అని అమాయకంగా మాట్లాడి, అన్ని వర్గాల ప్రజలను జగన్‌రెడ్డి నడ్డి విరిచారని విమర్శించారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెండుగా లభిస్తాయని తెలిపారు. నేడు హైదరాబాదు నగరంలో ఐటీ రంగం విస్తరణ చంద్రబాబు నాయుడు హయాంలోనే జరిగిందని, రాబోయే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే భావితరాల భవిష్యత్‌కు బాబు గ్యారెంటీ ఉంటుందని తెలిపారు. రాష్ట్రంలో ఐటీ సంస్థలను నిర్మించి ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుదని, తనకు ఎమ్మెల్యేగా మరో అవకాశన్ని కల్పిస్తే వెనుకబడిన నగర అభివృద్ధిని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు గంగవరపు సందీప్, మాజీ కౌన్సిలర్ మాగులూరి ప్రేమ్‌కుమార్, ఎద్దు శశికాంత్‌భూషణ్, క్లస్టర్ ఇన్‌చార్జి షేక్ కపిల్‌బాషా, మంచు లలిత్‌కుమార్, జెన్ని దివాకర్, మంత్రి శ్రీనివాసరావు, కొరారి నాగేశ్వరరావు, బొల్లినేని వాసుకృష్ణ, కామేపల్లి శ్రీనివాసరావు, బండారు మదన్, పాలూరి వెంకటేశ్వరరెడ్డి, ఆర్ల వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డివిజన్ ప్రజల నుంచి దామచర్ల జనార్దన్‌కు ఘన స్వాగతం పలికారు. భారీ సంఖ్యలో శ్రేణులు పాల్గొన్నాయి.



దామచర్ల జనార్దన్‌కు ఘన స్వాగతం పలుకుతున్న మహిళలు

టీడీపీలోకి
వైసీపీ నాయకుడు నల్లమల్లి బాలు?



దామచర్ల జనార్దన్‌ను శాలువతో సత్కరిస్తున్న బాలు

ఒంగోలు(కార్పొరేషన్), మార్చి 12: వైసీపీ నుంచి తెలుగుదేశంపార్టీలోకి వలసలు పెరుగుతున్నాయి. ఆ పార్టీలో కీలకంగా వ్యవహరించిన కొందరు నాయకులు ఇప్పటికే వీడుతున్నారు. అందులో భాగంగానే వైశ్య సామాజిక వర్గానికి చెందిన పలువురు ఇప్పటికే టీడీపీలో చేరగా, తాజాగా వైసీపీ వాణిజ్య విభాగం నగర అధ్యక్షుడు నల్లమల్లి బాలు తెలుగుదేశం పార్టీలోకి చేరనున్నారు. ఈ మేరకు మంగళవారం విజయవాడలో దామచర్ల జనార్దన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన బాలు, బుధవారం అధికార పూర్వకంగా, ఒంగోలులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో దామచర్ల సమక్షంలో పార్టీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. ఇదే విషయాన్ని బాలూ కూడా వాస్తవమే అని సమాధానమిచ్చారు.

చిలకలూరిపేట బహిరంగ సభను
విజయవంతం చేయాలి : బీఎన్

సంతనూతలపాడు, మార్చి 12: గుంటూరు జిల్లా చిలకలూరిపేటలో ఈనెల 17న సాయంత్రం 5 గంటలకు జరిగే టీడీపీ, జనసేన, బీజేపీల కూటమి బహిరంగసభను విజయవంతం చేయాలని టీడీపీ నియోజకవర్గ అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం ఒంగోలులోని బీఎన్ కార్యాలయంలో టీడీపీ మండల అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జ్లు, మండల సెక్రటరీలతో విజయ్‌కుమార్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి బహిరంగసభకు పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని కోరారు. అంతేగాకుండా నియోజకవర్గంలోని ప్రతీ క్లస్టర్ పరిధిలో జయహో బీసీ సదస్సులు నిర్వహించాలని, బూత్‌ల పరిధిలో శంఖారావం, సూపర్ సిక్స్ రిజిస్ట్రేషన్లు జరగాలని, ప్రతి గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించాలని, టీడీపీ అధికారంలోకి వస్తే జరిగే మేలు ప్రజలకు వివరించాలని సూచించారు. చిలకలూరిపేట బహిరంగసభకు తప్పనిసరిగా నియోజకవర్గం నుంచి పెద్దఎత్తున సభకు హాజరయ్యేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు చౌట శ్రీనివాసరావు, రాష్ట్ర సెక్రటరీ అడకా స్వాములు, మండల అధ్యక్షులు మద్దినేని హరిబాబు, గొట్టిపాటి రాఘవరావు, తేళ్ల మనోజ్‌కుమార్, గొల్లపూడి సుబ్బారావు, కేఎల్. వరప్రసాద్, ఎ.శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

అరుదైన ఆచార్యులు జ్యోతి స్వరూపరాణి

ఒంగోలు(కల్చరల్), మార్చి 12: తన శిష్యులను భావిభారత పౌరులుగా ఎంతో మందిని తీర్చిదిద్దటమే కాకుండా ఒక గొప్ప సాహితీవేత్తగా జిల్లాఖ్యాతిని ఇనుమడింపజేసిన మహిళ గుజ్జర్లమూడి జ్యోతి స్వరూప రాణి అని జానుడి సెంటర్ ఫర్ లిటరేచర్ డైరెక్టర్ నూకతోటి రవికుమార్ అన్నారు. స్వరూపరాణి సంస్మరణ కార్యక్రమం మంగళవారం స్థానిక అంజయ్య రోడ్డులోని ఎస్.ఎస్.కంప్యూటర్స్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెకు పలువురు సాహితీవేత్తలు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రవికుమార్ మాట్లాడుతూ విశిష్ట సాహితీవేత్తగా ఎన్నో జాతీయ సదస్సులలో గొప్ప పరిశోధనా పత్రాలను స్వరూపరాణి సమర్పించారన్నారు. ఎంతో ఆదర్శనీయమైన జీవితం గడిపిన ఆమె మరణం తెలుగు సాహితీ లోకానికి తీరని లోటని పేర్కొన్నారు. కార్యక్రమంలో మహేశ్వరాచారి, బ్రహ్మయ్య, జా న్ సామ్యూల్, సాయి రాజేష్, మోహన్, మాల్యాద్రి, సురేంద్ర పాల్గొన్నారు.

చేయూతతో మహిళలకు ఆర్థిక భరోసా

- మంత్రి నాగార్జున



మద్దిపాడులో చెక్కును అందజేస్తున్న మంత్రి నాగార్జున

మద్దిపాడు, మార్చి 12: చేయూత పథకం ద్వారా ప్రభుత్వం మహిళలకు ఆర్థిక భరోసా కల్పిస్తుందని సాంఘిక సంక్షేమ శాఖమంత్రి మేరుగ నాగార్జున పేర్కొన్నారు. మంగళవారం మద్దిపాడు ఎంపీడీవో కార్యాలయంలో డ్వాక్రా మహిళలకు చేయూత చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ మహిళల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను అములచేస్తోందని చెప్పారు. అనంతరం ఘడియపూడి కాలనీలో రైతు భరోసా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ మండవ అప్పారావు, ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, వైస్ ఎంపీపీ వెంకట్రావు, రాయపాటి రమేష్, బెజవాడ శ్రీరామ్మూర్తి, పోతినేని శ్రీనివాసరావు, గట్టినేని అయ్యన్న, డాక్టర్ సంజీవరావు, ఘడియపూడి సర్పంచ్ బొమ్మల రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ చేయూత

చీమకుర్తి: అర్హలందరికీ చేయూత పథకం కింద లబ్ది కలిగేలా చర్యలు తీసుకుంటామని మంత్రి మేరుగ నాగార్జున తెలిపారు. మంగళవారం చీమకుర్తిలో చేయూత పథకం కింద లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన మంత్రి మేరుగ నాగార్జున, ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు చేతులమీదుగా చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజ్యలక్ష్మి, వైసీపీ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, సొసైటీ చైర్మన్ గోపిరెడ్డి ఓబుల్‌రెడ్డి, చల్లా అంకులు, పాటిబండ్ల గంగయ్య, పాలడుగు సుబ్బారావు, మొగిలిశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ల్యాబ్ మెటీరియల్ అందజేత

ఒంగోలు(విద్య), మార్చి 12 : కరవది జడ్పీ హైస్కూలులోని సైన్స్ ల్యాబ్‌కు అవసరమైన మెటీరియల్‌ను ప్రవాసాంధ్రుడు గోరంట్ల వాసుబాబు మంగళవారం అందజేశారు. రూ.30వేల విలువైన సామగ్రిని స్థానిక డాక్టర్ పోతినేని శంకరరావు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ పి.మల్లికార్జునరెడ్డి, సర్పంచ్ దేవరపల్లి కోటేశ్వరరావు, హెచ్‌ఎం రవికుమార్, ఎంపీటీసీ మన్నె శ్రీనివాసరావు, సొసైటీ ప్రెసిడెంట్ వాకా కృష్ణారెడ్డి, గ్రామపెద్దలు లక్ష్మీకుమారి, పి.వెంకట్రామయ్య పాల్గొన్నారు.

గిరిజన నిరుద్యోగ మహిళలకు శిక్షణ

ఎర్రగొండపాలెం, మార్చి 12 : సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ, ఆధ్వర్యంలో చెంచుగిరిజన మహిళలకు, జనరల్ ఎస్టీ మహిళలకు కుట్టుమిషన్లు, ఫ్యాషన్ డిజైన్స్‌పై ఎర్రగొండపాలెం ఎంపీడీవో కార్యాలయంవద్ద శిక్షణ ఇచ్చేందుకు ఈ నెల 13, 14 తేదీల్లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఐటీడీఏ పీవో రవీంద్రారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అసిస్టెంట్ ఫ్యాషన్ డిజైనర్ కోర్సుకు దరఖాస్తుకు మహిళలు 7వతరగతి ఉత్తీర్ణులై, 18 నుంచి 35 సంవత్సరంలోపు వయస్సు ఉండాలన్నారు. రెండు నెలలు ఉచిత శిక్షణ, భోజన వసతి కల్పించనున్నట్లు తెలిపారు.

బడుగులకు అండ తెలుగుదేశం జెండా

పార్టీ నియోజకవర్గ అభ్యర్థి విజయ్‌కుమార్ • వైసీపీ నుంచి టీడీపీలో చేరిన రాజుపాలెం బీసీలు



అన్నంగిలో కరపత్రాలను అందజేస్తున్న విజయ్‌కుమార్



బీఎన్ సమక్షంలో పార్టీలోకి చేరిన రాజుపాలెంవాసులు

చీమకుర్తి, మార్చి 12 : బడుగు బలహీన వర్గాలకు అండా దండా తెలుగుదేశం పార్టీ అని నియోజకవర్గ ఇన్‌చార్జి బీఎన్.విజయ్‌కుమార్ తెలిపారు. ఎన్నికలు దగ్గరపడే కొద్ది వైసీపీ నుంచి టీడీపీలోకి వలసల పరంపర సాగుతున్నది. మంగళవారం రాజుపాలెం గ్రామానికి చెందిన బీసీ నాయకులు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరారు. వీరందరికీ విజయ్‌కుమార్ పార్టీ కండువా కప్పి సాదరంగా స్వాగతించారు. అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని, సీఎంగా నారా చంద్రబాబునాయుడు వస్తే అందరి భవిష్యత్ బాగుంటుందన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి ఓటు వేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రావులపల్లి వెంకటేష్, తనికొండ రవి, ఏడుకొండలు, కుర్ర మల్లిఖార్జున, రావులపల్లి శివ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పతనం ఖాయం

మద్దిపాడు: వైసీపీ పతనం ఖాయమని టీడీపీ నియోజకవర్గ అభ్యర్థి బీఎస్.విజయకుమార్ పేర్కొన్నారు. మంగళవారం అన్నంగి గ్రామంలో జరిగిన బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రయోజనాల కోసమే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడ్డాయని చెప్పారు. జగన్‌రెడ్డి నిరంకుశ పాలన సాగిస్తున్నారని, అలాంటి పాలనకు ఓటుతో స్వస్తి చెప్పాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం, ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని కూటమికి ఓటు వేయ్యాలన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అడకా స్వాములు మాట్లాడుతూ సీఎం జగన్ బీసీలకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు నున్న బాలసుబ్రహ్మణ్యం, నాయకులు మండవ గోపీనాథ్, రాయపాటి శ్రీనివాసరావు, పొద కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పించిన బీఎన్

నాగులుప్పలపాడు: పలువురు తెలుగుదేశం పార్టీ నాయకుల కుటుంబ సభ్యులను ఆ పార్టీ నియోజకవర్గ అభ్యర్థి బీఎస్.విజయ్‌కుమార్ పరామర్శించారు. బి.నిడమనూరుకు చెందిన ఊదరగుడి ఏసురత్నం పెద్దకర్మకు ఆయన హాజరై నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ మండల కార్యదర్శి కాకర్ల లక్ష్మీవరప్రసాద్, నందిగం కోటయ్య, అంకిరెడ్డి, పైడి నాగేశ్వరరావు ఉన్నారు. అలాగే ఉప్పుగుండూరులో యాదవ కాలనీ చెందిన మిండాల మునెమ్మ గుండెపోటుతో మృతి చెందగా బీఎన్, మండల అధ్యక్షులు తేళ్ళ మనోజ్ కుమార్ ఆమె మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో లక్ష్మీవరప్రసాద్, కాట్రగడ్డ చంద్రబాబు, కనగాల శ్రీనివాసరావు, సెల్వం, తెలగతోటి జాన్సన్, శ్రీకాంత్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులతో ఆత్మీయ సమ్మేళనం

ఉద్యోగావకాశం కల్పించిన జగన్‌కు అండగా ఉండాలి • ఎమ్మెల్యే బాలినేని పిలుపు • ఎన్నికల ముందే ప్రలోభాలు ప్రారంభం

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 12: నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి మరోసారి అవకాశం కల్పించాలని ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. సచివాలయ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం పేరుతో ఒంగోలులోని అంబేద్కర్ భవన్‌లో మంగళవారం రాత్రి ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభలో బాలినేని ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే గ్రామ, వార్డు సచివాలయాలు ఏర్పాటు చేసి లక్షలాది పోస్టులు సృష్టించి ఉద్యోగ అవకాశాలు కల్పించారన్నారు. అన్ని విధాలుగా ముఖ్యమంత్రి అండగా ఉంటున్నందున వచ్చే ఎన్నికల్లో మద్దతు ఇవ్వాలని కోరారు. ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాకర్ల వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ మనకు ఉద్యోగ అవకాశం కల్పించిన సీఎంకు అండగా ఉండాలని సూచించినట్లు తెలుస్తోంది. కాగా ఆత్మీయ సమ్మేళనం పేరుతో ఒంగోలు నగరంతోపాటు ఒంగోలు రూరల్, కొత్తపట్నం మండలంలో పనిచేసే సచివాలయ ఉద్యోగులను ఆహ్వానించి ప్రలోభాలకు తెరలేపారు. ఎన్నికల నోటిఫికేషన్ త్వరలో వస్తుందన్న తరుణంలో ఉద్యోగులతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేయడంపై పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాగా మీటింగ్‌లో పాల్గొన్న ఉద్యోగులకు గిఫ్ట్‌ప్యాక్‌లు కూడా అందజేసినట్లు తెలుస్తోంది.

16న కొత్తకోటలో పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ఠ

- రేపటి నుంచి పూజలు

ఒంగోలు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): నాగులుప్పలపాడు మండలం కొత్తకోట గ్రామంలో పోలేరమ్మ తల్లి శిలా విగ్రహ ప్రతిష్ఠ ఈనెల 16న వైభవంగా జరగనుంది. ఎన్నో దశాబ్దాల నుంచి పరిసర ప్రాంతంలో ప్రముఖంగా ఉన్న పోలేరమ్మ గుడి శిథిలావస్థకు చేరగా పునర్నిర్మాణానికి గ్రామస్థులు శ్రీకారం చుట్టారు. గ్రామపెద్దలు నల్ల మోతు వీరభద్రరావు, కోనూరి వెంకట్రామయ్య, చిన్నల సురేష్‌బాబు, కోనూరి ఆంజనేయులు తదితరులు చొరవ చూపగా గ్రామస్థులతో పాటు వివిధ ప్రాంతాల్లో ఉద్యోగ, వ్యాపార, వివిధ వృత్తులలో స్థిరపడిన కొత్తకోటవాసులు భారీగా నిధులు సమకూర్చారు. దీంతో ఏడాది కాలంలోనే నూతన దేవాలయ నిర్మాణం పూర్తయింది. ఈనెల 16న ఉదయం 8.54 గంటలకు నూతన శిలా విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం జరగనుంది. ఇందుకు సంబంధించి 14వతేదీ నుంచి మూడురోజులు పూజా కార్యక్రమాలు జరగనున్నాయి. అందులో భాగంగా ఈనెల 15వతేదీ సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించనున్నారు. విగ్రహ ప్రతిష్ఠ రోజున అన్నదాన కార్యక్రమం నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.



నిర్మాణం పూర్తయిన ఆలయ ముఖద్వారం



ఆలయంలో జరుగుతున్న ఏర్పాట్లు

సమాన హక్కుల కోసం మహిళలు ఉద్యమించాలి : ఐద్వా

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 12 : సమానత్వం కోసం, సమాన హక్కుల సాధన కోసం మహిళలు ఉద్యమించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి పిలుపునిచ్చారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) ఆవిర్భావ దినోత్సవం మంగళవారం ఒంగోలులోని సంఘ కార్యాలయంలో జరిగాయి. సీనియర్ నాయకురాలు వై.అంజనీదేవి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి ముందే కృష్ణా జిల్లా గరికపర్రులో మహిళా సంఘం ఏర్పడిందన్నారు. ఆ కాలంలోనే మహిళలకు భర్త ఆస్తిలో హక్కు కావాలని పోరాడారన్నారు. దేశ సంపదను దోచుకుంటూ ప్రజలను బానిసల్లా చూస్తున్న నాటి బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా స్వాతంత్ర్యోద్యమంలో అనేక మంది మహిళలు వీరోచితంగా పాల్గొన్నారని తెలిపారు. జిల్లా అధ్యక్షురాలు సయ్యద్ షర్మిల మాట్లాడుతూ భారత రాజ్యాంగం స్త్రీపురుషులకు సమాన హక్కులు ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో నాయకులు జి.ఆదిలక్ష్మి, కె.రాజేశ్వరి, జి.కళ్యాణి, బి.గోవిందమ్మ, ఎన్.భవానీ, నాగరాణి, అనురాధ, గురవమ్మ తదితరులు పాల్గొన్నారు.





ఒంగోలు, మంగమూరుల్లో జెండాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

జెండా ఆవిష్కరణ

సంతనూతలపాడు: ఐద్వా ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగమూరులో మండల అధ్యక్షురాలు బంకా పద్మ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అబ్బూరి బసవమ్మ, ఎ.రమణమ్మ, నాగూర్‌బి, ఆదిలక్ష్మి, అంజమ్మ, సుజాత, పద్మ పాల్గొన్నారు. కాగా సంతనూతలపాడులో ఐద్వా మండల కార్యదర్శి ఎన్.మాలతి ఆధ్వర్యంలో మంగళవారం జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బుజ్జి, రేవతి, అంకమ్మ పాల్గొన్నారు.

ఆవుపై పెద్దపులి దాడి

పెద్దారవీడు, మార్చి 12 : ఆవుపై పెద్దపులి దాడిచేసి చంపివేసిన ఘటన పెద్దారవీడు మండలం కాటంరాజు తాండ సమీపములో మంగళవారం వెలుగు చూసింది. మండలంలోని చర్ల సమీపములోని కాటంరాజు తాండాకు చెందిన మేఘావత్ శ్రీరాములు నాయక్‌కు చెందిన ఆవులు రెండు రోజుల క్రితం మేత కోసం అడవికి వెళ్లాయి. అయితే రెండు ఆవులపై పులి దాడి చేసింది. అయినప్పటికీ ఒక ఆవు దాడి నుంచి తప్పించుకొని ఇంటికి వచ్చింది. దీంతో ఆయన అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అడవిలో గాలించగా ఒక ఆవు కళేబరం దొరికింది. దీంతో అటవీశాఖ అధికారులు ఆ ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. మరుసటి రోజు ఆ ప్రాంతానికి పులి వచ్చి సంచరించిన దృశ్యాలు రికార్డయ్యాయి. ఘటనా స్థలాన్ని డీఆర్‌వో నాగరాజు పరిశీలించారు. దీంతో గుండంచర్ల, కాటంరాజు తాండా కలనూతల, లోయ ప్రజలు ఆందోళనచెందుతున్నారు.



ఆవు కళేబరాన్ని పరిశీలిస్తున్న అధికారులు

అవీ..ఇవీ..

ఇంటర్ పరీక్షలకు 1,645 మంది గైర్హాజరు

ఒంగోలు(విద్య), మార్చి 12 : జిల్లాలో జరుగుతున్న ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా మంగళవారం జరిగిన ఇంటర్ మొదటి సంవత్సరం ఫిజిక్స్-1, ఎకనామిక్స్ పరీక్షకు 1,645 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షలకు మొత్తం 23,940 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. కాగా ఆర్‌ఐవో సైమన్‌విక్టర్ కనిగిరి, పామూరు, సీఎస్‌పురంలోని ఆరు పరీక్షా కేంద్రాలను సందర్శించారు. ఇతర అధికారులు 50 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ఆర్‌ఐవో తెలిపారు.

ఘనంగా వైసీపీ ఆవిర్భావ దినోత్సవం



జెండాను ఆవిష్కరించిన ఎమ్మెల్యే బాలినేని తదితరులు

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 12 : వైసీపీ ఆవిర్భావ దినోత్సవం మంగళవారం ఒంగోలులోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డిలు జెండాను ఆవిష్కరించారు. అనంతరం దివంగత సీఎం రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఒడా చైర్‌పర్సన్ సింగరాజు మీనాకుమారి, మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు, మహిళా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, నాయకులు గోలి తిరుపతిరావు, గంటా రామానాయుడు, క్రాంతికుమార్, సువర్ణ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



అట్టలను అందజేస్తున్న నిర్వాహకులు

ఒంగోలు(విద్య), మార్చి 12: ఒంగోలు నగరం బాలాజీనగర్ మునిసిపల్ హైస్కూలులో పదో తరగతి విద్యార్థులకు మంగళవారం డీఆర్‌ఆర్‌ఎం మునిసిపల్ హైస్కూలు 1984-85 పూర్వ విద్యార్థులు పంపిణీ చేశారు. అలాగే లామినేటెడ్ గ్రూపు ఫొటోలను అందజేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి శివప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసి మంచి మార్కులు సాధించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విశ్వనాథ్ పూర్వ విద్యార్థులు కరేటి రవి, కూరపాటి రాజా, అప్పల సుబ్బారావు, సాంబయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

పొగాకు గరిష్ఠ ధర 231

సంతనూతలపాడు, మార్చి 12: పేర్నమిట్ట సమీపంలో ఒంగోలు-1వ పొగాకు బోర్డు వేలం కేంద్రంలో మంగళవారం పొగాకు కిలో గరిష్ఠ ధర రూ.231 పలికింది. కొణిజేడు నుంచి 595 బేళ్లు రాగా 505 బేళ్లు అమ్ముడయ్యాయి. 90 బేళ్ల తిరస్కరణకు గురైనట్లు ఆక్షన్ సూపరింటెండెంట్ రవికాంత్ తెలిపారు. గరిష్ఠ ధర రూ.231లు పలకగా, కనిష్ఠ ధర రూ.230లు పలికింది. సరాసరి ధర రూ.227.44 వచ్చినట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో కొనుగోలు 20 కంపెనీల ప్రతినిధులు, రైతు నాయకులు, రైతులు పాల్గొన్నారు.

భవిత కేంద్రం ఆకస్మిక తనిఖీ



మాట్లాడుతున్న మల్లికార్జునరావు

ఒంగోలు(విద్య), మార్చి 12 : ఒంగోలు నగరం ప్రకాశం దళితకాలనీలోని ఎంపీపీ స్కూలులో నిర్వహిస్తున్న భవిత కేంద్రాన్ని రాష్ట్ర సహిత విద్య పరిశీలకులు జి.మల్లికార్జునరావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. జరుగుతున్న కార్యక్రమాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంకితభావంతో పనిచేసి విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కో ఆర్డినేటర్ ఎం.రమేష్, రిసోర్స్‌టీచర్లు మాలిక్ మొహిద్దీన్, నాగేంద్ర, హెచ్‌ఎం ఎం.జ్యోతి పాల్గొన్నారు.

నేడు పేస్‌లో ప్రాంగణ ఎంపికలు

ఒంగోలు(విద్య), మార్చి 12: ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం శ్రీరామ ఫైనాన్స్ కంపెనీ ఆధ్వర్యంలో ప్రాంగణ ఎంపికలు జరుగుతాయని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024 బ్యాచ్ బీటెక్ సివిల్, మెకానికల్, ఈఈఈ, ఆల్ మొబైల్ ఇంజనీరింగ్, ఎంబీఏ విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. విద్యార్థులు తమ రెజ్యూమ్, సర్టిఫికెట్ల జెరాక్స్ కాపీలు, పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఆధార్ జెరాక్స్ కాపీలో హాజరుకావాలన్నారు ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

చిన్నారులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

ఒంగోలు(కల్చరల్), మార్చి 12: రంజాన్ మాసం ప్రారంభమైన సందర్భంగా బేస్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఒంగోలు నగరం హౌసింగ్‌బోర్డు కాలనీ బొమ్మరిల్లు అనాథ బాలల ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ మహబూబ్ మాట్లాడుతూ తమ ఫౌండేషన్ ఏర్పాటు చేసిన దగ్గర నుంచి బొమ్మరిల్లు చిన్నారులకు అనేకవిధాలుగా సహాయం చేస్తున్నామని, రంజాన్ మాసంలో చేసే ఎటువంటి పుణ్యకార్యమైన అనేక రెట్లు ఫలితాన్ని ఇస్తుందన్నారు. కార్యక్రమంలో బొమ్మరిల్లు నిర్వాహకురాలు పి.రాజ్యలక్ష్మి, ఖాసిం, నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు, షేక్ అబ్దుల్‌కరీమ్, నత్తల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్జేడీ తనిఖీలు

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 12: ఒంగోలు నగరం బండ్లమిట్టలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలను మంగళవారం పాఠశాల విద్య ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థినులు బైజ్యూస్ ట్యాబ్‌ల వినియోగం, ఐఎఫ్‌పీ ప్యానల్ వినియోగాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల టీచర్లకు ఆయన పలు సూచనలు చేశారు. విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలను మెరుగు పరిచి వారిని సమర్థులుగా తీర్చిదిద్దాలన్నారు. ఏప్రిల్ జరిగే గేట్‌ఫెల్ పరీక్షకు విద్యార్థులను సంసిద్ధులను చేయాలన్నారు. ఇంగ్లీషు మాట్లాడే శక్తిని పెంపొందించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో కిషోర్‌బాబు, హెచ్‌ఎం కృష్ణకుమారి పాల్గొన్నారు.

టాయిలెట్లను పరిశుభ్రంగా ఉంచాలి



మాట్లాడుతున్న నాగార్జునయాదవ్

ఒంగోలు(విద్య), మార్చి 12: పాఠశాలల్లో టాయిలెట్ల మరమ్మతులకు ఎస్‌ఎంఎస్ నిధులను వినియోగించాలని, వాటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తూ పరిశుభ్రంగా ఉంచాలని ఏపీఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ నాగార్జునయాదవ్ సూచించారు. మంగళవారం ఒంగోలులోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలను సందర్శించిన ఆయన పాఠశాలలోని నాడు-నేడు పనులను, టాయిలెట్లను, మౌలిక సదుపాయాలను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. మెనూ తెలుసుకొని అందరూ పాఠశాలలో అందించే మధ్యాహ్న భోజనాన్ని తీసుకోవాలని సూచించారు కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భాస్కరబాబు, డీఈ బి.విశ్వనాథం, ఏఈ సందీప్‌కుమార్, హెచ్‌ఎం జి.కృష్ణకుమారి పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి పుష్పాభిషేకం



స్వామివారికి పుష్పాభిషేకం చేస్తున్న అర్చకులు

ఒంగోలు రూరల్, మార్చి 12: ఒంగోలు నగరం కొప్పోలులోని శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థాన ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం స్వామివారికి పుష్పాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసర గ్రామాల ప్రజలు, గ్రామస్థులు స్వామివార్లకు ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

బింగినపల్లి వైసీపీలో భగ్గుమన్న విభేదాలు

పల్లెపల్లెకు సురేష్ కార్యక్రమాన్ని బహిష్కరించిన సర్పంచ్ వర్గీయులు

తమను సంప్రదించకుండా సచివాలయ సముదాయాన్ని ప్రారంభించడంపై గుర్రు



ప్రచార రథంపై నుంచి మాట్లాడుతున్న మంత్రి సురేష్

సింగరాయకొండ, మార్చి 12 : మండలంలోని బింగినపల్లి వైసీపీలో విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి.మంగళవారం రాత్రి గ్రామంలో నిర్వహించిన పల్లెపల్లెకు సురేష్ కార్యక్రమాన్ని వైసీపీ సర్పంచ్ జెట్టి విజయలక్ష్మి, ఆమె వర్గీయులు బహిష్కరించారు. స్వయానా మంత్రి సురేష్, ఆయన పీఏలు మాట్లాడినా తాము పాల్గొనేది లేదని కరాఖండిగా చెప్పారు. వైసీపీ మండల అధ్యక్షుడు, బింగినపల్లి ఎంపీటీసీ సభ్యుడైన సామంతుల రవిరెడ్డికి, సర్పంచ్ వర్గీయులకు గత కొంతకాలంగా పొసగడం లేదు. ఈక్రమంలో సర్పంచ్‌ని సంప్రదించకుండా గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయ సముదాయన్ని ప్రారంభించేందుకు రవిరెడ్డి మంత్రి చేత తేదీని ఖరారు చేయించారు. మంగళవారం రాత్రి మంత్రి గ్రామంలో పర్యటించి సచివాలయ సముదాయంతోపాటు, పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. అయితే ఈ సచివాలయ భవనాలను దాదాపు నెల క్రితమే సర్పంచ్ విజయలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు రవిరెడ్డి ప్రారంభించారు. నూతన భవనాలలోనే సిబ్బంది కూడా విధులు నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో సచివాలయ భవనాలను మంత్రి చేత మరోసారి ప్రారంభోత్సవం చేయించడం విమర్శలకు తావిస్తోంది. వైసీపీలో తమను కుట్రపూరితంగానే అణగతొక్కుతున్నారని, కనీస గౌరవం ఇవ్వడం లేదని సర్పంచ్ వర్గీయులు ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ఆవుపై పెద్దపులి దాడి

భయాందోళనలో లోయ గ్రామాల ప్రజలు



ఆవు కళేబరాన్ని పరిశీలిస్తున్న డీఆర్వో నాగరాజు, సిబ్బంది

పెద్దారవీడు, మార్చి 12 : ఆవుపై పెద్దపులి దాడిచేసి చంపివేసిన ఘటన పెద్దారవీడు మండలం, కాటంరాజుతాండ సమీపంలో మంగళవారం వెలుగుచూసింది. డీఆర్‌వో నాగరాజు కథనం ప్రకారం.. మండలంలోని చర్ల సమీపంలోని కాటంరాజుతాండాకు చెందిన మేహావత్ శ్రీరాములునాయక్‌కు చెందిన ఆవులు రెండురోజుల క్రితం మేత కోసం అడవికి వెళ్లాయి. అక్కడ రెండు ఆవులపై పులి దాడి చేసింది. అయినప్పటికీ ఒక ఆవు దాడి నుంచి తప్పించుకొని ఇంటికి వచ్చింది. దీంతో ఆయన అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అడవిలో గాలించగా ఆవు కళేబరం దొరికింది. దీంతో అటవీశాఖ అధికారులు ఆ ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. మరుసటి రోజు ఆ ప్రాంతానికి పులి వచ్చి సంచరించింది. ఆ దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. ఘటనా స్థలాన్ని డీఆర్‌వో నాగరాజు, సిబ్బంది పరిశీలించారు. గ్రామ సమీపంలో జరిగిన ఘటనతో గుండంచర్ల, కాటంరాజు తాండా కలనూతల, లోయ గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

తాళ్లూరు, మార్చి 12: ఇంటి ఖర్చులను పట్టించుకోకుండా డబ్బులు దుబారా చేస్తున్న భర్త తీరుపై మనస్తాపం చెందిన భార్య ఆత్మహత్యాయత్నానికి ఘటన చోటుచేసుకుంది. దీనిపై మంగళవారం కేసు నమోదైంది. భర్త తన మాట వినలేదన్న బాధతో లక్కవరానికి చెందిన కందుల జాష్మి (25) పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి 10 రోజులుగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు లక్కవరం గ్రామానికి లాజర్, జాష్మి భార్యాభర్తలు. వీరిద్దరూ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కూలిడబ్బులను భర్త లాజర్ ఇంటి ఖర్చులకు ఇవ్వడం లేదు. దీనిపై పలుమార్లు భార్య ప్రశ్నించినా పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో ఈనెల 3న పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆమెను గుంటూరు ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. ఆమెకు ముగ్గురు పిల్లలున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై వైవీ రమణయ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని ఏఎస్సై మోహన్‌రావు పోస్టుమార్టంకు తరలించారు.

పాడి రైతులకు చేయూత

కనిగిరి, మార్చి 12: పాడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం చేయూత అందిస్తుందని జిల్లా పశు సంవర్థక శాఖ జేడీ బేబీరాణి అన్నారు. స్థానిక పశు వైద్యశాలను మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె వైద్యశాలలోని పలు రికార్డులను, అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. సంచార పశు వైద్యశాలలో అందిస్తున్న సేవలపై అడిగి తెలుసుకున్నారు.

చెత్త 'కొండ'పి

- రోడ్లపైనే వ్యర్థాలు
- పట్టించుకునే నాథుడు కరువు
- జాడలేని చెత్తసంపద కేంద్రం
- పనికిరాకుండాపోతున్న యంత్రాలు



టంగుటూరుకు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డుపైనే వ్యర్థాలు



పెదకండ్లగుంట రోడ్డులో పీడబ్ల్యూడీ చెరువు వద్ద పేరుకుపోయిన వ్యర్థాలు

కొండపి, మార్చి 12 : నియోజకవర్గ కేంద్రం చెత్త 'కొండ'పిగా మారింది. గ్రామం నలువైపులా రోడ్లపైనే వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. దీంతో దోమల బెడద, దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఒక ప్రాంతం నివాసితులు మరోప్రాంతంలో వ్యర్థాలను పోస్తూ మొత్తంగా కొండపిని చెత్తకు కేంద్రంగా మార్చారు. అధికారులు కూడా ప్రేక్షకపాత్ర వహిస్తుండటంతో ఇప్పుడు పంచాయతీ కాలుష్యకాసారమైంది. గ్రామ పంచాయతీకి ట్రాక్టరు ఉన్నా చెత్తను సేకరించని దుస్థితి నెలకొంది. పారిశుధ్య కార్మికులు ఉన్నప్పటికీ చెత్తను సేకరించడం కానీ, వేరు చేసి తిరిగి సంపదను, ఆదాయాన్ని గ్రామ పంచాయతీకి రాబట్టే పరిస్థితి కానీ లేదు. వైద్యశాలలు, హోటళ్లు, కూరగాయల దుకాణాలతోపాటు కొబ్బరి బోండాల వ్యర్థాలు, ప్లాస్టిక్, ఇతర పాత సామగ్రిని కూడా రోడ్లవెంట పోస్తున్నారు.

ఊరికి నలువైపులా చెత్తకుప్పలు

కొండపి నుంచి టంగుటూరు, కామేపల్లి, పొదిలి, సంతనూతపాడు, పెదకండ్లగుంట వెళ్లే రోడ్ల వెంబడి వ్యర్థాలు కుప్పలుగా దర్శనమిస్తున్నాయి. అక్కడ పందులు, కుక్కలు గుంపులుగా చేరి వాహనదారులకు అడ్డుపడుతుండటంతో ప్రమాదాలు చోటుచేసుకొని పలువురు గాయపడిన సంఘటనలు ఉన్నాయి. ప్రధానంగా పెదకండ్లగుంట రోడ్డులో పీడబ్ల్యూడీ చెరువు ఒడ్డున పెద్దపెద్ద కొండలుగా వ్యర్థాలు పోశారు. జేసీబీతో పదేపదే చెరువులోకి నెడుతున్నా, తిరిగి చెత్తను అక్కడే వేస్తున్నారు.

ట్రాక్టరు, యంత్రాలు నిరుపయోగం

టీడీపీ ప్రభుత్వ హయాంలో గ్రామ పంచాయతీలో చెత్తసేకరణకు ఒక ట్రాక్టరును ప్రభుత్వం ఇచ్చింది. దీంతోపాటు తడి, పొడి, ప్లాస్టిక్, నాన్ ప్లాస్టిక్ వ్యర్థాలను పొడిచేసే రెండు యంత్రాలను కూడా పంపింది. అయితే ట్రాక్టరును కానీ, యంత్రాలను కానీ ఆతర్వాత గ్రామ పంచాయతీ వినియోగించలేదు. వాటిని పాడుబెట్టేశారు. అధికారులు కూడా ఉదాసీనంగా వ్యవహరిస్తుండటంతో ఈ దుస్థితి ఏర్పడింది. చెత్త వేయవద్దని గ్రామ పంచాయతీ బోర్డులు ఏర్పాటు చేసినా రాత్రిళ్లు తెచ్చి పోస్తున్నారని స్థానికులు వాపోతున్నారు.

చెత్త సంపద కేంద్రం ఎక్కడ?

కొండపిలో టీడీపీ ప్రభుత్వ హయాంలో ముక్కోడిపాలెం గ్రామ సమీపంలోని ప్రభుత్వ స్థలంలో చెత్త సంపద కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కొంతకాలానికి అది తగులబడింది. ప్రభుత్వ స్థలాన్ని అప్పటికే వినియోగించుకుంటున్న వారు తమ పొలాల మధ్యలో చెత్త కేంద్రం ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకించారని తెలిసింది. తర్వాత కేంద్రం తగులబడటానికి ఇది కూడా ఒక కారణమని అప్పట్లో ప్రచారం జరిగింది. అనంతరం చెత్త సంపద కేంద్రం ఎక్కడా ఏర్పాటు చేయలేదు. ఏడాది క్రితం డీపీవో కొండపిలోని పలు వాగులు, వంకల పోరంబోకు భూములను పరిశీలించారు. జాళ్లపాలెం రోడ్డులో ఒక స్థలాన్ని చెత్త సంపద కేంద్రం నిర్మాణానికి అనువైనదిగా గుర్తించి ప్రతిపాదనలు పంపాలని తహసీల్దార్‌ను కోరారు. తర్వాత ఏమైందో ఏమో కానీ నిర్మాణ పనులు ముందుకు కదలలేదు. మొత్తంగా ఇప్పుడు చెత్తకు నిలయంగా నియోజకవర్గ కేంద్రం మారింది. సంబంధిత అధికారులు స్పందించి చెత్తను గ్రామానికి దూరంగా తరలించి, సంపద కేంద్రం ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

వైద్యశాలల వ్యర్థాలు పోస్తున్నారు..

యనమద్ని వెంకటేశ్వర్లు, ఎస్సీ కాలనీవాసి, కొండపి.

కొండపిలోని టంగుటూరు రోడ్డులో ఉన్న ఎస్సీ కాలనీకి సమీపంలో ఆర్‌అండ్‌బీ రోడ్డు వెంట పలు రకాల వ్యర్థాలను పోస్తున్నారు. ఈదారిలో నడవాలంటే చాలా ఇబ్బందికరంగా ఉంది. వైద్యశాలల్లో వినియోగించిన సిరంజిలు, కాటన్, ఆపరేషన్ చేసిన వ్యర్థాలు కూడా ఇక్కడే వేస్తున్నారు. ఆహారం కోసం వచ్చిన పందులు, కుక్కలు వ్యర్థాలను రోడ్డుమీదకు లాగుతున్నాయి. పాదచారులు, వాహనదారులు తిరిగే వీలులేదు. దుర్వాసనతో చాలా ఇబ్బందులు పడుతున్నాం.

క్రైస్తవుల అభ్యున్నతికి టీడీపీ కృషి



మాట్లాడుతున్న చంద్రశేఖర్

టంగుటూరు, మార్చి 12 : రాష్ట్రంలో క్రైస్తవుల అభ్యున్నతికి టీడీపీ కృషి చేస్తుందని మాజీ ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్ అన్నారు. క్రైస్తవ దైవసేవకుల ఆత్మీయ సదస్సు స్థానిక బైసైడ్ కల్యాణ మండపంలో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నాయకులు కామని విజయకుమార్, బెజవాడ వెంకటేశ్వర్లుతో కలిసి చంద్రశేఖర్ పార్టీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. వాటి గురించి వివరించారు. టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి బ్రహ్మనందం, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు భానుచందర్, నియోజకవర్గ అధ్యక్షుడు కసుకుర్తి భాస్కర్, పలువురు దైవసేవకులు పాల్గొన్నారు.

చంద్రమౌళికి టీడీపీ నాయకుల పరామర్శ

తీవ్ర అనారోగ్యానికి గురై ఆపరేషన్ చేయించుకొని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న టంగుటూరు అంబేడ్కర్‌నగర్‌కు చెందిన టీడీపీ నాయకుడు దేవరపల్లి చంద్రమౌళిని ఆపార్టీకి చెందిన పలువురు నేతలు మంగళవారం పరామర్శించారు. పార్టీ మండల అధ్యక్షుడు కామని విజయకుమార్, మాజీ సర్పంచ్ బెల్లం జయంత్‌బాబు, మాజీ ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్, తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు తదితరులు చంద్రమౌళి నివాసానికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. వారి వెంట టీడీపీ నాయకులు జక్కుల శ్రీను, ఈశ్వరరావు ఉన్నారు.

వృద్ధుడికి పింఛన్ సొమ్ము అందజేత

'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్



సుబ్బయ్యకు పింఛన్ అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శి

మర్రిపూడి, మార్చి 12 : మండలంలోని రామాయపాలెంలో పదిరోజులుగా పింఛన్ కోసం పడిగాపులు కాస్తున్న తుళ్లూరు సుబ్బయ్యకు ఎట్టకేలకు మంగళవారం అధికారులు నగదును అందజేశారు. గ్రామానికి చెందిన వలంటీర్ కక్షపూరితంగా సుబ్బయ్యకు పింఛన్ ఇవ్వకుండా ఇబ్బంది పెట్టారు. దీనిపై ఆయన స్పందనలో జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. ఎంపీడీవో ఎస్.సుదీపను బాధితుడు ఆశ్రయించినప్పటికీ వలంటీర్ ఖాతరు చేయలేదు. దీంతో 'పింఛన్ కోసం వృద్ధుడి పడిగాపులు' శీర్షికన మంగళవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీనిపై అధికారులు స్పందించారు. ఎంపీడీవో ఆదేశాల మేరకు పన్నూరు పంచాయతీ కార్యదర్శి ఎం.పిచ్చయ్యబాబు హుటాహుటిన రామాయపాలెం గ్రామానికి చేరుకొన్నారు. వలంటీర్ వద్ద నగదును స్వాధీనం చేసుకొని సుబ్బయ్యకు పింఛన్ సొమ్మును అందజేశారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లు పట్టివేత

పర్చూరు, మార్చి 12: అక్రమంగా మద్యం బాటిళ్లను తరలిస్తున్న వ్యక్తిని మంగళవారం పర్చూరు పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని నూతలపాడు - చింతగుంటపాలెం రహదారి మధ్యలో యద్దనపూడి మండలం పూనూరుకు చెందిన మధార్‌వలి అనే వ్యక్తి 29 క్వార్టర్ మద్యం బాటిళ్లను తరలిస్తుండగా ఎస్సై రమేష్ అధ్వర్యంలో పట్టుకుని స్థానిక పోలీసు స్టేషన్‌కు తరలించారు.

మండల పరిషత్ సమావేశం తూతూమంత్రం

మెజారిటీ సభ్యులు, అధికారులు గైర్హాజరు



వెలవెలబోతున్న మండల సర్వసభ్యసమావేశం

సింగరాయకొం, మార్చి 12 : సింగరాయకొండ మండల సర్వసభ్య సమావేశం తూతూమంత్రంగా జరిగింది. మెజారిటీ సభ్యులు, అధికారులు గైర్హాజరయ్యారు. ఎంపీపీ కట్టా శోభారాణి అధ్యక్షతన మంగళవారం సమావేశం నిర్వహించారు. మండలలోని స్థానిక సంస్థల ప్రతినిధులైన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యుల్లో ఎక్కువ మంది హాజరు కాలేదు. 10 మంది సర్పంచులకు గానూ కేవలం ఇద్దరు, 19 ఎంపీటీసీల సభ్యులకు నలుగురు మాత్రమే పాల్గొన్నారు. మండలంలోని వివిధ విభాగాలకు అధికారుల సంఖ్య కూడా నామమాత్రంగానే ఉంది. హాజరైన వారు గ్రామాల్లోని తాగునీరు, విద్యుత్ సమస్యలను సమావేశం దృష్టికి తెచ్చారు. సభ్యుల సంఖ్య తక్కువగా ఉండటంతో అర్ధ గంట లోపే సమావేశాన్ని ముగించి మమ అనిపించారు. ఎంపీడీవో నగేష్‌కుమారి, జడ్పీ వైస్‌చైర్‌పర్సన్ యన్నాబత్తిన అరుణ, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

దళితులు ఐక్యంగా పనిచేయాలి

నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమావేశంలో మంత్రి నాగార్జున



మాట్లాడుతున్న మంత్రి నాగార్జున, పక్కన మంత్రి సురేష్

సింగరాయకొండ, మార్చి 12 : కొండపి నియోజకవర్గంలోని మాల, మాదిగలు ఐక్యంగా పనిచేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక గంజి వారి కల్యాణ మండపంలో నిర్వహించిన వైసీపీ కొండపి నియోజకవర్గ దళితుల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇక్కడ వైసీపీ నావ సరిగాలేదనే జగన్‌మోహన్‌రెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆదిమూలపు సురేష్‌ను పంపించారన్నారు. దళితులు కలిసికట్టుగా పనిచేసి ఆయన్ను గెలిపించాలని కోరారు. మంత్రి ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ గత రెండు పర్యాయాలు కొండపి నియోజకవర్గ అభ్యర్థులుగా మాల సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులకు వైసీపీ అవకాశం ఇచ్చిందని చెప్పారు. వివిధ కారణాలతో వారు ఓటమి చెందారని తెలిపారు. ఈనేపథ్యంలో గతానికి భిన్నంగా తొలిసారిగా మాదిగ సామాజిక వర్గానికి చెందిన తనను జగనన్న కొండపి నియోజకవర్గానికి పంపి సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. మాల, మాదిగలు ఐక్యంగా ఇతర కులాలతో కలిసి తన గెలుపునకు కృషి చేయాలని కోరారు. సమావేశంలో నియోజకవర్గంలోని వైసీపీకు చెందిన పలువురు దళిత నాయకులు పాల్గొన్నారు.

రోడ్లు బాగులేవని.. పల్లెలకు రాని బస్సు

- ధ్వంసమైన రహదారులు
- పట్టించుకోని వైసీపీ పాలకులు
- విద్యార్థులకు తిప్పలు
- బడికి వెళ్లాలంటే రోజుకు రూ.50 ఖర్చు
- ప్రమాదమైనా తప్పని ఆటో ప్రయాణం
- పది పరీక్షలకు ఎలా వెళ్లాలని ఆందోళన



నేరళ్లవాగుపై గ్రామస్థులు నిర్మించుకున్న అప్రోచ్‌రోడ్డు(ఫైల్)



ఛిద్రమైన రేణిమడుగురోడ్డు



ధ్వంసమైన రోడ్డులో ఆటోలో స్కూల్‌కు వెళ్తున్న విద్యార్థులు(ఫైల్)



పామూరు, మార్చి 12 : పల్లె ప్రయాణం నరకంగా మారింది. రోడ్లు అధ్వానంగా మారడంతో ఆర్టీసీ అధికారులు బస్సులను నిలిపివేశారు. దీంతో పాఠశాలలు, కాలేజీలకు వెళ్లే విద్యార్థులు, ప్రజలు బస్సులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ స్కూళ్లను ప్రైవేటు పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేస్తున్నామని, విద్యాకానుక ద్వారా పుస్తకాలు, ఇతర వస్తువులను అందిస్తున్నామని ఊ కదంపుడు ఉపన్యాసాలు ఇస్తున్న వైసీపీ పాలకులు రోడ్ల దుస్థితిని ఏ మాత్రం పట్టించుకోలేదు. దీంతో రహదారులు ఛిద్రం కావడంతో పలు రూట్లలో

ఆర్టీసీ సేవలు నిలిచిపోయాయి.

దీంతో పొరుగు ఊళ్లకు చదువుకునేందుకు వెళ్లే విద్యార్థులు బస్సులు లేక ఇబ్బంది పడుతున్నారు. ప్రైవేటు వాహనాలను, ఆటోలను ఆశ్రయిస్తూ ఆర్థికంగా, సమయపరంగా నష్టపోతున్నారు. మండలంలోని అక్కంపేట, పాత, కొత్త రేణిమడుగు, రజాసాహెబ్‌పేట గ్రామాల నుంచి 5 నుంచి 7 కిలోమీటర్ల దూరాన ఉన్న కంబాలదిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఉన్నత విద్య కోసం సుమారు 110 మంది విద్యార్థులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేవారు.

పామూరు మండలంలో ఏపీఆర్‌ఆర్‌పీ గ్రాంట్ కింద గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 16 ప్యాకేజీ రోడ్ల పనులకు సుమారు రూ.75 కోట్ల నిధులు మంజూరయ్యాయి. హడవుడిగా గ్రావెల్ పనులు చేపట్టారు. గతేడాది వర్షాలకు గ్రావెల్ పరిచిన రోడ్లు ధ్వంసమయ్యాయి. ఈ లోగ ఎన్నికలు జరిగి వైసీపీ అధికారంలోకి వచ్చింది. అధికార పార్టీ నాయకుల కమీషన్ల ఒత్తిడిని తట్టుకోలేక కాంట్రాక్టర్లు రోడ్డు పనులు నిలిపివేశారు. దాంతో రోడ్ల కోసం పాత రోడ్లపై తీసిన గోతులు, వాగుపై పాత చప్టాలను తొలగించి బ్రిడ్జి నిర్మాణం కోసం కానాల వరకే నిర్మించి వదిలేశారు. రోడ్లు సక్రమంగా లేని కారణంగా బస్సులు తిప్పలేమని ఆర్టీసీ అధికారులు సర్వీసులను నిలిపివేశారు. ఆటోలో ప్రయాణం ప్రమాదమని తెలిసినా తప్పనిపరిస్థితిలో స్కూళ్లకు పిల్లలను ఆటోలో పంపుతున్నామని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకరోజు, ఒక నెలలోనైనా రోడ్లు బాగుచేస్తారని ఎదురుచూశామని, ఐదేళ్లయినా రోడ్ల మరమ్మతులు పూర్తిచేయలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోజూ ఆటో కోసం రానుపోను రూ.50 ఖర్చు చేసి బడికి పంపిస్తున్నట్లు చెప్పారు. కొందరు విద్యార్థులు ఆర్థికభారం భరించలేక 3 నుంచి 5 కిలోమీటర్ల దూరం బరువుగా ఉన్న బ్యాగులను మోసుకుంటూ నడిచి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామస్థులు సొంత ఖర్చులతో అప్రోచ్‌రోడ్డు నిర్మిస్తామని, తమ గ్రామానికి బస్సు నడపాలని ఆర్టీసీ అధికారులను కోరినా రూట్ పరిశీలించి అనుకోని ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని వెనక్కి తగ్గిపోయారని గ్రామస్థులు తెలిపారు. 10వ తరగతి పరీక్షలను దృష్టిలో పెట్టుకొని బస్సును నడపాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఇదిలావుండగా విద్యార్థుల చదువుకోసం రాని బస్సులు ఆదివారం జగన్‌రెడ్డి సిద్ధం సభకు జనాల్ని తరలించేందుకు పీలేరు డిపో నుంచి అక్కంపేట గ్రామానికి రావడంపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

టీడీపీతోనే గ్రామాల అభివృద్ధి

- బేస్తవారపేటలో ఇంటింటికి తిరిగి కరపత్రాల పంపిణీ
- ఉమ్మడి బహిరంగ సభ ఏర్పాట్లపై సన్నాహక సమావేశం



బేస్తవారపేటలో మేనిఫెస్టోలోని హామీ పత్రాలను అందజేస్తున్న నాయకులు

బేస్తవారపేట, మార్చి12: టీడీపీతోనే మన గ్రామాలు అభివృద్ధి చెందుతాయని బేస్తవారపేట మాజీ సర్పంచ్ సర్పంచ్ గాజుల విశ్వనాథం పేర్కొన్నారు. ఇంటింటికి టీడీపీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం టీడీపీ నాయకుల బృందం గ్రామంలో పర్యటించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీడీపీ గెలిపించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. గ్రామాల నుంచి వైసీపీని తరిమి కొట్టాల్సిన సమయం వచ్చింద న్నారు. బేస్తవారపేటలో టీడీపీ నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. టీడీపీ ప్రవేశపెట్టిన మేనిఫెస్టోలోని అంశాలను మహిళలకు, ప్రజలకు వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ టీడీపీ హయంలో జరిగిన అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మూప్పూరి రాము, దూదెకుల సైదులు, బోయిళ్ల రోషన్‌బాబు, టీసు అరుణ్ కుమార్, పి.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. కోనపల్లె లోయ గ్రామాల్లోని శింగరపల్లె గ్రామంలో టీడీపీ మండల అధ్యక్షుడు సోరెడ్డి మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి టీడీపీ చేసిన అభివృద్ధి గురించి వివరించారు. కార్యక్రమంలో పూనూరు భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

బహిరంగ సభను విజయవంతం చేయండి

పొదిలి : పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో ఈ నెల 17న జరిగే టీడీపీ జనసేన, బీజేపీ ఉమ్మడి బహిరంగ సభను జయప్రదం చేయాలని మార్కాపురం టీడీపీ ఇన్‌చార్జ్ కందుల నారాయణరెడ్డి కోరారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మండల నాయకులు, కార్యకర్తలు, బూత్‌కమిటీ సభ్యులతో ఏర్పాటు చేసి న సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని టీడీపీ, జనసేన, బీజేపి మూడు పార్టీలు కలిసి ఎంతో ప్రతిష్ఠాత్మ కంగా ఈ బహిరంగ సభను నిర్వహిస్తున్నాయన్నారు. టీడీపీతో పాటు మిగిలిన పార్టీల నాయకు లు కూడా విజయవంతం చేయాలని కోరారు. అంతేకాకుండా సభలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీతోపాటు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌లు పాల్గొంటారన్నారు. మండల నాయకులు, కార్యకర్త లు, బూత్‌కమిటీ సభ్యులు ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. కార్య క్రమంలో టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



వై.పాలెంలో బాండ్లు అందజేస్తున్న ఇస్మాయిల్

ఎర్రగొండపాలెం : టీడీపీ అధికారంలోకి రావాలంటే మహిళలు చైతన్యవంతులై ఓట్లు వేసి గెలిపించాల్సిన బాధ్యత ఉందని ఎర్రగొండపాలెం నియోజకవర్గ ముస్లిం మైనార్టీసెల్ అధ్యక్షులు షేక్ ఇస్మాయిల్ పేర్కొన్నారు. ఎర్రగొండపాలెంలోని 26వ బూత్ పరిధిలో మంగళవారం సాయంత్రం ఇంటింటికి తిరిగి 'బాబు ష్యూరిటీ- భవిష్యత్‌కు టీడీపీ గ్యారెంటీ' బాండులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే 18 సంలు నుంచి 59 సంవత్సరాలలోపు మహిళలకు నెలకు రూ.1500 నగదు, సంవత్సరానికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందజేస్తారన్నారు. రైతులకు పంటనష్ట పరిహారం 1 సంవత్సరానికి రూ.20వేల నగదు ప్రోత్సాహం, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం వంటి పథకాలు అమలుచేయనున్నట్లు తెలిపారు.



కార్యకర్తలతో మాట్లాడుతున్న కందుల నారాయణరెడ్డి

ఆవుపై పెద్దపులి దాడి

- భయాందోళనలో లోయ గ్రామాల ప్రజలు



ఆవు కళేబరాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పెద్దారవీడు, మార్చి 12 : ఆవుపై పెద్దపులి దాడిచేసి చంపివేసిన ఘటన పెద్దారవీడు మండలం, కాటంరాజు తాండ సమీపములో మంగళవారం వెలుగు చూసింది. డీఆర్‌వో నాగరాజు తెలిపిన వివరాల మేరకు మండలంలోని చర్ల సమీపములోని కాటంరాజుతాండాకు చెందిన మేఘావత్ శ్రీరాములు నాయక్‌కు చెందిన ఆవులు రెండు రోజుల క్రితం మేత కోసం అడవికి వెళ్లాయి. అక్కడ రెండు ఆవులపై పులి దాడి చేసింది. అయినప్పటికీ ఒక ఆవు దాడి నుంచి తప్పించుకొని ఇంటికి వచ్చింది. దీంతో ఆయన అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అడవిలో గాలించగా ఒక ఆవు కళేబరం దొరికింది. దీంతో అటవీశాఖ అధికారులు ఆ ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. మరుసటి రోజు ఆ ప్రాంతానికి పులి వచ్చి సంచరించింది. దీంతో ఆ దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. ఘటనా స్థలాన్ని డీఆర్‌వో నాగరాజు, సిబ్బంది పరిశీలించారు. గ్రామ సమీపంలో జరిగిన ఘటనతో గుండంచర్ల, కాటంరాజు తాండా కలనూతల, లోయ గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

నీటి సమస్య పరిష్కరించండి సారూ

- కర్నూలు-గుంటూరు రహదారిపై మహిళల ఆందోళన



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

పెద్ద దోర్నాల, మార్చి 12: నీటి సమస్యను పరిష్కరించాలని పీర్లచావిడి వీధుల్లోని మహిళలు మంగళవారం ఖాళీబిందెలతో ఆందోళన నిర్వహించారు. కొన్ని రోజులుగా బోర్లలో నీరు అడుగంటాయని పంచాయతీ అధికారులు ట్యాంకర్లతో సరఫరా చేస్తున్నా అవి ఏపాటికి సరిపోవడం లేదని ఆరోపించారు. వేసవి ఎండలు మండిపోతున్నాయని నీటి అవసరాలకు ఏమాత్రం సరిపోవడం లేదని మహిళలు వాపోయారు. ఉన్న బోరుబావుల్లో లోతుగా తవ్వించడమో, నూతనంగా బోరు తవ్వించడమో చేయాలని, ట్యాంకర్లతో ట్రిప్పులు సంఖ్య పెంచాలని కోరుతూ గంటపాటు రోడ్డుపై నిరసన తెలిపారు. దీంతో రోడ్డుపై వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పంచాయతీ అధికారితో మాట్లాడారు. రేపటి నుండి ఇబ్బందులు లేకుండా చూస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు. దీంతో వాహనాల రాకపోకలు యధావిధిగా కొనసాగాయి.

సంయుక్త కార్యదర్శిగా ఖాజాహుస్సేన్

గిద్దలూరు, మార్చి 12 : ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా గిద్దలూరుకు చెందిన షేక్ ఖాజాహుస్సేన్ నియమితులయ్యారు. ఆ మేరకు ఈ సంఘం రాష్ట్ర అధ్యక్షులు షేక్ రఫీ నుంచి నియామక పత్రం అందుకున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలను అర్హులైన ముస్లింలకు అందించేందుకు సంస్థ ద్వారా కృషి చేస్తామని పేర్కొన్నారు.

వన్‌స్టేషన్ వన్ ప్రొడక్ట్ స్టాల్ ప్రారంభం

గిద్దలూరు, మార్చి 12 : గిద్దలూరు రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన వన్ స్టేషన్ వన్ ప్రొడక్ట్ స్టాల్‌ను గిద్దలూరు నుంచి గుంటూరు వరకు ఇటీవలే పూర్తయిన డబ్లింగ్ లైన్‌ను ప్రధానమంత్రి మోడీ వర్చువల్ ద్వారా ప్రారంభించారు. స్థానిక రైల్వేస్టేషన్‌లో జరిగిన ఈ కార్యక్రమాన్ని లైవ్ ద్వారా ప్రయాణికులు తిలకించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, కమిషనర్ శ్రీనివాసరావు, బీజేపీ నాయకులు డాక్టర్ జె.వి.నారాయణ, ఉదయ్‌శంకర్, రామాంజనేయులు, స్టేషన్‌మాస్టర్ నాయబ్‌రసూల్, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, రైల్వేనోడల్ ఆఫీసర్ గౌతమ్, తదితరులు పాల్గొన్నారు.

కరువు మండలంగా ప్రతిపాదనలు



ఎరువులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ

బేస్తవారపేట, మార్చి 12 : బేస్తవారపేట మండలంలో పంటలు నిలువున ఎండిపోయాయని దీంతో కరువు మండలంగా గుర్తించడానికి ప్రతిపాధనలు పంపామని గిద్దలూరు ఏడీఏ డి.బాలాజీనాయక్ అన్నారు. మంగళవారం బేస్తవారపేటలో జరిగిన వ్యవసాయ సలహా మండలి సమావేశం వ్యవసాయాధికారి జె.మెర్సీ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి, వ్యవసాయ సహామండలి కమిటీ చైర్మన్ ఎ.కోటారెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు బండ్లమూడి వెంకటరాజయ్య ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలాజీ నాయక్ మాట్లాడుతూ మండలంలోని అన్ని రైతుభరోసా కేంద్రాల వద్ద ఎరువుల స్టాక్ ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వ్యవసాయాధికారి మేర్సీ మాట్లాడుతూ రబీ సీజన్ పంట నమోదు జాబితాను కేంద్రాల వద్ద ఏర్పాటు చేయడం జరిగింది. రైతులు సరిచూసుకోవాలన్నారు.

నిరసనలు జయప్రదం చేయండి

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 12: కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక చర్యలను ఖండిస్తూ, ఈ నెల 14న జరిగే నిరసనలు జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ పిలుపునిచ్చారు. స్థానిక పూలసుబ్బయ్య భవన్‌లో మంగళవారం జరిగిన నియోజవర్గ ఏఐటీయూసీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రైతాంగం, కార్మిక వర్గంపైన ఏకపక్ష దాడులు చేస్తోందన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయడానికి కూడా పోరాటాలు చేయాల్సిన దుస్థితి నెలకొందన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు అందె నాసరయ్య, వెంకటరెడ్డి, కాశీం తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్ పనులకు పంచాయతీ ట్రాక్టర్ వినియోగం

నిబంధనలు మరిచిన పంచాయతీ కార్యదర్శి

తర్లుపాడు, మార్చి 12: గ్రామంలోని చెత్తను డంపింగ్ యార్డులకు తరలించేందుకు ప్రభుత్వం మేజర్ పంచాయతీలకు ప్రభుత్వం ట్రాక్టర్‌ను మంజూరు చేసింది. ఈ ట్రాక్టర్‌ను అధికార పార్టీ నాయకులు ఉపయోగించుకోవడంతో ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది. తర్లుపాడులోని పంచాయతీ ట్రాక్టర్ మంగళవారం తర్లుపాడు సచివాలయ నిర్మాణ పనులకు ఇసుకను తోలడంతో ప్రజలు చర్చించుకుంటు న్నారు. గ్రామంలో ఎక్కడపడితే అక్కడ చెత్తకుప్పలు ఉన్నప్పటికీ తర్లుపాడులో పారిశుధ్యం పడకే సింది. కానీ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ట్రాక్టర్ డ్రైవర్‌గా ఒక అధికార పార్టీ కార్యకర్తకు జీతాలు ఇస్తున్నప్పటికీ ఆ వ్యక్తి ఎప్పుడు కూడా నడిపిన దాఖలాలు లేవు. ప్రస్తుతం ఎలాంటి అనుభవం లేని ఒక పంచాయతీ గ్రీన్ అంబాసిడర్ ట్రాక్టర్‌ను నడుపుతున్నారు. గ్రామంలో ట్రాక్టర్ నడుతుం డటంతో ఎప్పుడు ఏమి జరుగుతుం దోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అధికార పార్టీ తొత్తుగా మారిన పంచాయతీ కార్యదర్శి వారు చెప్పిందే వేదంగా భావిస్తున్నారు. ట్రాక్టర్ గురించి పంచాయతీ కార్యదర్శి అచ్యుత్‌రావును వివరణ కోరగా కాంట్రాక్టర్లు ప్రభుత్వ పనులకు పంచాయతీ ట్రాక్టర్‌ను ఉపయోగించుకోవచ్చు అని బాధ్యతా రాహిత్యంగా సమాధానం చెప్పారు.

పంచాయతీకి పనులకే వినియోగించాలి

పారిశుధ్యానికి ఉపయోగిస్తున్న పంచాయతీ ట్రాక్టర్‌ను ఎట్టి పరిస్థితుల్లో కాంట్రాక్ట్ పనులకు ఉపయోగించకూడదు. సచివాలయ భవన్ నిర్మాణ పనులకు ఇసుకను పంచాయతీ ట్రాక్టర్ ద్వారా తోలుతున్నట్లు నా దృష్టికి వచ్చింది. దీనిపై విచారించి సంబంధిత పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకుంటాం.

నాగేశ్వరరావు, డివిజనల్ పంచాయతీ అధికారి



సచివాలయంలో వద్ద ఇసుక తోలుతున్న ట్రాక్టర్

ప్రారంభించకుండానే శిథిలావస్థకు చేరిన షాదీఖానా

- లక్షల రూపాయలు వృథా
- పునఃనిర్మించాలంటున్న ముస్లింలు



శిథిలమైన షాదీఖానా భవనం

పెద్ద దోర్నాల, మార్చి 12: ముస్లిం, మైనార్టీల ప్రయోజనార్థం నిర్మించిన షాదిఖానా ప్రారంభించకుండానే శిథిలమై పోయింది. దోర్నాలలో ముస్లింలు అధిక సంఖ్యల్లో నివసిస్తున్నారు. అత్యధిక శాతం పేదవారే. చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం గడిపే వారు కావడంతో వారికి తోడ్పాటు నందించే క్రమంలో వివాహాది శుభ కార్యాలు జరుపుకునేందుకు అప్పటి టీడీపీ ప్రభుత్వంలో 1996-97లో 25 సెంట్ల స్థలంలో రూ.7లక్షలకు పైగా వెచ్చించి అన్ని సదుపాయాలతో షాదిఖానా భవనాన్ని నిర్మించారు. అందుకు అవసరమయ్యే ప్రధాన వనరు నీటి కోసం బోరు బావిని కూడా తవ్వించింది. అయితే రాజకీయ వర్గాల బేధాభిప్రాయాలతో కొంతమంది ముస్లింలు ఊరికి దూరంగా ఉందని, పలు సాకులతో వ్యతిరేకించారు. దీంతో షాదిఖానా ప్రారంభానికి నోచుకోలేదు. ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోక పోవడంతో భవనానికి ఏర్పాటు చేసిన ఇనుప వస్తువులు, కిటికీలు, షెడ్డుకు అమర్చిన రేకులు, విలువైన వస్తుసామాగ్రి మొత్తం దొంగలు అపహరించుకుని పోయారు. చివరికి నేలపై పరిచిన బండలు కూడా దోచుకున్నారు. దాంతో ఆకతాయి వ్యక్తులకు అసాంఘిక చర్యల కు ఆవాసంగా మారింది. ప్రస్తుతం ఆ ప్రాంతం లో కుంట స్థలం(రెండున్నర సెంటు) రూ.25 లక్షలు పలుకు తోంది. పక్కనే ఎంపీడీవో, రెవెన్యూ, హౌసింగ్, వెలుగు వైద్య ఆరోగ్య ఉప కేంద్రం, అగ్నిమాపక కేంద్రం, ప్రభుత్వ కార్యాలయాలు అక్కడే ఏర్పాటయ్యాయి. ఇప్పుడు ఆ స్థలం రూ.2కోట్లకు పైగా విలువ ఉంది. పట్టణంలో ముస్లింల సంఖ్య కూడా భారీగా పెరిగింది. ప్రస్తుతం 4400 జనాభా ఉన్నారు. 3,000కు పైగా ఓటర్లున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పేద ముస్లింల ప్రయోజనార్థం షాధిఖానాను పునర్నిర్మించాలని ముస్లింలు కోరుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ముస్లింల కోరిక మేరకు రూ.30లక్షల రూపాయలతో పునర్నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అందుకు ప్రభుత్వం కూడా నిధులు మంజూరు చేసేందుకు సుముఖత వ్యక్తం చేసిందని, ఇంతలో ఎన్నికలు రావడంతో ఆ నిధులు నిలిచిపోయినట్లు షేక్ మాబు తెలిపారు.

ఆర్‌వో ప్లాంట్ల ద్వారా స్వచ్ఛమైన నీటిని అందించాలి

మినరల్ వాటర్ ప్లాంట్ల యజమానులకు కమిషనర్ హెచ్చరిక

పొదిలి, మార్చి 12 : పట్టణంలోని మినరల్ వాటర్ సరఫరా చేసే ప్లాంట్‌లను నగర పంచాయతీ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. తరచూ ఫిల్టర్ బెడ్లను మారుస్తూ స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయాలని యజమానులను ఆదేశించారు. నాణ్యత ప్రమాణాలు పాటించకుండా నీటిని అందిస్తే చర్యలు తప్పవన్నారు. ప్లాంట్లను కూడా పరిశుభ్రంగా నిర్వహించాలన్నారు. అధిక ధరలకు అమ్మ డం వంటివి చేయకూడదన్నారు. ప్లాంట్ ఏర్పాటు చేయాలంటే తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. ఎడాపెడా ప్లాంట్‌లు ఏర్పాటు చేసి నాణ్యతలేని తాగునీటిని సరఫరా చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. అన్ని ప్లాంట్ల యజమానులు ప్రమాణాలు ఖచ్చితంగా పాటించాలన్నారు.

31లోపు పన్ను చెల్లిస్తే వడ్డీ రాయితీ

పట్టణంలోని ఇంటి యజమానులు చెల్లించాల్సిన ఇంటిపన్నులు మార్చి 31లోపు చెల్లిస్తే వడ్డీ లేకుండా చెల్లించే అవకాశం నగరపంచాయతీ కల్పిస్తున్నట్లు కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. కనుక ఈ అవకాశాన్ని ప్రతిఒక్క ఇంటి యజమాని వినియోగించుకొని పన్నుచెల్లించే విధంగా ప్రణాళిక వేసుకోవాలన్నారు.



వాటర్‌ప్లాంట్‌లను పరిశీలిస్తున్న కమిషనర్

ప్రభుత్వ స్థలంలో ఆక్రమణలు తొలగించాలి

సబ్‌కలెక్టర్ రాహుల్ మీనా

మార్కాపురం, మార్చి 12: పెద్దారవీడు మండలం హనుమాన్ జంక్షన్ కుంటలో ప్రభుత్వ స్థలంలో ఆక్రమించి నిర్మించిన కట్టడాలను తొల గించాలని సబ్‌కలెక్టర్ రాహుల్ మీనా అధికారుల ను ఆదేశించారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం లో పెద్దారవీడు మండలం హనుమాన్‌జంక్షన్‌కు చెందిన వెన్నా బోడిరెడ్డి, తదితరులు సబ్‌కలెక్టర్ రాహుల్ మీనాను మంగళవారం కలిశారు. కుంట శివారులో కంభంపాడు పంచాయతీ ఓబులక్క పల్లి ఇలాకా సర్వే నెంబర్ 37-4లో 1.48 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, అందులో రాత్రికి రాత్రి ఆక్రమణదారుడు అక్రమ నిర్మాణాలు చేశారన్నారు. మండల స్థాయి అధికారులు ఆక్రమణదారునికి అండగా ఉన్నారన్నారు. ఈ విషయంపై స్పందించిన సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా పెద్దారవీడు తహసీల్దార్ కె.దాసుతో ఫోన్‌లో మాట్లాడారు. సదరు సర్వే నెంబర్ ప్రభుత్వ భూమేనని తహసీల్దార్ దాసు నిర్ధారించారు. వెంటనే అందులో ఉన్న ఆక్రమణలను తొలగించాలని, ప్రభుత్వ స్థలం ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సబ్‌కలెక్టర్ రాహుల్ మీనా ఆదేశాలు జారీ చేశారు.



వినతిపత్రం అందజేస్తున్నక కార్మికులు

బీఎల్‌వోలు అప్రమత్తంగా ఉండాలి

- స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నాగజ్యోతి



అవగాహన కల్పిస్తున్న నాగజ్యోతి

కంభం, మార్చి 12 : బూత్ లెవెల్ అధికారులు తమకు కేటాయించిన పోలింగ్ బూత్‌లలో అప్రమత్తంగా ఉండడమేకాక పోలింగ్ సజావుగా జరిగేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వెలుగొండ ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నాగజ్యోతి తెలిపారు. మంగళవారం కంభం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో కంభంలోని 45 పోలింగ్ స్టేషన్ల బీఎల్‌వోలకు ఈవీఎంల వినియోగంపై అవగాహన కల్పించారు. సాంకేతిక లోపం వస్తే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో కంభం తహసీల్దార్ రామయ్య, డీటీ శ్రీనివాసరావు, ఆర్ఐ శ్రీనివాసులు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం : ఎన్నికల విధుల్లో భాగంగా నోడల్‌అధికారులకు, ఎంసీసీ, ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టీ ఎన్నికల ఖర్చు వీఎస్‌టీ మొదలగు అంశాలపై ఎన్నికల సిబ్బందికి వై.పాలెం రిటర్నింగ్ అధికారి శ్రీలేక శిక్షణ ఇచ్చారు. మంగళవారం సాయంత్రం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో అవగాహన శిక్షణ ఇచ్చారు. నియోజకవర్గంలోని ఎన్నికల నోడల్ అధికారులు నివేదికలు ఎప్పటికప్పుడు తమకు అందజేయాలని కోరారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించేందుకు సిబ్బంది కృషి చేయాలన్నారు. నియోజకవర్గంలోని ఎన్నికల అధికారులు, తహసీల్దార్లు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న కార్మికులు

బేస్తవారపేట,మార్చి12:బేస్తవారపేట మండలంలో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటియూ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం ఎంఈవో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. 20 ఏళ్ల నుంచి వంట చేస్తూ, సేవలందిస్తున్నప్పటికీ, స్థానిక సమస్యల పరిష్కారానికి అధికారులు మొగ్గుచూపడం లేదన్నారు. తమకు రూ.26వేలు వేతనం రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని,భీమా సౌకర్యం కల్పించాలని,న్యాయపరమైన డిమాండ్‌లను వెంటనే పరిష్కరించాలని తదితర డిమాండ్‌తో వినాదాలు చేశారు.ఈకార్యక్రమంలో కార్మికులసంఘం మండల కమిటీ సభ్యులు కె.చంద్రమోహన్,యం.మంజుమణి తదితరులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

ఏపీలో రైల్వేస్టేషన్లకు మహర్దశ



మాట్లాడుతున్న తిరుమలరావు

కంభం, మార్చి 12 : దేశప్రధాని నరేంద్రమోదీ దేశంలోని అన్ని రైల్వేస్టేషన్లను కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేస్తూ వాటి రూపురేఖలనే మార్చి వేస్తున్నారని నంద్యాల అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ తిరుమలరావు పేర్కొన్నారు. మంగళవారం కంభం రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన వన్‌స్టేషన్ వన్ ప్రొడక్ట్ యూనిట్ ప్రారంభం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో తిరుమలరావు మాట్లాడారు. సాంప్రదాయ ఉత్పత్తులకు మార్కెట్ కల్పించడం, సమాజంలో అట్టడుగు వర్గాలకు అదనపు ఆదాయ మార్గాల పెంపునకు కృషి చేస్తామన్నారు. రాష్ట్రంలో 127 రైల్వేస్టేషన్లలో 133 వన్‌ప్రొడక్ట్ యూనిట్లను ప్రధాని వర్చువల్‌గా ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. గుంటూరు నుంచి గుంతకల్లు డబ్లింగ్ పనులకు రూ.711 కోట్లు ఖర్చు చేసి పూర్తి చేయడమేకాక జాతికి అంకితం చేశారన్నారు. కార్యక్రమంలో విశ్రాంత రైల్వేస్టేషన్ మాస్టర్ కేవీ.రమణరావు, బీజేపీ నాయకులు మంచాల బ్రహ్మేశ్వరప్రసాద్, విశ్రాంత సీటీవో మీనిగ ప్రసాద్ తదితరులు ప్రసంగించారు. అనంతరం నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ బ్రహ్మేశ్వరప్రసాద్ స్థానిక రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన వన్‌ప్రొడక్ట్‌ను ప్రారంభించారు.

వైభవంగా సత్యసాయి వ్రతాలు



వ్రతాలు నిర్వహిస్తున్న భక్తులు

గిద్దలూరు, మార్చి 12 : పట్టణంలోని శ్రీసత్యసాయి ప్రేమసుధా మందిరం 22వ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా మహిళలు సామూహికంగా సత్యసాయి వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవాసమితి కన్వీనర్ సూరె అనంతరామయ్య, సభ్యులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

గిద్దలూరు, పొదిలి, మార్చి 12 :నేడు గిద్దలూరు, పొదిలి ఆర్టీసీ డిపోల పరిధిలో డయల్‌యువర్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్లు, బి.చంద్రశేఖర్, జే.సుందరరావులు మంగళవారం తెలిపారు. కార్యక్రమం ఉదయం 11 గంటల నుండి 12 గంటల వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గిద్దలూరు డిపో పరిధిలో 9959225702 నెంబరుకు ఫోన్ చేసి సమస్యలు, సలహాలు, సూచనలు తెలియజేయాలన్నారు. పొదిలి డిపో పరిధిలో 9959225700 నంబరును సంప్రదించాలన్నారు.

బత్తాయి తోటల పరిశీలన

తర్లుపాడు, మార్చి 12: మండలంలోని చెన్నారెడ్డిపల్లి, కలు జువ్వలపాడులో సాగు లో ఉన్న బత్తాయి తోటలను ఉద్యానవన శాఖాధికారి రమేష్ పరిశీలించారు. ప్రస్తు తం వేసవిలో బత్తాయి తోటలకు వేరుకుళ్లు తెగులు ఎక్కువగా సోకుతోందని దీంతో బత్తాయి చెట్లు నిలువునా ఎండిపోతాయన్నారు. వేరుకుళ్లు సోకుతున్న చెట్లకు మందుగానే సస్యరక్షణ చర్యలు చేపడితే వేరుకుళ్లు తెగుళ్లు సోకకుండా బత్తాయి తోటలను కాపాడుకోవచ్చని ఉద్యానవన శాఖాధికారి రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. బత్తాయి తోటలకు వేరు కుళ్లు సోకిన చెట్టుకు నీరు కట్టిన మరుసటిరోజు ఒక శాతం బోర్డు మిక్సర్ మందును 20లీటర్ల నీటితో ఒక చెట్టుకు పూర్తిగా తడిచేలా పిచికారి చేయాలన్నారు.



తోటలను పరిశీలిస్తున్న ఉద్యానవన శాఖాధికారి

రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభం



ఇఫ్తార్ కార్యక్రమంలో ముస్లింలు

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 12: ముస్లింలు పవిత్రంగా భావించే రంజాన్ మాసం ప్రారంభమైంది. ముస్లింలు రంజాన్ ఉపవాస దీక్షలు మంగళవారం భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. పట్టణంలోని పలు మసీదులలో సాయంత్రం ఇఫ్తార్ కార్యక్రమం నిర్వహించారు. ముస్లింలు నెలరోజుల పాటు కఠిన ఉపవాస దీక్షలు పాటిస్తారు. తెల్లవారుజామున 4.28నిమిషాలకు అన్నపానియాలు స్వీకరించి సాయంత్రం 6.28ని.లకు వరకు ఉపవాసం చేస్తారు. ఈ లోపు పచ్చి మంచినీరు కూడా ముట్టుకోరు. రోజు ఐదు పూటల నమాజ్‌తో పాటు ఖురాన్ పఠనం, ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఇషా నమాజ్ అనంతరం ప్రత్యేక తరావి నమాజ్‌లు చదువుతారు. ముస్లింల ఉపవాసదీక్షకు ఇఫ్తార్ సమయంలో స్వీట్లు, ఆహార పానియాలు తీసుకొని ఉపవాస దీక్షను విరమించుకుంటారు.

భృంగీశ్వర వాహనంపై మహాశివుడు

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 12: మార్కాపురంలోని జగదాంబసమేత మార్కండేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా మంగళవారం రాత్రి మహాశివునికి భృంగీశ్వర వాహనంపై ఝటాజూట మహేశ్వర అలంకారంలో నగరోత్సవం నిర్వహించారు. ఈవో చెన్నకేశవరెడ్డి, ఆలయ చైర్మన్ కేశవరావు తదితరులు పాల్గొన్నారు.



బృంగీశ్వర వాహనంపై మహాశివుడు

గిరిజన నిరుద్యోగ మహిళలకు ఫ్యాషన్ డిజైన్‌పై శిక్షణ

ఎర్రగొండపాలెం, మార్చి 12 : సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ, ఆధ్వర్యంలో చెంచుగిరిజన మహిళలకు, జనరల్ ఎస్టీ మహిళలకు కుట్టుమిషన్లు, ఫ్యాషన్ డిజైన్స్‌పై స్థానిక ఎంపీడీవో కార్యాలయంవద్ద శిక్షణ ఇచ్చేందుకు ఈ నెల 13, 14 తేదిలలో ధరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఐటీడీఏ పీవో రవీంద్రారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అసిస్టెంట్ ఫ్యాషన్ డిజైనర్ కోర్సుకు ధరఖాస్తు చేసే మహిళలు 7వతరగతి ఉత్తీర్ణులై, 18 సంవత్సరాల నుంచి 35 సంవత్సరంలోపు వయస్సు ఉండాలన్నారు. ఎంపికైన గిరిజన మహిళలకు రెండు నెలలు ఉచిత శిక్షణతో పాటు, భోజన వసతి కల్పించనున్నట్లు తెలిపారు. కర్నూలు, పల్నాడు, ప్రకాశం జిల్లా గిరిజన మహిళలు ధరఖాస్తు చేసుకోవాలని ఐటీడీఏ పీవో తెలిపారు.

ఆలయాల్లో హుండీల లెక్కింపు

త్రిపురాంతకం, మార్చి 12: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం త్రిపురాంతకేశ్వరస్వామి, బాలాత్రిపుర సుందరీదేవి అమ్మవార్ల ఆలయాల్లో హుండీలను మంగళవారం లెక్కించారు. స్వామివారి హుండీలు రూ. 7,85,539, అమ్మవారి హుండీలు రూ. 5,20,064, అన్నదానం హుండీ రూ.71,264 కాగా మొత్తం రూ.13,76,867 వచ్చినట్లు ఆలయ ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో ఉత్సవాల అధికారి అనిల్‌కుమార్, ఆలయ చైర్మన్ ఐ.సుబ్బారావు పాలక మండలి సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్లు బాగులేవని.. పల్లెలకు రాని బస్సు

- ధ్వంసమైన రహదారులు
- పట్టించుకోని వైసీపీ పాలకులు
- విద్యార్థులకు తిప్పలు
- బడికి వెళ్లాలంటే రోజుకు రూ.50 ఖర్చు
- ప్రమాదమైనా తప్పని ఆటో ప్రయాణం
- పది పరీక్షలకు ఎలా వెళ్లాలని ఆందోళన



నేరళ్లవాగుపై గ్రామస్థులు నిర్మించుకున్న అప్రోచ్‌రోడ్డు (ఫైల్)

ఛిద్రమైన రేణిమడుగురోడ్డు

పామూరు, మార్చి 12 : పల్లె ప్రయాణం నరకంగా మారింది. రోడ్లు అధ్వానంగా మారడంతో ఆర్టీసీ అధికారులు బస్సులను నిలిపివేశారు. దీంతో పాఠశాలలు, కాలేజీలకు వెళ్లే విద్యార్థులు, ప్రజలు బస్సులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ స్కూళ్లను ప్రైవేటు పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేస్తున్నామని, విద్యాకానుక ద్వారా పుస్తకాలు, ఇతర వస్తువులను అందిస్తున్నామని ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తున్న వైసీపీ పాలకులు రోడ్ల దుస్థితిని ఏ మాత్రం పట్టించుకోలేదు. దీంతో రహదారులు ఛిద్రం కావడంతో పలు రూట్లలో ఆర్టీసీ సేవలు నిలిచిపోయాయి.





ధ్వంసమైన రోడ్డులో ఆటోలో స్కూల్‌కు వెళ్తున్న విద్యార్థులు (ఫైల్)

దీంతో పొరుగు ఊళ్లకు చదువుకునేందుకు వెళ్లే విద్యార్థులు బస్సు లేక ఇబ్బంది పడుతున్నారు. ప్రైవేటు వాహనాలను, ఆటోలను ఆశ్రయిస్తూ ఆర్థికం గా, సమయపరంగా నష్టపోతున్నారు. మండలంలోని అక్కంపేట, పాత, కొత్త రేణిమడుగు, రజాసాహెబ్‌పేట గ్రామాల నుంచి 5 నుంచి 7 కిలోమీటర్ల దూరాన ఉన్న కంబాలదిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఉన్నత విద్య కోసం సుమారు 110 మంది విద్యార్థులు ఆర్టీసీ బస్సులో ప్రయాణించేవారు. పామూరు మండలంలో ఏపీఆర్ఆర్‌పీ గ్రాంట్ కింద గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 16 ప్యాకేజీ రోడ్ల పనులకు సుమారు రూ.75 కోట్ల నిధులు మంజూరయ్యాయి. హడవుడిగా గ్రావెల్ పనులు చేపట్టారు. గతేడాది వర్షాలకు గ్రావెల్ పరిచిన రోడ్లు ధ్వంసమయ్యాయి. ఈలోగా ఎన్నికలు జరిగి వైసీపీ అధికారంలోకి వచ్చింది. అధికార పార్టీ నాయకుల క మీషన్ల ఒత్తిడిని తట్టుకోలేక కాంట్రాక్టర్లు రోడ్డు పనులు నిలిపివేశారు. దాంతో రోడ్ల కోసం పాత రోడ్లపై తీసిన గోతులు, వాగుపై పాత చప్టాలను తొలగించి బ్రిడ్జి నిర్మాణం కోసం కానాల వరకే నిర్మించి వదిలేశారు. రోడ్లు సక్రమంగా లేని కారణంగా బస్సు తిప్పలేమని ఆర్టీసీ అధికారులు సర్వీసులను నిలిపివేశారు. ఆటోలో ప్రయాణం ప్రమాదమని తెలిసినా తప్పనిపరిస్థితిలో స్కూళ్లకు పిల్లలను ఆటోలో పంపుతున్నామని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకరోజు, ఒక నెలలోనైనా రోడ్లు బాగుచేస్తారని ఎదురుచూశామని, ఐదేళ్లయినా రోడ్ల మరమ్మతులు పూర్తిచేయలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోజూ ఆటో కోసం రానుపోను రూ.50 ఖర్చు చేసి బడికి పంపిస్తున్నట్లు చెప్పారు. కొందరు విద్యార్థులు ఆర్థికభారం భరించలేక 3 నుంచి 5 కిలోమీటర్ల దూరం బరువుగా ఉన్న బ్యాగులను మోసుకుంటూ నడిచి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామస్థులు సొంత ఖర్చులతో అప్రోచ్‌రోడ్డు నిర్మిస్తామని, తమ గ్రామానికి బస్సు నడపాలని ఆర్టీసీ అధికారులను కోరినా రూట్ పరిశీలించి అనుకోని ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని వెనక్కి తగ్గిపోయారని గ్రామస్థులు తెలిపారు. 10వ తరగతి పరీక్షలను దృష్టిలో పెట్టుకొని బస్సును నడపాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఇదిలావుండగా విద్యార్థుల చదువుకోసం రాని బస్సులు ఆదివారం జగన్‌రెడ్డి సిద్ధం సభకు జనాల్ని తరలించేందుకు పీలేరు డిపో నుంచి అక్కంపేట గ్రామానికి రావడంపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న ప్రమోద

కేజీబీవీ తనిఖీ

పీసీపల్లి, మార్చి 12 : కేజీబీవీ పాఠశాలను జిల్లా బాలికల శిశు అభివృద్ధి అధికారి ఎం.ప్రమోద మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థినులతో సమావేశమైన ఆమె పౌష్టికాహారం మెనూ ప్రకారం అందుతుందా లేదా తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయినిలతో మాట్లాడుతూ 18వ తేదీ నుంచి 10వ తరగతి పరీక్షలు జరగనున్న దృష్ట్యా 100శాతం ఉత్తీర్ణత సాధించేలా సమాయత్తం చేయాలని సూచించారు. అనంతరం భవిష్యత్ కార్యాచరణపై సూచనలు ఇచ్చారు.

ప్రవేశాలకు ఆహ్వానం

కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరానికి 6 నుంచి ఇంటర్‌లో ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్న ట్లు కళాశాల ప్రిన్సిపాల్ బీ సుజాత తెలిపారు. మంగళవారం నుంచి ఏప్రిల్ 11వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. 7,8,9 తరగతులలో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం 7702076045,8886392717కు సంప్రదించాలని ఆమె కోరారు.

పెండింగ్ కేసులను పరిష్కరించండి

ముండ్లమూరు, మార్చి 12 : పెండింగ్ కేసులను త్వరిత గతిన పరిష్కరించాలని దర్శి సీఐ షేక్ సమీఉల్లా సూచించారు. ఆయన మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్‌ను సందర్శించి, రికార్డులను పరిశీలించారు. స్టేషన్ సిబ్బంది తో సమావేశమై ఎన్నికల దృష్ట్యా గ్రామాలవారీగా సమీక్ష నిర్వహించారు. ఏ గ్రామంలోనూ చిన్న సంఘటన జరగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి రోజు పోలీసులు రాత్రి పూట గస్తీ తిరగాలన్నారు. సమావేశంలో ఏఎస్‌ఐలు బీ పవన్ కుమార్, ఏ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



రవికుమార్‌ను అభినందిస్తున్న టీడీపీ నాయకులు

టీడీపీ గెలుపునకు ఐక్యంగా పనిచేయండి

ఇన్‌చార్జి రవికుమార్

దొనకొండ, మార్చి 12 : సార్వత్రిక ఎన్నికల్లో గ్రామాలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఐక్యంగా ఉండి తెలుగుదేశం పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గొరంట్ల రవికుమార్ సూచించారు. దొనకొండ మండల టీడీపీ నాయకులు వీరపనేని వెంకన్నచౌదరి ఆధ్వర్యంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు పులిమి రమణాయాదవ్, నాయకులు కామేపల్లి చెంచయ్యచౌదరి, తాండ్ర వెంకటేశ్వర్లు, దుగ్గెంపూడి కోటేశ్వరరావు, వేగినాటి అల్లూరయ్య, వల్లపునేని ఆదినారాయణ, షేక్ సుభానీ, ఫణిదపు వీరాంజనేయులు, విప్పర్ల శేషు, పులిమి శివ, బోయపాటి శేషు, వీరపనేని హనుమంతరావు మరికొందరు రవికుమార్‌ను ఆయన నివాసంలో కలిసి ఘనంగా సన్మానించారు. టీడీపీ శ్రేణులు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ఐదేళ్ల జగన్‌రెడ్డి విధ్వంస పాలనను వివరిస్తూనే చంద్రబాబు గ్యారెంటీ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు తెలియజేయాలని రవికుమార్ దిశానిర్దేశం చేశారు.

ముండ్లమూరు : టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గొరంట్ల రవి కుమార్‌ను పార్టీ నాయకులు మంగళవారం కలిసి ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మాజీ అధ్యక్షుడు సోమేపల్లి శ్రీనివాసరావు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు వరగాని పౌలు, మారెళ్ల, ఈదర ఎంపీటీసీ సభ్యులు పాలపర్తి సుబ్బారావు, నాగమల్లి అంకమరావు, మేదరమెట్ల కొండలరావు, గుంటుపల్లి రంగ నాయకులు, వీరపనేని నాగమల్లి, మాజీ సర్పంచ్‌లు జిల్లెలమూడి చౌదరి, శ్రీనివాసరావు, బద్రి గోపాలరెడ్డి, చావా బ్రహ్మయ్య, వెంకట స్వామి, పేరారెడ్డి, మాలెంపాటి మల్లికార్జునరావు, పరుచూరి అంజయ్య పాల్గొన్నారు.

మనస్తాపంతో భార్య ఆత్మహత్య

10 రోజుల కిందట ఘటన .. చికిత్స పొందుతూ మృతి

తాళ్లూరు, మార్చి 12: ఇంటి ఖర్చులను పట్టించుకోకుండా డబ్బులు దుబారా చేస్తున్న భర్త తీరుపై మనస్తాపం చెందిన భార్య ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చోటుచేసుకుంది. దీనిపై మంగళవారం కేసు నమోదైంది. భర్త తన మాట వినలేదన్న బాధతో లక్కవరానికి చెందిన కందుల జాష్మి (25) పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి 10 రోజులుగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు లక్కవరం గ్రామానికి లాజర్, జాష్మి భార్యాభర్తలు. వీరిద్దరూ కూలి పనులు చే సుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కూలి డబ్బులను భర్త లాజర్ ఇంటి ఖర్చు లకు ఇవ్వడం లేదు. దీనిపై పలుమార్లు భార్య ప్రశ్నించినా పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో ఈనెల 3న పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెంటనే ఆమెను గుంటూరు ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. ఆమెకు ముగ్గురు పిల్లలున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై వైవీ రమణయ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని ఏఎస్సై మోహన్‌రావు పోస్టుమార్టంకు తరలించారు.

పాడి రైతులకు చేయూత

కనిగిరి, మార్చి 12: పాడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం చేయూత అందిస్తుందని జిల్లా పశు సంవర్ధక శాఖ జేడీ బేబీరాణి అన్నారు. స్థానిక పశు వైద్యశాలను మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సం దర్భంగా ఆమె వైద్యశాలలోని పలు రికార్డులను, అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. సంచార పశు వైద్యశాలలో అందిస్తున్న సేవలపై అడిగి తెలుసుకున్నారు. వైద్యశాలలోని ల్యాబ్‌ను, నమూన పరీక్షల సామగ్రి అవసరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పాడి రైతులు సబ్సిడీ దాణా కోసం ముందస్తుగా ఆన్‌లైన్‌లో ద రఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇండెంట్‌ను న మోదు చేసిన రెండు రోజుల్లోనే పశు దాణా అంది స్తామ న్నారు. కార్యక్రమంలో ఏడీఏ సత్యనారాయణ, డాక్టర్ ఎస్‌కే చాంద్‌బాషా, సిబ్బంది ఉన్నారు.

టీడీపీ శ్రేణుల శ్రమదానం

పామూరు, మార్చి 12 : విద్యుత్ సబ్‌స్టేషన్ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వద్ద మురుగు కాలువ కంపుకొడుతోంది. కాలువను శుభ్రం చేయకపోవడంతో చెత్త పేరుకుపోయింది. దీంతో స్థానికులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు బత్తుల సత్యనారాయణ, పీ తిరుపతయ్య కాలువ దుస్థితి చూసి వెంటనే శ్రమదానం కార్యక్రమం చేపట్టి మురుగును తొలగించారు. గ్రామ పంచాయతీ వారు చేయాల్సిన పనిని టీడీపీ నాయకులు చొరవ తీసుకొని మురుగును తొలగించడంపట్ల స్థానికులు అభినందించారు.

దేవస్థాన భూముల్లో అక్రమ నిర్మాణాలు

అడ్డుకున్న చైర్మన్



నిర్మాణాలను అడ్డుకుంటున్న చైర్మన్

పామూరు, మార్చి 12 : దేవస్థాన భూముల్లో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని దేవస్థాన చైర్మన్ గుర్రం వెంకటేశ్వర్లు హెచ్చరించారు. స్థానిక నెల్లూరు రోడ్‌లో సర్వే నెంబర్ 441/1,2,3లో 15.20 ఎకరాల దేవస్థాన భూమిలో కొందరు ఇంటి నిర్మాణాలు చేపడుతున్నట్లు అందిన సమాచారం మేరకు చైర్మన్ వెంకటేశ్వర్లు పోలీసుల సహకారంతో అక్రమ నిర్మాణాలను అడ్డుకున్నారు. దేవస్థాన భూముల్లో ఎవరైనా నిర్మాణాలు చేస్తే తొలగిస్తామన్నారు. ఆయనవెంట కమిటీ సభ్యుడు పసుపులేని రఘురాం ఉన్నారు.

ఈవీఎంపై ఓటర్లకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

పామూరు, మార్చి 12 : ఎన్నికల్లో ఈవీఎంలపై ఓటర్లు తమ ఓటు హక్కును ఎలా వినియోగించుకోవాలో అన్నదానిపై సెక్టార్ అధికారి జీ కరుణ కుమారి, సెక్టార్ పోలీస్ ఎస్.నాగేశ్వరరావు మంగళవారం అవగాహన కల్పించారు. ఆర్డీవో ఆదేశాల మేరకు పట్టణంలోని సెక్టార్ నెంబర్ 34 పరిధిలో 270, 274, 375, 276, 277, 278 పోలింగ్ కేంద్రాల పరిధిలోని వడ్డెపాలెం, అంకాలమ్మవీధి, తూర్పువీధి పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఓటర్ల చేత మాక్ పోలింగ్ నిర్వహించి ఈవీఎంలపై ఉన్న అపోహలను తొలగించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పృధ్వీ, టీ మనోహర్, పీ శ్రీనివాస్, బీఎల్వోలు, ఓటర్లు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



దాతలు అందజేసిన పరీక్ష సామగ్రితో విద్యార్థులు

పీసీపల్లి, మార్చి 12 : నేరేడుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థినీవిద్యార్థులకు పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు పరీక్ష సామగ్రిని మంగళవారం హెచ్‌ఎం అంజనీదేవి చేతులమీదుగా పంపిణీ చేశారు. ఇదే పాఠశాలలో 2010-11లో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు గత ఏడేళ్లుగా విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందజేస్తున్నారు. అట్టలు, పెన్నులు, స్కేళ్ల తదితర సామగ్రిని సమకూర్చారు. హెచ్‌ఎం టీ అంజనీదేవి పూర్వవిద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వవిద్యార్థులు, గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే ధ్యేయం



జెండాను ఆవిష్కరిస్తున్న బూచేపల్లి

దర్శి, మార్చి 12 : పేదల అభ్యున్నతే ధ్యేయమని జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైసీపీ ఇన్‌చార్జి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. వైసీపీ ఆవిర్భావదినోత్సవం సం దర్భంగా మంగళవారం పార్టీ జెండా ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏ ఎమ్‌సీ మాజీ చైర్మెన్ వి వెంకటరెడ్డి, మాజీ ఎంపీపీ ఇత్తడి దేవదా నం, సొసైటీ చైర్మన్ వీ చెన్నారెడ్డి, వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి, పట్టణాధ్యక్షుడు కట్టికోట హరీష్ పాల్గొన్నారు.

ముండ్లమూరు : వైసీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ముందుగా బస్టాండ్ సెంటర్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పార్టీ ఇన్‌చార్జి శివప్రసాద్‌రెడ్డి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ సుంకర సునీత బ్రహ్మానందరెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు రత్నరాజు, సూదిదేవర అంజయ్య, మాజీ సర్పంచ్‌లు చింతా శ్రీనివాసరెడ్డి, వెంకటఅప్పారెడ్డి, చిరంజీవి, అంజిరెడ్డి, కొండారెడ్డి, సర్పంచ్‌లు రాంబాబు, పిచ్చయ్య, శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

దొనకొండ : దొనకొండలో వైసీపీ మండల ఇన్‌చార్జి రమణారెడ్డి, మండల వైసీపీ మాజీ కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డిల ఆధ్వర్యంలో వైసీపీ అవిర్భావ దినోత్సవ వేడుకలను మంగళవారం ఆర్భాటంగా నిర్వహించారు. ముందుగా బస్టాండ్ సెంటర్‌లోని వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి, సర్పంచ్ కొంగలేటి గ్రేస్‌రత్నకుమారి, దేవానంద్, వైస్ సర్పంచ్ పఠాన్ ఇమ్రాన్‌ఖాన్, సుబ్బారెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

తాళ్లూరులో వర్గపోరు

తాళ్లూరులో వైస్ ఎంపీపీ ఐ.వెంకటేశ్వరరెడ్డి, మాజీ ఎంపీపీ కోటరామిరెడ్డి మధ్య వర్గపోరు నడుస్తున్నది. కార్యక్రమం ఏదైనా వేర్వేరుగా నిర్వహిస్తున్నారు. బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిని ఇన్‌చార్జిగా నియమించినప్పటికీ వర్గపోరు తగ్గలేదు. మంగళవారం జరిగిన పార్టీ ఆవిర్భావ కార్యక్రమంలో మరోసారి వర్గపోరు కన్పించింది. తాళ్లూరుకు బదులు తూర్పుగంగవరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి రామిరెడ్డి వర్గీయులు దూరంగా ఉన్నారు. ఎంపీపీ తాటికొండ తనకు సమాచారం లేదన్నారు.

వైసీపీ నేతల ఒత్తిడితో నిలిచిన స్కిల్ టెస్ట్

మత్స్యశాఖ అధికారుల తీరుపై జాలర్ల నిరసన



నిరసన తెలుపుతున్న జాలర్లు

పామూరు, మార్చి 12 : వైసీపీ నేతల ఒత్తిడితో జాలర్లకు నిర్వహిస్తున్న స్కిల్‌టెస్ట్‌ను నిలిపివేశారు. మండలంలోని మోపాడు రిజర్వాయర్ నుచ్చుపొద జాలర్ల సహకార సంఘంలో సభ్యులుగా చేరే జాలర్లకు వృత్తి నైపుణ్యతపై పరీక్షలు నిర్వహించిన విషయం తెలిసిందే. సోమవారం జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో జాలర్లకు స్కిల్ టెస్ట్‌ను నిర్వహించగా, మూడు రోజుల పాటి జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా మంగళవారం రెండోరోజు మత్స్యశాఖ అధికారులు డుమ్మా కొట్టారు. అధికారుల కోసం ఎదురు చూసిన జాలర్లు ఫోన్‌లో ఏడీ ఉషారాణిని సంప్రదించారు. మత్స్యశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్కిల్ టెస్ట్‌ను నిలిపివేసినట్లు తెలిపారని మత్స్యకారుల బెస్త సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓగూరి ఏడుకొండలు తెలిపారు. అధికార పార్టీ నాయకలు ఒత్తిడి మేరకే కార్యక్రమాన్ని రద్దు చేశారని మత్స్యకారులు ఆరోపిస్తూ నిరసన వ్యక్తం చేశారు. మోపాడు సొసైటీ పరిధిలో ప్రస్తుతం కేవలం 33 మంది మాత్రమే ఉన్నారు. కొత్తగా స్కిల్‌టెస్ట్ జరిపితే మరో 300 మందికి సభ్యత్వాలు ఇవ్వాల్సి వస్తుంది. దీంతో మన మాట వినే వారే ఉండరన్న కారణంతోనే రాజకీయ నాయకులు మత్స్యశాఖ అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి స్కిల్ టెస్ట్‌ను నిలిపివేశారని జాలర్ల ఆరోపిస్తున్నారు. అధికారుల తీరుకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ ఎస్సీ, ఎస్టీ పొట్లూరి లక్ష్మయ్య, నరసింహారావు, చింతకుంట రమేష్, సంఘ సభ్యులు చేవూరు కొండయ్య, నవరం రాజేష్, లక్కనబోయిన ప్రసాద్, జాలర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్నికల అధికారి లోకేశ్వరరావు

తొలగింపు దరఖాస్తులను పరిశీలించాలి

దర్శి, మార్చి 12 : ఓట్ల తొలగింపు కోసం వచ్చిన దరఖాస్తులను నిశితంగా పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎంవీఎస్ లోకేశ్వరరావు సూచించారు. తహసీ ల్దార్ కార్యాలయంలో మంగళవారం అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఓట్ల తొలగింపు కోసం 0.1 శాతం కంటే ఎక్కువ దరఖాస్తులు వచ్చినట్లతే వాటిని జిల్లా ఎన్నికల అధికారి దృష్టికి తీసుకెళ్లాలన్నారు. తప్పుడు దరఖాస్తులుగా తేలితే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఓటర్ల రివిజన్ కార్యక్రమంలో ఏమైనా స మస్యలుంటే తమకు తెలపాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరా రు. దర్శి నియోజకవర్గంలో మొత్తం 252 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేందుకు అన్ని రకాల పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అనంతరం సెక్టార్ అధికారులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ పోలింగ్ స్టేషన్ల వద్ద పూర్తి స్థాయిలో మౌలి క వసతులు ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల ప్రక్రియ నిర్వహణలో నిర్లక్ష్య వైఖరి, పక్షపాత వైఖరి అవలంబిస్తే సహించబోమన్నారు. కార్యక్రమంలో దర్శి, దొనకొండ, కురిచేడు, ముండ్లమూరు, తాళ్లూరు మండలాల తహసీల్దార్లు జీ సుజాత, కే సుజాత, సుధాకర్, మధుబాబు, ఎస్‌కె మహమ్మద్‌హుస్సేన్ ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ దేవప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ రవిశంకర్, నగర పంచాయతీ కమిషనర్ వై మ హేశ్వరరావు, పలు పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయాధికారి భరత్‌చంద్ర

కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలి


పోలీసులకు న్యాయాధికారి భరత్‌చంద్ర సూచన

కనిగిరి, మార్చి 12 : పెండింగ్‌లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి పోలీసులు చొరవ చూపాలని కనిగిరి జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి కే భరత్‌చంద్ర అన్నారు. కోర్టులోని ఆయన చాంబర్‌లో పోలీసులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భరత్‌చంద్ర మాట్లాడుతూ ఈనెల 16న జాతీయ లోక్ అదాలత్ ఉన్న దృష్ట్యా పెండింగ్‌లో ఉన్న కేసులకు సంబంధించిన కక్షిదారులకు రాజీ మార్గం వైపు కేసులను పరిష్కరించుకోవచ్చనే విషయాన్ని తెలియచేయాలన్నారు. దీనివలన విలువైన డబ్బు, సమయం ఆదా చేసుకోవచ్చనే విషయంపై వారికి అవగాహన కల్పించాలన్నారు. వాది, ప్రతివాదులు కాలయాపన చేయకుండా రాజీ ద్వారా కేసులు పరిష్కరించుకోవాలని సూచించారు. కోర్టు కేసులో పెండింగ్ సమస్యకు లోక్ అదాలత్ చక్కటి పరిష్కారమన్నారు. పెండింగ్‌లో ఎక్కువగా క్రిమినల్ కేసులు ఉన్నట్లు తెలిపారు. వాటిలో రాజీ కుదిరిన క్రిమినల్ కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకుని ప్రశాంత జీవితాన్ని గడపాలన్నారు. ప్రతి ఒక్కరూ జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని భరత్‌చంద్ర కోరారు. సమావేశంలో సీఐ వెంకటేశ్వరరావు, ఎస్‌ఐలు త్యాగరాజు, ప్రేమ్‌కుమార్, శివనాగరాజు, రమేష్, శివ, సైదుబాబు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాల తనిఖీ

పామూరు, మార్చి 12 : రెండు ఇంటర్ పరీక్షా కేంద్రాలను రిజనల్ ఇంటర్ బోర్డు అధికారి సైమన్ విక్టర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కుంద్రాల్లో వసతులు, సీసీ కెమెరాలను పరశిలించారు. విద్యార్థులకు అందుతున్న సేవలపై ఆరతీసి సంతృప్తిని వ్యక్తం చేసినట్లు జీజేసీ ప్రిన్సిపాల్ జె సురేష్ తెలిపారు, ఫిజిక్స్ పరీక్షకు 392 మందికి గాను 44 మంది గైర్హాజరయినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి




పథకాలపై అవగాహన కల్పిస్తున్న టీడీపీ శ్రేణులు

పామూరు, మార్చి 12 : వైసీపీ పాలనలో రాష్ట్రం అన్ని విధాలా నాశనం అయిందని, అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ పట్టణ ఫోర్‌మెన్ కమిటీ సభ్యులు ఉప్పలపాటి హరిబాబు, పందిటి హరీష్ తెలిపారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉగ్ర, టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి ఆదేశాలమేరకు పట్టణంలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వ ఏర్పాటుతో ఆంధ్రప్రదేశ్‌కు పూర్వవైభవం రానుందన్నారు. చంద్రబాబు గ్యారెంటీ పథకాలతో మహిళలు ఆర్థికంగా వృద్ధి చెందుతారని తెలిపారు. సూపర్‌సిక్స్ పథకాలపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు, ప్రతి మహిళకూ నెలకు రూ.1500, ఆడపిల్లలకు రూ.15వేలు, నిరుద్యోగులకు రూ.3వేలు, రైతులకు ఏడాదికి పెట్టుబడి సాయంగా రూ.20వేలు అందజేస్తారని వివరించారు. ఐదేళ్లుగా అరాచక, విధ్వంస పాలన సాగించిన జగన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో గద్దె దింపాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర భవిష్యత్ కోసం టీడీపీ అభ్యర్థి డాక్టర్ ఉగ్రను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి బత్తుల సత్యనారాయణ, ఎన్.సాంబయ్య, బూత్ కమిటీ ఇన్‌చార్జిలు మెంటా నరసింహారావు, చలపతి, ఈర్ల సత్యం, సోమిశెట్టి నరసింహారావు పాల్గొన్నారు.



- వెలగని వీధి దీపాలతో చీకట్లు
- రాత్రిళ్లు ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పంచాయతీలకు భారంగా వీధిలైట్ల నిర్వహణ
- పేరుకుపోయిన బకాయిలు.. విద్యుత్‌శాఖ నోటీసులు
- నిధులు లేనిదే బిల్లుల చెల్లింపులు ఎలా అంటున్న పాలకవర్గాలు

నిధులు లేవు.. బిల్లులు పెండింగ్.. వెలగని వీధి దీపాలు.. వీధుల్లో అంధకారం.. ఒకవైపు కుక్కలు.. మరోవైపు గోతులతో రాత్రిళ్లు రోడ్డుపైకి రావాలంటే భయపడుతున్న జనం.. వీధి దీపాలు వెలగకపోవడంతో తరచూ ప్రమాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయి. మారుమూల పల్లెలు, శివారు కాలనీల్లో అంధకారం సర్వ సాధారణంగా ఉంటోంది. అయితే గత కొంత కాలంగా పల్లెల్లోని ప్రధాన ప్రాంతాలతో పాటు కొన్ని పట్టణాల్లోనూ చీకట్లు అలుముకుంటున్నాయి. ఇదీ ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా నెలకొన్న పరిస్థితి. పలు పంచాయతీలు నిధులు లేక విద్యుత్ బకాయిలు చెల్లించిన దాఖలాలు లేవు. దీంతో విద్యుత్ శాఖాధికారులు నోటీసులు జారీ చేశారు. అయితే నిధులు లేకుంటే బకాయిలు ఎలా చెల్లిస్తామని సర్పంచ్‌లు వాపోతున్నారు. కొన్ని గ్రామాలలో శివారు ప్రాంతాలు, కరకట్టలపై జీవనం సాగించేవారికి వీధి దీపాలే వారికి వెలుగు. అవి వెలగకుంటే అంధకారమే. అదేమని అడిగిన వారికి నిధుల కొరత అనే సమాధానం వస్తుంది. ఒక్కో పంచాయతీకి సుమారు రూ.5 లక్షలు పైచిలుకే విద్యుత్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి.


అంధకారంలో గుంటూరు నగరంలో ఓ వీధి

గాఢాంధకారం

(ఆంధ్రజ్యోతి - న్యూస్‌నెట్‌వర్క్)

స్థానిక సంస్థల బాధ్యతల్లో ప్రధానమైనది వీధి దీపాల నిర్వహణ. అయితే నిధుల లేమి కారణంగా వీధి దీపాల నిర్వహణను పంచాయతీలు పట్టించుకోలేకపోతున్నాయి. దీంతో రాత్రిళ్లు వీధులు అంధకారంలో మగ్గిపోతున్నాయి. ఒకవైపు గుంతల రోడ్లు.. శివారు ప్రాంతాల్లో విష సర్పాల సంచారం.. తదితరాల కారణంగా ప్రజలు రోడ్లపైకి రావాలంటే భయపడుతున్నారు. పట్టణాల్లో అయితే గోతల రోడ్లు కనిపించక ప్రమాదాలు చోటు చేసుకుంటున్న ఘటనలు కూడా ఉన్నాయి. పంచాయతీలకు నిధులు చెల్లింపులు లేకపోవడంతో వీధి దీపాల నిర్వహణ భారంగా మారింది. వీధి దీపాలు లేకపోవటంతో రోడ్లన్నీ చిమ్మచీకటితో నిండి కనీసం ఇంటి బయటకు రావాలంటేనే భయపడే పరిస్థితి వస్తుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. చీకట్లు.. విద్యుత్ బిల్లుల పెండింగ్‌లపై అధికారులకు, నాయకులకు చెప్పినప్పటికీ ఉపయోగం ఉండదని భావించిన ప్రజలు, పంచాయతీ పాలకవర్గాలు అడగటమే మానేస్తున్నాయి. నిధుల కొరత వల్ల వీధిలైట్లు ఇచ్చే కాంట్రాక్టర్‌కు డబ్బులు చెల్లించకపోవటం వల్ల లైట్లు లేక ఏర్పాటు చేయటంలేదు. దీనివల్ల అనేక గ్రామాలలో మచ్చుకొక చోట మాత్రమే లైటు కనిపిస్తున్నది. గతంలో వీధుల్లో ఓ లైటు మాడిపోతే సాయంత్రం లోపు కొత్తది వేసేందుకు పంచాయతీలు సన్నద్ధమయ్యేవి. ఇప్పుడు ఆ పరిస్థితి పల్లెల్లో ఎక్కడా కనిపించడం లేదు. పన్నుల ఆదాయం ఉన్న మేజరు పంచాయతీలు ఎలాగోలా వీధి దీపాల నిర్వహణ చేస్తుండగా మైనరు పంచాయతీల్లో నిర్వహణ కష్టంగా మారింది. లైట్లు వెలగడం లేదని ప్రజలు ఫిర్యాదు చేస్తున్నా నెలల తరబడి మరమ్మతులు చేపట్టలేని దుస్థితిలో పంచాయతీల పాలకవర్గాలు ఉన్నాయి. వీధి దీపాల నిర్వహణ ఆయా పంచాయతీల జనరల్ ఫండ్ నుంచి మాత్రమే వినియోగించాలి. అయితే, అత్యధిక పంచాయతీల్లో జనరల్ ఫండ్లు లేవు. జనరల్ ఫండ్స్ లేని సర్పంచ్‌లు సొంత నిధులతో వీధి దీపాలు ఏర్పాటు చేసి, వేరే పనులకు వెచ్చించే నిధుల్లో వాటిని జమ చేసుకుంటున్నట్లు సమాచారం. మరికొందరు ఆ సాహసం చేయలేక వీధి దీపాల జోలికి వెళ్లడంలేదు.

* చీరాల నియోజకవర్గం చీరాల, వేటపాలెం పరిధిలో 24 పంచాయతీలు ఉండగా వేటపాలెం మండలం రామన్న పేట పంచాయతీకి మాత్రమే సర్పంచ్, వార్డు సభ్యుల పాలకవర్గం ఉంది. మిగిలిన 23 పంచాయతీల్లో ఎన్నికలు జరగని కారణంగా పాలకవర్గాలు లేవు. దీంతో ఆయా గ్రామాల్లో వీధి దీపాలు సక్రమంగా వెలగక గ్రామీణులు ఇబ్బందులు పడుతున్నారు.

* రేపల్లె మండలంలోని 28 పంచాయతీల్లో రూ.కోటి 80 లక్షల విద్యుత్ బకాయిలున్నట్లు ట్రాన్స్‌కో ఏడీ భాస్కర్ రావు తెలిపారు. రేపల్లె పట్టణంలో రూ.20 లక్షల విద్యుత్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. నగరం మండలంలో 27 పంచాయతీలకు రూ.3 కోట్లు, చెరుకుపల్లి మండలంలో 16 పంచాయతీలకు రూ.3 కోట్ల 80 లక్షలు, నిజాంపట్నం మండలం 16 పంచాయతీలకు రూ.2.5 కోట్లు బకాయిలున్నాయి. దీంతో బకాయిలు చెల్లించాలని ఆయా పంచాయతీలకు పలుమార్లు నోటీసులు ఇచ్చినా నిధులు లేని కారణంగా కట్టలేమని విద్యుత్ అధికారులకు తేల్చి చెప్తున్నారు. విద్యుత్ కనెక్షన్లు తొలగిస్తుంటే అధికార పార్టీ నాయకుల జోక్యంతో చేసేది లేక విద్యుత్ అధికారులు నోటీసులతో సరిపెడుతున్నారు.


అద్దంకి: ధేనువకకొండ పునరావస కాలనీ వీధిలైట్లు వెలగక చీకటిగా ఉన్న రోడ్డు

* మాచర్ల నియోజకవర్గ పరిధిలో చాలా పంచాయతీల్లో వీధి దీపాలు వెలగడం లేదు. మరమ్మతులు చేయించేందుకు నిధుల కొరత వెంటాడుతోంది. కారంపూడి మండలంలో 15 పంచాయతీలు ఉండగా పది పంచాయతీల్లో వీధి దీపాలు మరమ్మతులకు గురయ్యాయి. దీనిపై గట్టిగా ప్రశ్నిస్తే మాకు ఓట్లు వేసి గెలిపించారా అంటూ సర్పంచ్‌లు ఎదురు ప్రశ్న వేస్తున్నారు. దుర్గి మండలంలో 16 పంచాయతీలు ఉండగా దుర్గి, ముటుకూరు, అడిగొప్పుల మినహా ఏ పంచాయతీలో కూడా వీధి దీపాలు వెలగడం లేదు. ఈ మండలంలో రూ.4 కోట్లకు పైగా విద్యుత్ బకాయిలు పేరుకుపోయాయి.

* దాచేపల్లి మండలం శ్రీనివాసపురంలో వీధి దీపాలు వెలగక గ్రామస్తులు ఇటీవల ఆందోళన చేశారు. తంగెడ, రామాపురం, మాదినపాడు, కొత్తూరుల్లోనూ వీధి దీపాలు కొరతగానే ఉన్నాయి. గుత్తికొండ, జానపాడు, బ్రాహ్మణపల్లి, తుమ్మలచెరువు, కరాలపాడు గ్రామాలలో వీధి దీపాలు మాడిపోతే కొత్తవి వేసేందుకు నెలల సమయం పడుతుంది. శివారు ప్రాంతాలు, కాలనీలైతే పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది.

* పొన్నూరు నియోజకవర్గంలో ఐదేళ్లుగా ఎల్‌ఈడీ లైట్ల నిర్వహణను ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదు. వీధి దీపాలకు విద్యుత్ పరికరాల మార్పులకు స్థానిక ప్రజాప్రతినిధులు టెండర్లు దక్కించుకుని నిధులు గోల్‌మాల్ చేశారనే ఆరోపణలున్నాయి. పొన్నూరు మండల పరిధిలోని చింతలపూడి వంటి గ్రామంలో ప్రధాన రహదారిపై వీధి దీపాలు వెలగక నెలలు గడుస్తున్నాయి.


నాడు వద్దన్నారు.. నేడు బిల్లులు ఇమ్మన్నారు..

వీధి దీపాల నిర్వహణ టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్(ఈఈఎస్ఎల్) సంస్థకు అప్పగించింది. ఎల్‌ఈడీ లైట్లను అమర్చడంతో పాటు పదేళ్ల వాటి నిర్వహణ కూడా ఆ సంస్థే చేపట్టింది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ప్రభుత్వం ఆ సంస్థకు నిర్వహణ ఖర్చులు చెల్లించలేదు. పైగా వీధి దీపాల నిర్వహణ బాధ్యతల నుంచి ఆ సంస్థను తప్పించింది. దీంతో గ్రామాల్లో వీధి దీపాల నిర్వహణ పంచాయతీలకు భారంగా మారింది. పైగా పంచాయతీలకు వచ్చే ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ప్రభుత్వం తన సొంత ఖాతాలకు జమ చేసుకుంటుంది. దీంతో ఆదాయం లేని పంచాయతీల్లో పారిశుధ్యం, వీధి దీపాలు, రక్షిత మంచి నీటి పథకాల నిర్వహణ, సిబ్బంది వేతనాల చెల్లింపు ఇబ్బందిగా మారింది. అయితే రెండేళ్ల క్రితం వీధి దీపాల నిర్వహణ బాధ్యతల నుంచి తప్పుకున్న ఈఈఎస్ఎల్ సంస్థకు 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి చెల్లింపులు చేయాలని పంచాయితీలకు ఇటీవల పంచాయతీరాజ్ కమిషనర్ నుంచి ఉత్తర్వులు అందాయి. రెండేళ్లుగా పంచాయతీలే దీపాల నిర్వహణ చేసుకుంటుండగా ఇప్పుడు ఆ సంస్థకు నిధులు చెల్లింపులు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై ఆశ్చర్యంతో పాటు అను మానం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే కొన్నిచోట్ల పగలు కూడా వీధి దీపాలు వెలుగుతున్నాయి. సరైన రీతిలో నిర్వహణ చేపట్టి వీధిదీపాలు ప్రతిరోజు రాత్రివేళల్లో సక్రమంగా వెలిగే విధంగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరు తున్నారు.

మున్సిపాలిటీల్లోనూ చీకట్లే

పంచాయతీల్లోనే కాదు పలు పట్టణాల్లోనూ వీధి దీపాల వెలుగులు అరకొరగానే ఉంటున్నాయి. గతంలో వీధి దీపాలపై పాలకవర్గాలు, అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపేవి. వీధి దీపాలు వెలగకపోయినా, మరమ్మతులకు గురైనా వెంటనే చర్యలు తీసుకునే వారు. అయితే గత కొంతకాలంగా ఆ పరిస్థితి చాలా మున్సిపాలిటీల్లో లేదు. ఇక శివారు కాలనీలు, విలీన గ్రామాల్లో అయితే అంధకారం అనేది సర్వసాధారణంగా ఉంటోందని ప్రజలు విమర్శిస్తున్నారు. ఉదాహరణకు జిల్లా కేంద్రమైన బాపట్ల, గుంటూరు నగరంలో పలు ప్రాంతాల్లో అంధకారంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. బాపట్ల పట్టణ నడిబొడ్డున ఉన్న కాలనీల్లో కూడా వీధిలైట్లు వెలగడంలేదు. పట్టణంలోని మూడో వార్డు రాజీవ్‌గాంధీకాలనీలో వీధి లైట్లు వెలగడంలేదు. కాలనీపక్కనే మెడికల్ కళాశాల నిర్మాణం పేరుతో పొలాల మధ్య పెద్దపెద్ద లైట్లు ఏర్పాటు చేశారు. ప్రధానరహదారికి ఇరువైపుల కాంట్రాక్టర్‌కు అనుకూలంగా లైట్లు ఏర్పాటు చేశారు. ఆ సమీపంలోని రాజీవ్‌గాంధీకాలనీలో మాత్రం లైట్లు వెలగవు. దీంతో రాత్రులు పాములు, విషపురుగులు రోడ్లపైకి, ఇళ్ళలోకి వస్తున్నాయని ఆ ప్రాంత ప్రజలు పేర్కొంటున్నారు. కుక్కలు రాత్రుళ్ళు ఇళ్ళకు వెళ్ళేవారిపై దాడి చేస్తున్నాయి. ఈ విషయమై మున్సిపల్ డీఈ కె.శ్రీనివాసరావును వివరణ కోరగా మున్సిపాలిటీకి లైట్లు రావడంలేదని కొత్తగా ఏర్పాటు చేయాలంటే సాధ్యపడదన్నారు. ఇక గుంటూరు నగరంలో చాలా ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగడం లేదు. విలీన గ్రామాలు, శివారు ప్రాంతాల్లో రాత్రి వేళల్లో అంధకారంలోనే ప్రజలు రాకపోకలు సాగించాల్సి వస్తోంది. నగరంలోని స్తంభాలగరువు, శ్యామలానగర్, రవీంద్రనగర్, ఆర్మీ రిక్రూట్‌మెంట్ కార్యాలయం, పాత గుంటూరు పరిధిలోని లక్ష్మీనగర్, శుద్ధపల్లిడొంక, యాదవ్ బజార్, అలీనగర్, కాకాని రోడ్డులోని మద్దిరాలకాలనీ, గణేష్ నగర్, గడ్డిపాడుతో పాటు రెడ్డిపాలెం, గోరంట్ల, అడవితక్కెళ్ళపాడు, నల్లపాడు, నాయుడుపాలెం, అంకిరెడ్డిపాలెం, లాలుపురం, ఏటుకూరు, బుడంపాడు తదితర విలీన గ్రామాల్లో వీధి దీపాలు వెలగడం గగనంగా ఉంటోంది.


వేమూరు: వెల్లబాడులో పని చేయని విద్యుత్ స్టార్టర్



బాపట మూడోవ వార్డు రాజీవ్‌గాంధీకాలనీలో వీధి లైట్లు వెలగక అంధకారంలో రహదారి.

పేరు మార్చి పట్టించుకోవడం లేదు

విద్యుత్ బిల్లుల భారం తగ్గించుకునే క్రమంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో చంద్రన్న కాంతి పథకం ద్వారా ఎల్‌ఈడీ వీధి దీపాలను సరఫరా చేశారు. ఎల్‌ఈడీ లైట్లు కాంతులు వెదజల్లడంతో పాటు బిల్లుల భారం తగ్గడంతో ఈ పథకంపై సర్వత్రా హర్షంవ్యక్తమైంది. అయితే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎల్‌ఈడీ దీపాల గురించి పట్టించుకోలేదు. పల్లెల్లో ఎల్‌ఈడీ లైట్ల వెలుగులు మూణ్నాళ్ల ముచ్చటగా మారాయి. జగనన్న పల్లె వెలుగుగా పేరు మార్చినప్పటికీ నిధుల కొరతతో గ్రామాల్లో వీధిలైట్ల ఏర్పాటు అంతంత మాత్రంగా ఉంది. సచివాలయాల్లో ఎనర్జీ అసిస్టెంట్లకు వీధిదీపాల బాధ్యత అప్పగించినప్పటికీ నిధుల కొరతతో వారు ఏమీ చేయలేకపోతున్నారు. ఎల్‌ఈడీ బల్బుల ప్రాజెక్టు నేటికీ అమలుకు నోచుకోవడం లేదు. మండల కేంద్రాలు, మేజర్‌పంచాయతీల్లో తప్ప శివారు గ్రామాల్లోని వీధిలైట్లు వెలగక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ లైట్లు మరమ్మతులకు గురైతే సరిచేసే వారే లేరు. ఆదాయం ఉన్న పంచాయతీల్లో కొందరు ఎల్‌ఈడీ బల్బులను కొనుగోలు చేసి అమర్చుకుంటుండగా మైనర్ పంచాయతీల్లో ఆదాయం లేక సాధారణ బల్బులనే వాడుతున్నారు.


గుంటూరులో ఓ వీధిలో వెలగని వీధి దీపాలు

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (సాయంత్రం) 6.23(బుధవారం)
సహారీ (ఉదయం) 5.01 (గురువారం)



మెరిట్ మాయ

- బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీలో అవకతవకలు
- అనర్హులకు ఉద్యోగాలు.. అర్హులకు అన్యాయం
- ఎక్కువ మార్కులు వచ్చినట్లు సర్టిఫికెట్లు సృష్టి
- అక్రమాల్లో దరఖాస్తు చేసుకున్న ఓ అభ్యర్థిదే కీలకపాత్ర
- ఓ ముఖ్య అధికారిని తప్పుదారి పట్టించిన అక్రమార్కులు

గుంటూరు సిటీ, మార్చి 12: మెరిట్ ప్రాతిపదికన జరగాల్సిన బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీలో భారీగా అవకతవకలు జరిగాయి. ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో బోగస్ సర్టిఫికెట్లు హల్‌చల్ చేశాయన్న ఆరోపణలున్నాయి. అధిక మార్కుల కోసం కొందరు అభ్యర్థులు అడ్డదారులు తొక్కడంతో అరు లైన వారికి నష్టం జరిగింది. ఈ వ్యహారంలో ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థి కీలక పాత్ర పోషించి అక్రమాలకు తెరలేపినట్లు ఆరోపణలున్నాయి. గుట్టుచప్పుడు కాకుండా సాగిన ఈ వ్యవహారంలో కొందరు జిల్లాస్థాయిలోని ఓ ముఖ్య అధికారిని కూడా తప్పుదారి పట్టించినట్లు సమాచారం. ఉమ్మడి గుంటూరు జిల్లాలో సుమారు 22 బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి గత ఏడాది మార్చి 25న నోటిఫికేషన్ విడుదలైంది. అటెండర్ ఉద్యోగానికి ఏడో తరగతి అర్హతగా ఉండగా, మార్కుల ప్రాతిపదికన అభ్యర్థులను ఎంపిక చేస్తామని ప్రకటించారు. దీంతో అభ్యర్థులు అధిక మార్కుల కోసం అడ్డదారులు తొక్కారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన చాలామందికి ఏడో తరగతిలో 300 లోపు మార్కులు మాత్రమే వచ్చాయి. ప్రైవేటు పాఠశాలలో చదివిన వారికి మాత్రమే 400కిపైగా మార్కులు వచ్చాయి. దీంతో ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు దొంగ సర్టిఫికెట్లు కోసం ప్రైవేటు పాఠశాలలను ఆశ్రయించినట్లు తెలుస్తోంది. ఎప్పుడో ప్రభుత్వ పాఠశాలలో చదివిన వారు కూడా ప్రైవేటుగా చదివినట్లు సర్టిఫికెట్లు పుట్టించారు. ఉదాహరణకు దుగ్గిరాల ప్రభుత్వ పాఠశాలలో చదివిన ఓ అభ్యర్థి అక్కడ ఏడో తరగతి లో కేవలం 300 లోపు మార్కులే సాధించారు. అయితే ఆ అభ్యర్థి తాను ప్రైవేటుగా చదివి 400 మార్కులు సాధించినట్లు చూపారు. ఎక్కువ మంది అభ్యర్థులు ఇదే రీతిలో వక్ర మార్గంలో సర్టిఫికెట్లు తెచ్చినట్లు తెలుస్తోంది. మెరిట్‌లిస్ట్ రూపకల్పనలో అర్హులైన అభ్యర్థులు పూర్తిగా వెనుకబడి పోయారు. ప్రైవేటు పాఠశాలలో చదివినట్లు సర్టిఫికెట్లు తెచ్చుకున్న వారు అర్హత పొందారు. జూనియర్ అసిస్టెంట్ పోస్టుల భర్తీలోనూ అక్రమాలు జరిగాయన్న ఆరోపణలున్నాయి. డిగ్రీలో 75 శాతం మార్కులు వచ్చిన వారిని కాదని, కేవలం 60 శాతం మార్కులు వచ్చిన వారికి ఉద్యోగాలు దక్కినట్లు ఆరోపణలున్నాయి. వయస్సుతో నిమిత్తం లేకుండా, పెద్దవయస్సు వారిని పక్కన పెట్టేసి, చిన్న వయసు వారికి ఎంపికలో పెద్ద పీట వేశారని తెలుస్తుంది.

అభ్యర్థే రింగు లీడర్?

ఏడో తరగతి ప్రైవేటుగా చదివినట్లు చూపి ఉద్యోగం పొందిన ఓ అభ్యర్థి ఈ మొత్తం వ్యవహారంలో కీలకపాత్ర పోషించినట్లు తెలుస్తోంది. అక్రమ మార్గంలో ఉద్యోగం పొందిన ఆరుగురు అభ్యర్థుల వద్ద ఇదే వ్యక్తి ఒక్కొక్కరి నుంచి సుమారు రూ.10 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు వసూలు చేసినట్లు సమాచారం. అధిక మొత్తంలో అప్పజెప్పిన వారికి ఇరిగేషన్, వ్యవసాయశాఖ, మున్సిపాలిటీ, ఖజానా శాఖల్లో ఉద్యోగాలు ఇప్పించినట్లు అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. వసూలు చేసిన సొమ్మును అతడు కొందరు అధికారులకు పంపిణీ చేశారన్న ఆరోపణలున్నాయి. మొదట్లో సర్టిఫికెట్లు అసలివా, నకిలీవా అన్నదానిపై విచారణ జరిపించాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. కొంత విచారణ జరిగినా జరగాల్సిన అక్రమాలు జరిగిపోయాయి. ఈ మొత్తం వ్యహారంపై విచారణకు ఆదేశించి చర్యలు చేపట్టాలని పలువురు అభ్యర్థులు కోరుతున్నారు.

- చిలకలూరిపేట వైసీపీ సమన్వయకర్తగా కావటి మనోహర్ నాయుడు
- అధిష్ఠానం నిర్ణయంపై నియోజకవర్గంలో తీవ్రవ్యతిరేకత
- చిలకలూరిపేట టిక్కెట్ స్థానికులకే ఇవ్వాలని నేతల డిమాండ్
- మంత్రి రజనీపై తీవ్రస్థాయిలో విమర్శలు చేసిన రాజేష్‌నాయుడు
- ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తికి ఝలక్.. ప్రభుత్వ విప్‌గా తొలగింపు



మల్లెల స్థానంలో.. మనోహర్

చిలకలూరిపేట, నరసరావుపేట, గుంటూరు (ఆంధ్రజ్యోతి), మార్చి 12: ఇక ఎవరి సీట్లు మారవు.. ఇప్పటి వరకు ప్రకటించిన వారిలో మార్పులు ఉండవు.. అందరూ జాగ్రత్తగా పని చేసుకోండి.. అని గతంలో వైసీపీ అధినేత, సీఎం జగన్ ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే అందుకు విరుద్ధంగా మార్పులు జరుగుతూనే ఉన్నాయి. ఈ మార్పులకు కొనసాగింపుగా తాజాగా పల్నాడు జిల్లా పరిధిలోని చిల కలూరిపేట చేరింది. చిలకలూరిపేట సమన్వ యకర్త పదవి నుంచి మల్లెల రాజేష్‌నాయుడ్ని తొలగిస్తూ మంగళవారం వైసీపీ అధిష్ఠానం ఆదేశాలు జారీ చేసింది. ఈ నిర్ణయంపై పార్టీ శ్రేణులు భగ్గుమంటున్నాయి. చిలకలూరిపేట నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికై మంత్రిగా ఎదిగిన విడుదల రజినీ మళ్లీ ఇక్కడ గెలిచే పరిస్థితి లేదని గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి గతంలోనే మార్చిన విషయం తెలిసిందే. అనంతరం మంత్రి రజినీ ఆశీస్సులతో చిలకలూరిపేటకు చెందిన మల్లెల రాజేష్ నాయుడుకు సమన్వయకర్తగా వైసీపీ అధిష్ఠానం బాధ్యతలు అప్పగించింది. ఆయనకే చిలకలూరిపేట టికెట్ ఖాయమని ఇటీవల సాధికార బస్సుయాత్ర సందర్భంగా విజయ సాయిరెడ్డి స్పష్టం చేశారు. ఈ క్రమంలో కొంత కాలంగా రాజేష్‌నాయుడు నియోజకవర్గంలో ప్రచారం చేసుకుంటూ వచ్చారు. అధికారిక కార్యక్రమాల్లో ఇన్‌చార్జి హోదాలో కూడా ఆయన పాల్గొన్నారు. అయితే అకస్మాత్తుగా రాజేష్ నాయుడ్ని మార్చబోతున్నారంటూ ప్రచారం జరిగింది. ఈ క్రమంలోనే మంత్రి రజిని, రాజేష్ నాయుడు ఎడమొహం పెడమొహంగా ఉంటున్నారు. ఈలోగా మంత్రి అంబటి రాంబాబును చిలకలూరిపేటకు అభ్యర్థిగా పంపిస్తున్నారంటూ కూడా వార్తలు వెలువడ్డాయి. అయితే తాజాగా రాజేష్‌నాయడు విషయంలో అధిష్ఠానం తన నిర్ణయాన్ని మార్చుకుంది. ఆయన స్థానంలో గుంటూరు నగర మేయర్ కావేటి మనోహర్‌నాయుడుని నియమిస్తూ మం గళవారం రాత్రి పార్టీ ప్రకటన విడుదల చేసింది. దీనిపై చిలకలూరిపేట నియోజకవర్గంలో వైసీపీ శ్రేణుల నుంచి తీవ్రవ్యతిరేకత వ్యక్తమవుతోంది.

చిలకలూరిపేట వైసీపీలో రచ్చరచ్చ..

మంగళవారం మధ్యాహ్నం నుంచి చిలకలూరిపేటలో టిక్కెట్ రచ్చ తారాస్థాయికి చేరింది. ఇది జరిగిన గంటల వ్యవధిలోనే దీనికి చెక్ పట్టేందుకే రాజేష్‌నాయడుని తొలగించి నియోజకవర్గ సమన్వయకర్తగా హడావుడిగా కావటి మనోహర్‌నాయుడు పేరును వైసీపీ ప్రకటించింది. అయితే అంతకముందే మల్లెలను తొలగించడాన్ని వ్యతిరేకిస్తూ నాయకులు, పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు రాజీనామాలకు సిద్ధమయ్యారు. అధిష్ఠానం తన నిర్ణయాన్ని మార్చుకోకుంటే తాము పార్టీకి రాజీనామా చేస్తామని హెచ్చరించారు.

జంగాకు ఝలక్

వైసీపీ అధిష్ఠానం ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తికి ఝలక్ ఇచ్చింది. ప్రభుత్వ విప్ పదవి నుంచి ఆయనను తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కొంతకాలంగా వైసీపీపై జంగా తీవ్ర స్థాయిలో విమర్శలు చేస్తున్నారు. పార్టీని వీడి టీడీపీలో చేరతారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ నేపథ్యంలో ఆయనను విప్ పదవి నుంచి తొలగించింది.

నిధుల దుర్వినియోగంపై కన్నెర్ర

కొమరోలు సొసైటీ ఉద్యోగులపై క్రిమినల్ చర్యలు

ఆదేశాలు జారీ చేసిన కలెక్టర్ దినేష్‌కుమార్

పోలీస్ స్టేషన్‌లోనూ ఫిర్యాదు

ఒంగోలు(విద్య), మార్చి 12 : కొమరోలు విశాల వ్యవసాయ సహకార పరపతి సంఘం(సొసైటీ)లో జరిగిన నిధుల దుర్వినియోగం, పరిపాలన పరమైన అక్రమాలపై కలెక్టర్ దినేష్‌కుమార్ కన్నెర్ర చేశారు. సొసైటీలో జరిగిన రూ.80.86 లక్షల నిధుల స్వాహా, ఇతర అవకతవకలు, అక్రమాలకు బాధ్యులైన వారిపై క్రిమినల్ చర్యలకు ఆమోద ముద్ర వేశారు. దీంతో సొసైటీలో జరిగిన ఆర్థిక అక్రమాలపై ఏపీ సహకార సంఘాల చట్టం 1964 సెక్షన్ 51 ప్రకారం చట్టబద్ధమైన విచారణకు డీసీఓ రాజశేఖర్ ఆదేశించారు. విచారణాధికారిగా పొదిలి సబ్ డివిజనల్ సహకారాధికారి కె.వెంకటేశ్వర్లును నియమించారు. సొసైటీపై విచారణ నిర్వహించిన విచారణాధికారి సొసైటీలో రూ.80.86 లక్షలు స్వాహా అయ్యాయని, పలు ఆర్థిక పరిపాలన పరమైన అవకతవకలు జరిగాయని తేల్చారు. ఈ నిధుల స్వాహాకు సొసైటీ మాజీ సీఈఓ రావూరి దిలీప్‌కుమార్, సొసైటీ మాజీ చైర్మన్ గజ్జలకొండ చినవెంకటేశ్వర్లు, అప్పటి పీడీసీసీ బ్యాంకు సూపర్‌వైజర్ షేక్ రహంతుల్లా, గిద్దలూరు పీడీసీసీ బ్యాంకు మేనేజర్ దేశెట్టి శ్రీనివాసులును బాధ్యులుగా తేల్చి విచారణ నివేదికను విచారణాధికారి సమర్పించారు. దీంతో నిధుల దుర్వినియోగానికి బాధ్యులైన ఈ నలుగురిపై ఏపీ సహకార సంఘాల చట్టం 1964సెక్షన్79(1)(ఎ), 79(1)(ఎఫ్), 79(3),(1) ప్రకారం క్రిమినల్ చర్యలకు అనుమతించమని మార్కాపురం డివిజనల్ డిప్యూటీ రిజిస్ట్రార్ రాజశేఖర్ కలెక్టర్‌కు నివేదించారు. విచారణాధికారి నివేదికను కూడా కలెక్టర్‌కు సమర్పించారు. వీటిని పరిశీలించిన కలెక్టర్ ఆ నలుగురిపై విచారణకు అనుమతి ఇస్తూ ఉత్తర్వులు జారీచేశారు. బాధ్యులపై వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఆదేశించారు. కలెక్టర్ ఉత్తర్వుల మేరకు మార్కాపురం డిప్యూటీ రిజిస్ట్రార్ రాజశేఖర్ ఈ నలుగురిపై కొమరోలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కలెక్టర్ జారీచేసిన ఉత్తర్వుల నకలను సంబంధిత స్టేషన్ హౌస్ అధికారి, మార్కాపురం డీస్పీకి అందజేశారు.

సీసీఆర్ ఏర్పాట్లను రెండు రోజుల్లో పూర్తిచేయాలి

కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 12 : జిల్లాలో త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కలెక్టరేట్‌లో సెంట్రల్ కంట్రోలు రూమ్(సీసీఆర్) ఏర్పాట్లను రెండు రోజుల్లో పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంను జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, డీఆర్వో శ్రీలతతో కలిసి మంగళవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. కంట్రోలు రూంలో కంప్యూటర్లు, ప్రింటర్లు, జెరాక్స్ మిషన్లు, ఇంటర్‌నెట్, టీవీలు, కుర్చీలు, టేబుళ్లు ఇతర సదుపాయాలన్నీ కల్పించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు పూర్తిస్థాయిలో మానిటరింగ్ చేసేలా సీసీఆర్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కంట్రోల్ రూములో ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులు, టోల్‌ఫ్రీ నెంబరు, సోషల్ మీడియా, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా వార్తలు, ఎంసీసీ మానిటరింగ్ తదితర విభాగాలను పర్యవేక్షించేందుకు పలు శాఖల అధికారులు, సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. వారికి అవసరమైన శిక్షణ కూడా ఇస్తామన్నారు. పోలింగ్ రోజున వెబ్‌కాస్టింగ్ ద్వారా పర్యవేక్షణకు అవసరమైన ఏర్పాట్లను చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వివిధ కమిటీల నోడల్ అధికారులు జాలిరెడ్డి, వెంకటేశ్వర్లు, వసుంధర, రవికుమార్, పేరయ్య, మాధూరి, మర్దన్‌ఆలీ, సుశీల, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

16న కొత్తకోటలో పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ఠ

● రేపటి నుంచి పూజలు, 15న గ్రామోత్సవం



కొత్తకోటలో నూతనంగా నిర్మించిన పోలేరమ్మగుడి

ఒంగోలు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): నాగులుప్పలపాడు మండలం కొత్తకోట గ్రామంలో పోలేరమ్మ తల్లి శిలా విగ్రహ ప్రతిష్ఠ ఈనెల 16న వైభవంగా జరగనుంది. ఎన్నో దశాబ్దాల నుంచి పరిసర ప్రాంతంలో ప్రముఖంగా ఉన్న పోలేరమ్మ గుడి శిథిలావస్థకు చేరగా పునర్నిర్మాణానికి గ్రామస్థులు శ్రీకారం చుట్టారు. గ్రామపెద్దలు నల్లమోతు వీరభద్రరావు, కోనూరి వెంకట్రామయ్య చిన్నల సురేష్‌బాబు, కోనూరి ఆంజనేయులు తదితరులు చొరవ చూపగా గ్రామస్థులతో పాటు వివిధ ప్రాంతాల్లో ఉద్యోగ, వ్యాపార, వివిధ వృత్తులలో స్థిరపడిన కొత్తకోటవాసులు భారీగా నిధులు సమకూర్చారు. దీంతో ఏడాది కాలంలోనే నూతన దేవాలయ నిర్మాణం పూర్తయింది. ఈనెల 16న ఉదయం 8.54 గంటలకు నూతన శిలా విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం జరగనుంది. ఇందుకు సంబంధించి 14వతేదీ నుంచి మూడురోజులు పూజా కార్యక్రమాలు జరగనున్నాయి. అందులోభాగంగా ఈనెల 15వతేదీ సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించనున్నారు. విగ్రహ ప్రతిష్ఠ రోజున అన్నదాన కార్యక్రమం నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

పొగాకు గరిష్ఠ ధర రూ.231

సంతనూతలపాడు, మార్చి 12: పేర్నమిట్ట సమీపంలో ఒంగోలు-1వ పొగాకు బోర్డు వేలం కేంద్రంలో మంగళవారం పొగాకు కిలో గరిష్ఠ ధర రూ.231 పలికింది. కొణిజేడు నుంచి 595 బేళ్లు రాగా 505 బేళ్లు అమ్ముడయ్యాయి. 90 బేళ్లు తిరస్కరణకు గురైనట్లు ఆక్షన్ సూపరింటెండెంట్ రవికాంత్ తెలిపారు. గరిష్ఠ ధర రూ.231లు పలకగా, కనిష్ఠ ధర రూ.230లు పలికింది. సరాసరి ధర రూ.227.44 వచ్చినట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో కొనుగోలు 20 కంపెనీల ప్రతినిధులు, రైతు నాయకులు, రైతులు పాల్గొన్నారు.

అన్నివర్గాల సంక్షేమమే టీడీపీ అజెండా : దామచర్ల

11వ డివిజన్ క్లౌపేటలో దామచర్ల ఇంటింటి ప్రచారం

ఒంగోలు (కార్పొరేషన్), మార్చి 12 : అన్ని వర్గాల సంక్షేమమే తెలుగుదేశం పార్టీ అజెండా అని, రాబోయే ఎన్నికల్లో టీడీపీ గెలుపుతో ప్రజలు కోరుకున్న సంక్షేమం సాధించుకోవాలని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల జనార్దన్ చెప్పారు. జనం కోసం జనార్దన్ కార్యక్రమాన్ని మంగళవారం నగరంలోని 11వ డివిజన్ క్లౌపేటలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఆశీర్వదించి గతంలో ఎమ్మెల్యేగా గెలిపించగా, అవినీతికి తావులేకుండా నిస్వార్థంగా పనిచేసి, అభివృద్ధి చేశానని తెలిపారు. నగరంలో రహదారుల విస్తరణ, నగర సుందరీకరణ, హైమాక్స్ విద్యుత్ దీపాల ఏర్పాటుతోపాటు పార్కులు అభివృద్ధి చేయడమే కాకుండా వేసవిలోను తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు చేశానని తెలిపారు. తాను చేసిన అభివృద్ధి ప్రజల కళ్లముందు కనిపిస్తుందన్నారు. అలాగే వైసీపీ అధికారంలోకి వచ్చి నాలుగున్నరేళ్లు అవుతున్నా ఒక్క అభివృద్ధి చేయలేదని తెలిపారు. ముఖ్యంగా ఉద్యోగులు, పేద, మధ్య తరగతి ప్రజలపై ఆర్థిక భారాలు మోపిందని చెప్పారు. నేడు హైదరాబాదు నగరంలో ఐటీ రంగం విస్తరణ చంద్రబాబు హయాంలోనే జరిగిందని, రాబోయే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. తనకు ఎమ్మెల్యేగా మరో అవకాశాన్ని కల్పిస్తే వెనుకబడిన నగర అభివృద్ధిని అన్నీ విధాలుగా అభివృద్ధి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు గంగవరపు సందీప్, మాజి కౌన్సిలర్ మాగులూరి ప్రేమ్‌కుమార్, ఎద్దు శశికాంత్ భూషణ్, క్లస్టర్ ఇన్‌ఛార్జి షేక్ కపిల్ బాషా, మంచు లలిత్ కుమార్, జెన్ని దివాకర్, పార్టీ నాయకులు మంత్రి శ్రీనివాసరావు, కొఠారి నాగేశ్వరరావు, బొల్లినేని వాసుకృష్ణ, కామేపల్లి శ్రీనివాఆసరావు, బండారు మదన్, పాలూరి వెంకటేశ్వరరెడ్డి, మహిళా నాయకురాలు ఆర్ల వెంకటరత్నం పాల్గొన్నారు. ఈ సందర్భంగా డివిజన్ ప్రజల నుంచి దామచర్లకు ఘన స్వాగతం పలికారు.



నిమ్జ్‌పై నిర్లక్ష్యం..!

ఐదేళ్ల పాలనలో వదిలేసిన వైసీపీ

టీడీపీ ప్రభుత్వ హయాంలోనే పూర్తయిన భూసేకరణ

పామూరు, పీసీపల్లి మండలాల్లో 12వేల ఎకరాలకుపైగా గుర్తింపు

ఉద్యోగ, ఉపాధి కల్పిస్తామని జగన్ హామీ

తర్వాత ఆ ఊసే లేని పాలకులు

వేలాది మంది నిరుద్యోగుల ఆశలపై నీళ్లు



నిమ్జ్ ఏర్పాటు ప్రాంతం

కనిగిరి, మార్చి 12: వేలాది మందికి ఉపాధి కల్పించే నిమ్జ్ (జాతీయ పారిశ్రామిక ఉత్పాదక మండలి)లో కదలిక లేకుండా పోయింది. నిమ్జ్‌కు తొలి అడుగు 2013లో పడినా భూసేకరణ, రాష్ట్ర విభజన తరువాత తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరమే నిమ్జ్ సర్వే ముందుకు సాగింది. ఏడేళ్ల క్రితం సీఎం చంద్రబాబు సీఎస్ పురం మండలంలో జన్మభూమి మా ఊరు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆ సందర్భంలో నిమ్జ్ ఏర్పాటుకు పూర్తిగా సహకరించి నిరుద్యోగ సమస్యను పారదోలుతామని ప్రకటించారు. ఆ వెనువెంటనే ఆ దిశగా అడుగులు పడుతూ భూసేకరణ సర్వే ప్రక్రియ వేగవంతం చేశారు.

టీడీపీ ప్రభుత్వంలోనే నిమ్జ్ ఏర్పాటుకై భూసేకరణ పూర్తి

నిమ్జ్ ఏర్పాటుకు అవసరమైన భూసేకరణను టీడీపీ ప్రభుత్వ హయాంలో దాదాపుగా పూర్తి చేశారు. కనిగిరి నియోజకవర్గంలోని పీసీపల్లి మండలంలోని పెద ఇర్లపాడు పంచాయతీ పరిధిలోని గుంటూరు లింగన్నపాలెం వద్ద పక్కా భూమి 213.79 ఎకరాలు, అసైన్డ్ భూమి 440.19 ఎకరాలు, 918.29 ఎకరాల ప్రభుత్వ భూమిని నిమ్జ్ కోసం ఇప్పటికే ఏపీఐఐసీకి అప్పగించారు. పామూరు మండలంలోని అయ్యన్నకోట, రేణిమడుగు, సిద్ధవరం, మాలకొండాపురం, బోడవాడ గ్రామాల్లో కూడా భూసేకరణ పూర్తిచేశారు. రెండు మండలాల్లో 12,538 ఎకరాలు గుర్తించగా ఇందులో పట్టా భూములు 6,810 ఎకరాలు, ప్రభుత్వ భూములు 3,030 ఎకరాలు, అసైన్డ్ భూములు 2,698 ఎకరాలుగా రెవెన్యూ అధికారులు గుర్తించారు. భూములు కోల్పోయిన రైతులతో సమావేశాలు నిర్వహించి వారిని ఒప్పించారు. ఈ ప్రక్రియ మొత్తం టీడీపీ ప్రభుత్వ హయాంలోనే పూర్తయింది.

> **వైసీపీ** ప్రభుత్వ పాలనలో జిల్లాలో అభివృద్ధి పడకేసింది. కీలక సంస్థల ఏర్పాటు అడుగు ముందుకు పడలేదు. ఇందుకు నిమ్జ్‌నే నిదర్శనం. ఎన్నికలకు ముందు జగన్‌రెడ్డి నిమ్జ్ ఏర్పాటుకు కృషి చేసి ఉద్యోగ, ఉపాధి కల్పిస్తామని కనిగిరి ప్రాంత ప్రజలకు గట్టి మాట చెప్పారు. కానీ హామీ కలగానే మిగిల్చారు. జిల్లాలో పశ్చిమ ప్రాంత ప్రజలు ఎదురుచూస్తున్న ప్రతిష్టాత్మక సంస్థల ఏర్పాటుపై వైసీపీ ప్రభుత్వం తీవ్రంగా నిర్లక్ష్యం వహించింది. ఐదేళ్ల పాలనలో నిమ్జ్ ఊసే లేకుండాపోయింది. దీంతో వేలాదిమందికి ఉపాధి అవకాశాలు సన్నగిల్లాయి. కనిగిరి ప్రాంతంలో ప్రతిష్టాత్మక సెజ్ ఏర్పాటుతో అవకాశాలు పెరిగి వలసలు నిలిచిపోతాయనుకున్న వేలాదిమంది నిరుద్యోగుల ఆశలు నెరవేరలేదు.

నిమ్జ్‌పై వైసీపీ చిన్నచూపు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రూ.10వేల కోట్ల అంచనాలతో మూడు దశల్లో నిమ్జ్‌ను 2040 నాటికి పూర్తి చేయాలన్నది లక్ష్యం. కనిగిరి నియోజకవర్గంలోని పామూరు, పీసీపల్లి మండలాల్లో నిమ్జ్ ఏర్పాటుకు టీడీపీ ప్రభుత్వం భూముల సర్వేను పూర్తిచేసింది. సకాలంలో కేంద్రప్రభుత్వం సహకరించి అనుకున్న లక్ష్యం నెరవేరితే రూ.43,700కోట్ల కేటాయింపులో తొలివిడత నిధులు మంజూరయ్యేవి. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ కనీసం కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లోనైనా నిమ్జ్ కేటాయింపులు రాబట్టేందుకు కనీస ప్రయత్నం కూడా చేయలేదు. నిమ్జ్ కార్యరూపం దాలిస్తే ప్రత్యక్షంగా లక్ష మందికి, పరోక్షంగా మరో 2లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభించేవి. పారిశ్రామిక రంగాలకు సంబంధించి నైపుణ్యం, అర్హతలు సాధిస్తే మరో ప్రాంతానికి ఉపాధి వేటకు వెళ్లకుండా నిమ్జ్ పారిశ్రామిక కారిడార్ ద్వారా చక్కటి బాటలు వేసుకునే అవకాశం ఉండేది. పరిశ్రమలు రావడం ద్వారా భూములకు విలువలు పెరగడంతోపాటు పరోక్షంగా వ్యాపారాలు పెరిగి ప్రజలు ఆర్థిక పురోగతి చెందేవారు. కానీ వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా జిల్లాలోని పశ్చిమ ప్రాంతం ప్రజలతో పాటు కనిగిరి ప్రాంతానికి చెందిన ప్రజలు ఉపాధి కోసం వలస బాట పడుతున్నారు.

దశాబ్దంపైగా ఆవిరవుతున్న నిరుద్యోగుల ఆశలు

జిల్లాలోనే వెనుకబడిన ప్రాంతమైన కనిగిరి నియోజకవర్గంలో ఎటువంటి పరిశ్రమలు లేక కూలీలతోపాటు చదువుకున్న నిరుద్యోగులు వలస బాట పడుతున్నారు. స్వాతంత్ర్యం అనంతరం ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఇంతవరకు ఇక్కడ ఏ ఒక్క పరిశ్రమనూ ఏర్పాటు కాలేదు. దీంతో ప్రజలకు, నిరుద్యోగులకు వలసబాట తప్పనిసరైంది. ఈ నేపథ్యంలో తెరపైకి వచ్చిన నిమ్జ్‌పై కనిగిరి ప్రాంత ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. పారిశ్రామిక రంగాల్లో కీలకమైన నిమ్జ్ ఏర్పాటుకు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు నిధులు కేటాయింపులు జరపలేదు. కనిగిరి ప్రాంత ప్రజలు దశాబ్దకాలంగా నిమ్జ్ ఏర్పాటుకు ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో కేంద్రప్రభుత్వం కూడా బడ్జెట్‌లో రాష్ట్రంలో పారిశ్రామిక రంగానికి కేటాయింపులు చేయకపోవడం బాధాకరం. రాష్ట్ర విభజన అనంతరం అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం నిమ్జ్ ఏర్పాటుకు శ్రీకారం పలికి భూసేకరణను పూర్తిచేసి నివేదికలు పంపింది. దీంతో కీలకమైన పారిశ్రామిక రంగం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. ఆ తర్వాత 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ నిమ్జ్ భూసేకరణ కాగితాలకే పరిమితం చేసి, లక్షలాది మంది నిరుద్యోగులు పెట్టుకున్న ఆశలపై నీళ్లు చల్లింది.

నిమ్జ్ ఏర్పాటుకై శక్తివంచన లేకుండా సాధిస్తా

-టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఉగ్ర

కనిగిరి ప్రాంతం అభివృద్ధే నా లక్ష్యం. అందులోభాగంగా చేపట్టిన ఐదు అభివృద్ధి ప్రణాళికలలో నిమ్జ్ ఒకటి. అది ఏర్పాటైతే కనిగిరి ప్రాంతం పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందుతుంది. వలసలు ఆగుతాయి. ఈ ప్రాంతానికి చెందిన ప్రజలు పరాయి ప్రాంతాల్లో పనులు చేయడం చూసినప్పుడల్లా నా మనసు కలచి వేస్తుంది. నిమ్జ్ ఏర్పాటైతే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయి. ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన వైసీపీ పాలకులు నిమ్జ్‌పై నిర్లక్ష్యం వహించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలోనే నిమ్జ్ ఏర్పాటుకు భూసేకరణ జరిగింది. అధికారంలోకి రాగానే నిమ్జ్ ఏర్పాటు ప్రక్రియ పూర్తిచేసి నిరుద్యోగులు కల నెరవేరుస్తాం.

రసవత్తరంగా దర్శి

బరిలో టీడీపీ అభ్యర్థే?

పరిశీలనలో శిద్దా, కృష్ణచైతన్య, డాక్టర్ లక్ష్మి పేర్లు

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)



లక్ష్మి

తెలుగుదేశం పార్టీ, జనసేన కూటమి బీజేపీతో జతకట్టిన నేపథ్యంలో జిల్లాలో దర్శి నియోజకవర్గ రాజకీయం రసవత్తరంగా మారింది. తొలుత టీడీపీ, జనసేన మధ్య జరిగిన ఒప్పందంలో దర్శిని జనసేనకు కేటాయించాలని నేతలు నిర్ణయం తీసుకున్నారు. ఆ స్థానం కోసం జనసేన నాయకులు గట్టిగా పట్టుబట్టారు. దీటైన అభ్యర్థిని ఇరు పార్టీలు కలిసి ఎంపిక చేయాలని భావించారు. అయితే బీజేపీతో కూడా ఎన్నికల అవగాహన కుదరడంతో రాష్ట్రంలో టీడీపీ పోటీచేసే స్థానాల్లో ఒకదాన్ని, జనసేన మూడు స్థానాలను వదులుకున్నాయి. జనసేన వదులుకున్న మూడింటిలో దర్శి ఒకటని సమాచారం. దీంతో తెలుగుదేశం పార్టీ నుంచి దర్శి టికెట్ ఆశిస్తున్న వారిలో పోటీ పెరిగింది. అధికారికంగా దర్శి నుంచి టీడీపీ, జనసేనల్లో ఎవరూ పోటీచేస్తారనే విషయం అధికారికంగా ప్రకటించలేదు. అయినా తెలుగుదేశమే రంగంలో ఉండనున్నట్లు తెలుస్తోంది. జనసేన 24 నుంచి మూడు స్థానాలు తగ్గించుకున్నందున జిల్లాలో మరోస్థానం కోరుకునే అవకాశం కూడా లేదంటున్నారు. పైగా టీడీపీ పోటీ చేయబోయే 144 స్థానాల్లో ఉమ్మడి జిల్లాలో ఆ పార్టీ అభ్యర్థులను ప్రకటించని గిద్దలూరు, మార్కాపురం, చీరాల, కందుకూరు కూడా ఉన్నాయి. దీంతో జనసేన ఇతర జిల్లాల్లో ఉన్న అవసరాల దృష్ట్యా ఉమ్మడి ప్రకాశం జిల్లాలో మరోస్థానం కోరుకునే అవకాశం లేదని తెలుస్తోంది.



శిద్దా



చైతన్య

పైగా ఆపార్టీ తరపున అధినేత పవన్‌కల్యాణ్‌కు నమ్మకస్తుడైన జిల్లా అధ్యక్షుడు రియాజ్‌కు భవిష్యత్తులో సముచిత అవకాశాలు ఇస్తామని హామీ ఇచ్చినట్లు తెలిసింది. అలాగే మార్కాపురం జనసేన నాయకుడు ఇమ్మడి కాశీనాథ్‌కు కూడా తగు ప్రాధాన్యం ఇస్తామని ఆపార్టీ నేతలు చెప్పినట్లు తెలిసింది. చీరాలకు చెందిన ఆమంచి స్వాములుకు పార్టీలో ప్రాధాన్యత ఉన్నప్పటికీ ఆయన పదవికి రాజీనామా చేయడంతో ఆపార్టీ నాయకులు అసంతృప్తిలో ఉన్నట్లు సమాచారం. పైగా చీరాలలో ఆయన సోదరుడు కృష్ణమోహన్ స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసే అవకాశాన్ని పరిగణనలోకి తీసుకొని ఒక అంచనాకు వస్తున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో దర్శి నుంచి కూడా టీడీపీ అభ్యర్థే రంగంలో ఉండవచ్చనే స్పష్టత కనిపిస్తోంది. దీంతో దర్శి టికెట్ ఆశిస్తున్న ఆశావాహుల నుండి పోటీ పెరిగింది.

పెరిగిపోయిన ఆశావహులు

వైసీపీ నుంచి టీడీపీలో చేరి దర్శి నుంచి పోటీ చేసేందుకు పలువురు ప్రయత్నిస్తున్నారు. దీంతో టీడీపీ కూడా అభ్యర్థి ఎంపికను సీరియస్‌గా తీసుకొని గెలుపు అవకాశాలను పరిశీలిస్తోంది. మాజీ మంత్రి శిద్దా రాఘవరావు విషయంలో అనేక అవకాశాలు ఇచ్చినప్పటికీ టీడీపీ నుంచి వెళ్లి వైసీపీలో చేరారన్న భావనను ఆ పార్టీ అగ్రనేత వ్యక్తం చేసినట్లు తెలిసింది. అయితే ఇద్దరు కీలక నాయకులు శిద్దాను రంగంలో దింపితే మంచి ఫలితం ఉంటుందని, ఆర్యవైశ్య సామాజికవర్గం నుంచి ఉపయోగం ఉంటుందని సూచించారు. మార్కాపురం నుంచి ఆర్యవైశ్య సామాజికవర్గం అభ్యర్థి పేరును పరిశీలిస్తున్న టీడీపీ అధిష్ఠానం అటు వైపునకు ప్రాధాన్యత ఇస్తోంది. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డితోపాటు టీడీపీలో చేరేందుకు శిద్దా రాఘవరావు సిద్ధమైనట్లు సమాచారం. అయితే టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పార్టీని వీడిన వారిని రానివ్వకూడదనే నిర్ణయంతో ఉన్నందున ఏమి జరుగుతుందో చూడాల్సి ఉంది. జిల్లాలో సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే గరటయ్యతో పాటు అద్దంకి వైసీపీ ఇన్‌చార్జిగా ఉన్న కృష్ణచైతన్యలు టీడీపీలో చేరేందుకు సిద్ధమై బాబును కలిసి ఉన్నారు. డాక్టర్ గరటయ్యకు చంద్రబాబుతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. అద్దంకితోపాటు పర్చూరు, ఎస్ఎన్‌పాడు నియోజకవర్గాల్లో గరటయ్య ప్రభావం ఉండొచ్చనేది జగమెరిగిన సత్యం. వారు ప్రస్తుతం దర్శి టికెట్‌ను ఆశిస్తున్నారు. ఇంకోవైపు మాజీ మంత్రి గొట్టిపాటి హనుమంతరావు మనుమరాలు, మాజీ ఎమ్మెల్యే నరసయ్య కుమార్తె అయిన డాక్టర్ లక్ష్మి కూడా టికెట్‌ను ఆశిస్తున్నారు. ఆమె భర్త డాక్టర్ లలిత్, మామ డాక్టర్ వెంకటేశ్వర్లు నరసరావుపేట టీడీపీలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు. దర్శి నుంచి డాక్టర్ లక్ష్మి ముందుకు రావటంతో ముగ్గురిలో టీడీపీ అవకాశం ఎవరికి దక్కుతుందనేది సందిగ్ధంగా మారింది.

ఉమ్మడి సభకు సమాయత్తం

17న చిలకలూరిపేటలో టీడీపీ కూటమి భారీ సభ

హాజరుకానున్న ప్రధాని మోదీ, చంద్రబాబు, పవన్

యువనేత సమీక్షకు హాజరైన దామచర్ల బ్రదర్స్, ఎరిక్షన్

జనసమీకరణపై పార్టీ ఇన్‌చార్జిల దృష్టి,

భారీగానే తరలిరానున్న పార్టీ శ్రేణులు

ఒంగోలు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : చిలకలూరిపేట సమీపంలోని బొప్పూడి వద్ద ఈనెల 17న టీడీపీ, జనసేన, బీజేపీలు నిర్వహిస్తున్న సభకు జిల్లా నుంచి తరలించేందుకు మూడు పార్టీల శ్రేణులు సన్నద్ధం అవుతున్నాయి. వచ్చే ఎన్నికలలో మూడు పార్టీలు కూటమిగా పోటీ చేయాలన్న లక్ష్యంతో పొత్తులు కుదుర్చుకున్నాయి. అనంతరం తొలిగా రాష్ట్రస్థాయిలో భారీ బహిరంగ సభను పేట సమీపంలో నిర్వహిస్తున్నారు. టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లే కాక ఏకంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా ఈ సభకు వస్తున్నారు. దీంతో మరింత ప్రతిష్ఠాత్మకంగా సభ నిర్వహణకు మూడు పార్టీలు సిద్ధం కాగా టీడీపీ మరింత సీరియస్‌గా తీసుకుంది. కాగా సభ జరిగే ప్రాంతం ఉమ్మడి ప్రకాశం జిల్లా సరిహద్దు కావటంతో ఇక్కడి నుంచి భారీగానే జనసమీకరణ చేయాలని నేతలకు అధిష్ఠానం నుంచి సంకేతాలు అందాయి. దీంతో తక్షణం ఆ వైపు జిల్లాలోని టీడీపీ నియోజకవర్గ నేతలు ఇప్పటికే దృష్టిసారించారు. ప్రాంతాల వారీ సమావేశాలు నిర్వహిస్తున్నారు. అందులోభాగంగా సంతనూతలపాడు నియోజకవర్గ సమావేశం మంగళవారం ఒంగోలులోని మంగమూరురోడ్డులోని ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ కార్యాలయంలో జరిగింది. విజయకుమార్ నేతృత్వంలో జరిగిన సమావేశంలో నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జీలు వంటి ముఖ్యనేతలు పాల్గొన్నారు. అధిష్ఠానం సూచనలకు అనుగుణంగా ఆయా మండలాలు, గ్రామాల నుంచి శ్రేణులు, ప్రజలు తరలివచ్చేలా చూడటంపై చర్చించారు. పొదిలిలో ముఖ్యనేతలతో మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల నారాయణరెడ్డి కూడా సమావేశం నిర్వహించారు. అలాగే బుధ, గురువారాల్లో ఇతర నియోజకవర్గాల్లోనూ ఏర్పాట్లు చేస్తున్నారు. ఇదిలా ఉండగా పేట సభ విజయవంతం కోసం రాష్ట్ర స్థాయిలో మూడు పార్టీల నేతలతో పలు కమిటీలను ఏర్పాటు చేశారు. ఆ సభ్యుల సమన్వయ సమావేశం మంగళవారం ఉండవల్లిలోని పార్టీ అధినేత చంద్రబాబు నివాసంలో జరిగింది. యువనేత నారా లోకేష్ నేతృత్వంలో జరిగిన సమావేశంలో కమిటీ సభ్యులుగా ఉన్న మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి దామచర్ల సత్య, వైపాలెం ఇన్‌చార్జి ఎరిక్షన్ బాబులు పాల్గొన్నారు. అలాగే ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, గొట్టిపాటి రవికుమార్‌లతోపాటు ఇన్‌చార్జీలు ఎంఎంకొండయ్య, ఇంటూరి నాగేశ్వరరావులు కూడా హాజరయ్యారు.



జనసమీకరణపై జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న విజయకుమార్

ఆవుపై పెద్దపులి దాడి

భయాందోళనలో లోయ గ్రామాల ప్రజలు

పెద్దారవీడు, మార్చి 12 : ఆవుపై పెద్దపులి దాడిచేసి చంపివేసిన ఘటన పెద్దారవీడు మండలం, కాటంరాజుతాండ సమీపంలో మంగళవారం వెలుగుచూసింది. డీఆర్వో నాగరాజు కథనం ప్రకారం.. మండలంలోని చర్ల సమీపంలోని కాటంరాజు తాండాకు చెందిన మేఘావత్ శ్రీరాములునాయక్‌కు చెందిన ఆవులు రెండురోజుల క్రితం మేత కోసం అడవికి వెళ్లాయి. అక్కడ రెండు ఆవులపై పులి దాడి చేసింది. అయినప్పటికీ ఒక ఆవు దాడి నుంచి తప్పించుకొని ఇంటికి వచ్చింది. దీంతో ఆయన అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అడవిలో గాలించగా ఆవు కళేబరం దొరికింది. దీంతో అటవీశాఖ అధికారులు ఆ ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. మరుసటి రోజు ఆ ప్రాంతానికి పులి వచ్చి సంచరించింది. ఆ దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. ఘటనా స్థలాన్ని డీఆర్వో నాగరాజు, సిబ్బంది పరిశీలించారు. గ్రామ సమీపంలో జరిగిన ఘటనతో గుండంచర్ల, కాటంరాజు తాండా కలనూతల, లోయ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.



ఆవు కళేబరాన్ని పరిశీలిస్తున్న డీఆర్వో నాగరాజు, సిబ్బంది

చికిత్స పొందుతూ వివాహిత మృతి

తాళ్లూరు, మార్చి 12 : ఇంటి ఖర్చులను పట్టించుకోకుండా డబ్బులు దుబారా చేస్తున్న భర్త తీరుపై మనస్తాపం చెందిన భార్య ఆత్మహత్యా యత్నానికి ఘటన చోటుచేసుకుంది. దీనిపై మంగళవారం కేసు నమోదైంది. భర్త తన మాట వినలేదన్న బాధతో లక్కవరానికి చెందిన కందుల జాష్మి (25) పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి 10 రోజులుగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు లక్కవరం గ్రామానికి లాజర్, జాష్మి భార్యాభర్తలు. వీరిద్దరూ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కూలిడబ్బులను భర్త లాజర్ ఇంటి ఖర్చులకు ఇవ్వడం లేదు. దీనిపై పలుమార్లు భార్య ప్రశ్నించినా పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో ఈనెల 3న పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆమెను గుంటూరు ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. ఆమెకు ముగ్గురు పిల్లలున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై వైవీ రమణయ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని ఏఎస్సై మోహన్‌రావు పోస్టుమార్టంకు తరలించారు.



రొయ్యల సాగుదారులతో మాట్లాడుతున్న కొండయ్య

చంద్రబాబుతోనే రాష్ట్రానికి భవిష్యత్

చీరాల, మార్చి 12: చంద్రబాబుతోనే రాష్ట్రానికి భవిష్యత్ ఉంటుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య అన్నారు. చినగంజాం, వేటపాలెం మండలాల పరిధిలోని పలువురు ఆక్వా రైతుల కోరినమేరకు మంగళవారం కొండయ్య ఆయా ప్రాంతాల్లో రొయ్యల సాగుదారులతో మాట్లాడారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. ఈసందర్భంగా కొండయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమేనని చెప్పారు. ఆక్వా రైతులకు పూర్వవైభవం వస్తుందని అన్నారు. చంద్రబాబు తిరిగి ముఖ్యమంత్రి కావటమే అన్నివర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎం.గౌరీఅమర్‌నాథ్, కార్యకర్తలు, ఆక్వా రైతులు పాల్గొన్నారు.



లోకేష్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కొండయ్య

లోకేష్‌ను కలిసిన కొండయ్య

చీరాల, మార్చి 12: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను మంగళవారం ఉండవల్లిలో ఆపార్టీ చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈసందర్భంగా వారి మధ్య నియోజకవర్గ స్థితిగతులపై కొద్దిసేపు చర్చ జరిగిందని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి.

నేడు టీడీపీ శ్రేణులతో ఎమ్మెల్యే రవికుమార్ సమావేశం

అద్దంకి, మార్చి 12: అద్దంకి పట్టణంలోని 8వ క్లస్టర్ పరిధిలో ఉన్న పలు బూత్‌ల టీడీపీ శ్రేణులతో బుధవారం ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ విడివిడిగా సమీక్ష నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 12నుంచి 1.20 గంటల మధ్య 172 నుంచి 176వ బూత్‌ల టీడీపీ శ్రేణులతో, 1.40కి 171 బూత్, 2 నుంచి 3 గంటల మధ్య 163 నుంచి 166 బూత్‌ల వరకు సమీక్ష చేస్తారు. 3.20 గంటలకు 161, 162 బూత్‌లు, 4 గంటలకు 153, 152 బూత్‌లు 4.40 గంటలకు 167వ బూత్, 5 గంటలకు 155వ బూత్‌లోని టీడీపీ నేతలు, కార్యకర్తలతో రవికుమార్ సమీక్ష నిర్వహించనున్నారు.

మసీదుల్లో రంజాన్ ప్రత్యేక ప్రార్థనలు

ఇంకొల్లు, మార్చి 12: రంజాన్ మాసం ప్రారంభం కావడంతో మండలంలోని మసీదులు విద్యుత్ దీపాల వెలుగులతో కళకళలాడుతున్నాయి. మంగళవారం నుంచి రంజాన్ ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. ఉపవాసాలు ఉండే వారికి ఇంకొల్లు జామియా మసీదు కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.

టీడీపీ హయాంలోనే సంక్షేమ కార్యక్రమాలు

చీరాల, మార్చి 12: తెలుగుదేశం పార్టీ హయాంలోనే బీసీలకు అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్టు ఆపార్టీకి చెందిన పలురువు బీసీ నాయకులు పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ అంటే బీసీ.. బీసీ అంటే తెలుగుదేశం పార్టీ అని ఉద్ఘాటించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మంగళవారం రాత్రి జయహో బీసీ-8వ క్లస్టర్ సమావేశం జరిగింది. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ భవిష్యత్ కార్యాచరణపై శ్రేణులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో నాయకులు కౌతవరపు జనార్దనరావు, వి.మధు, రామయ్య, గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'బోడెంపూడి' మృతి టీడీపీకి తీరనిలోటు

గంగవరం(ఇంకొల్లు), మార్చి 12: మండలంలోని గంగవరం గ్రామానికి చెందిన తెలుగుదేశంపార్టీ నాయకుడు బోడెంపూడి శ్రీనివాసరావు (50) మృతి పార్టీకి తీరనిలోటు అని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు బోడెంపూడి వెంకటేశ్వర్లు చిన్నకుమారుడు శ్రీనివాసరావు అనారోగ్యంతో మంగళవారం మృతి చెందగా సంతాపం తెలిపారు. శ్రీనివాసరావు అకాల మృతి బాధాకరమన్నారు. పార్టీ మంచి నాయకుడిని కోల్పోయిందన్నారు. ఆయన కుటుంబసభ్యులకు పార్టీ అండగా ఉంటుందని చెప్పారు.

ప్రజాసమస్యలను పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం

» ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్



అద్దంకి పట్టణంలోని 20వ వార్డు నేతలు, కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్

అద్దంకి, మార్చి 12: ప్రజాసమస్యలను వైసీపీ ప్రభుత్వం గాలి కొదిలేసిందని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ధ్వజమెత్తారు. అద్దంకి పట్టణంలోని 7వ క్లస్టర్ పరిధిలోని బూత్‌ల టీడీపీ నేతలు, కార్యకర్తలతో మంగళవారం రాత్రి స్థానిక నాగులపాడు రోడ్డులోని కామేపల్లి కల్యాణ మండపంలో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో పార్టీ కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు భవిష్యత్‌లో ఖచ్చితంగా గుర్తింపు ఉంటుందని చెప్పారు. వైసీపీ నేతల బెదిరింపులకు బెదరవలసిన పనిలేదన్నారు. వైసీపీ నేతలు కవ్వింపు చర్యలకు పాల్పడినా, వారి ఉచ్చులో చిక్కుకొని గొడవలకు దిగవద్దన్నారు. దొంగ ఓట్లతో ఎన్నికలలో గెలవాలని వైసీపీ నేతలు చూస్తున్నారన్నారు. ఎప్పటికప్పుడు ఓటర్ల జాబితాపై అప్రమత్తంగా ఉండాలన్నారు.

మేదరమెట్ల వద్ద జరిగిన సిద్ధం సభకు జనాన్ని తరలించేందుకు డబ్బులు, మద్యం పంపిణీ చేసినా ప్రజలలో అభిమానం లేక వెలవెల బోయిందని ఎమ్మెల్యే రవికుమార్ పేర్కొన్నారు. సిద్ధం సభకు 15 లక్షల మంది వచ్చారని వైసీపీ నాయకులు చెప్పుకుంటున్నారని అన్నారు. అయితే, వచ్చింది మాత్రం 1.50 లక్షల మందికి మించి లేరన్నారు. వైసీపీ అరాచక పాలన, ప్రజా వ్యతిరేఖ విధానాలను ఇంటింటికి వెళ్ళి వివరించాలన్నారు. అదే సమయంలో టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అమలుపరిచే పథకాలను కూడా వివరించాలని చెప్పారు. టీడీపీ ప్రభుత్వ హయాం లో అద్దంకి పట్టణంలోని నిరుపేదలకు శింగరకొండ వద్ద టిడ్కో ఇళ్లను 90 శాతం పూర్తిచేస్తే వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఇప్పటివరకు మిగిలిన పది శాతం పనులు పూర్తి చేయలేదన్నారు. ఆ ఇళ్ళ మీద మాత్రం జగన్ అప్పులు తీసుకువచ్చారన్నారు. అద్దంకి పట్టణ ప్రజల శాశ్వత మంచినీటి పరిష్కారం కోసం రూ.82 కోట్లు మంజూరు చేయించి పనులు అప్పట్లోనే ప్రారంభించినా ఇంతవరకు పూర్తి చేయలేదన్నారు. టీడీపీ ప్రభుత్వం పేదల కోసం అన్నా క్యాంటిన్‌లు, పండుగలకు ఇచ్చిన కానుకలు, పెళ్ళి కానుకలు వంటి పథకాలను రద్దు చేసిన జగన్‌రెడ్డి పేదల పక్షపాతి ఎలా అవుతారన్నారు. విద్యుత్ చార్జీలు, ఆర్టీసీ చార్జీలు పెంచి పేదలను దోచుకుంటున్నా ఇంకా పేదల మనిషి అని చెప్పుకునే అర్హత లేదన్నారు. జగన్‌రెడ్డిని గద్దెదించేందుకు అన్ని వర్గాల ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. సంపద సృష్టించి పేదరికం లేని సమాజం రూపొందించడమే చంద్రబాబు లక్ష్యమన్నారు. సమీక్షా సమావేశాలలో టీడీపీ నేతలు కాకాని అశోక్, కోనేటి అనిల్, సందిరెడ్డి శ్రీనివాసరావు, గార్లపాటి శ్రీనివాసరావు, దామా హనుమంతరావు, త్రిమూర్తులు, మున్నంగి స్టాలిన్, బౌజంకు నాగరాజు, కౌన్సిలర్ మాగులూరి తిరుపతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నవశకానికి నాంది పలికేలా చిలకలూరిపేట సభ

నవశకానికి నాంది పలికేలా ఈనెల 17న టీడీపీ, జనసేన, బీజేపీల ఆధ్వర్యంలో చిలకలూరిపేటలో సభ జరగనుందని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. ఈ సభకు అద్దంకి నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో తరలి రావాలన్నారు. రాతి యుగం నుంచి రాష్ట్రాన్ని స్వర్ణయుగం వైపు నడిపించేందుకు మూడు పార్టీల పొత్తు అని అన్నారు. 2014 ఎన్నికల ఫలితాన్ని తిరగరాసేలా రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తుతో మళ్ళీ ప్రభంజనం సృష్టించబోతుందన్నారు. చిలకలూరిపేట వద్ద జరిగే సభకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్‌లు హాజరవుతారన్నారు.

పారదర్శకంగా ఎన్నికల నిర్వహణే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్వో రవీందర్

పర్చూరు, మార్చి 12: ఎలాంటి విమర్శలు, అపోహలకు తావులేకుండా పారదర్శకంగా శాంతియుత వాతావరణంలో ఎన్నికలను నిర్వహించటమే లక్ష్యమని పర్చూరు అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి(ఆర్వో) గంధం రవీందర్ అన్నారు. అందుకు పాత్రికేయులు సహకారం అందించాలన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మంగళవారం స్థానిక అద్దంకి నాంచారమ్మ అమ్మవారి కల్యాణ మండపంలో పర్చూరు నియోజకవర్గ పరిధిలో విలేకరులకు ఎన్నికల విధివిధానాలు, అనుసరించవలసిన నియమాలు, తదితర అంశాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆర్వో రవీందర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం అధికారులతోపాటు, పాత్రికేయులు విధులు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో పర్చూరు, కారంచేడు, మార్టూరు, చిన్నగంజాం, ఇంకొల్లు, యద్దనపూడి తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య, మెహర్‌బాబు, కె.సంధ్యశ్రీ, ఫణీంద్రబాబు, ఎం.ప్రమీల, యు.నాగ రాజు, ఎలక్షన్ డీటీ సూర్యనారాయణ, సీనియర్ అసిస్టెంట్ సత్యనారాయణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి

» సీఐ సీతారామయ్య



వీరన్నపాలెంలో కవాతు చేస్తున్న పోలీసులు

వీరన్నపాలెం(పర్చూరు), మార్చి 12: సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్టు సీఐ సీతారామయ్య అన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల నేపథ్యంలో మంగళవారం మండలంలోని వీరన్నపాలెం గ్రామంలో పోలీసు కవాతు నిర్వహించారు. ఎన్నికలకు సంబంధించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తుగా ప్రజలను అప్రమత్తంచేసే కార్యక్రమంలో భాగంగా కవాతు నిర్వహించినట్టు సీఐ తెలిపారు. శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రజలు సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై ఎస్.రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్షలు జరుగుతుంటే.. మాకేంటి!

» 144 సెక్షన్ అమలులోఉన్నా చెక్కుల పంపిణీకి ఏర్పాట్లు

» అధికారుల హడావుడితో విద్యార్థుల అసౌకర్యం

» తలుపులు మూసివేసి తరగతుల నిర్వహణ

» వైసీపీ నేతల తీరుపై విమర్శలు



సభకు హాజరైన స్వయం సహాయక సంఘాల సభ్యులు

అద్దంకి, మార్చి 12: ఒకవైపు ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతున్నా.. 144 సెక్షన్ అమలులో ఉన్నా.. వైసీపీ నాయకులు, అధికారులు మాత్రం డోంట్‌కేర్ అంటూ వైఎస్ఆర్ చేయూత చెక్కుల పంపిణీకి ఏర్పాట్లుచేసే మనుషలతో ప్రకాశం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణం నిండి పోయింది. చేయూత చెక్కుల పంపిణీ మంగళవారం సాయంత్రం స్థానిక ప్రకాశం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాణెం హనిమిరెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు.

అయితే, ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు మొత్తం మంగళవారం ఉదయం నుంచే జరుగుతున్నాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతున్నాయి. మంగళవారం మొదటి సంవత్సరం ఫిజిక్స్ పరీక్ష జరుగుతూ ఉండగానే వైఎస్ఆర్ చేయూత ఏర్పాట్లు జరిగాయి. 144 సెక్షన్ అమలులో ఉన్నా కూలీలు, మున్సిపల్ కార్మికులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, మెప్మా సిబ్బంది, అధికారులు హడావుడి చేస్తూనే ఉన్నారు. ఒకానొక దశలో పెద్ద సౌండ్‌లతో మైకులు ఏర్పాటు చేయటంతో కళాశాల అధ్యాపకులు అభ్యంతరం చెప్పటంతో ఆపారు. మరోవైపు ప్రకాశం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల జరుగుతుండగా, విద్యార్థులు తరగతి గదుల తలుపులు మూసుకొని జరుపుకున్నారు. ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతున్నా అంతా గందరగోళంగా సభ ఏర్పాట్లు చేయటంతో విద్యార్థులు ఒకింత అసౌకర్యానికి గురయ్యారు. వైసీపీ నేతలు, అధికారుల తీరు పట్ల పలువురు తీవ్రంగా విమర్శిస్తున్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న హనిమిరెడ్డి, భద్రారెడ్డి

మేదరమెట్ల, మార్చి 12: కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల, అనమనమూరు గ్రామాల్లో పలు ప్రభుత్వభవనాల ప్రారంభోత్సవం, అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమాల్లో వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనిమిరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ వైవీ భద్రారెడ్డి పాల్గొన్నారు. మంగళవారం మేదరమెట్ల పంచాయతీ ఆధ్వర్యంలో రూ.60 లక్షలతో నూతనంగా నిర్మించిన వైఎస్ఆర్ డిజిటల్ లైబ్రరీని, రెండు సచివాలయ భవనాలను, రైతు భరోసా కేంద్రాలను ప్రారంభించారు. రూ.6.50 కోట్ల ప్రధాన రహదారి రోడ్డు విస్తరణ పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనమనమూరులో రైతు భరోసా కేంద్రం, ఆరోగ్య సేవా కేంద్రాల భవనాల ప్రారంభోత్సవాల కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమాల్లో జడ్పీటీసీ తుళ్ళూరి వెంకటరమణ, మేదరమెట్ల, అనమనమూరు సర్పంచ్‌లు బొనిగెల ఎలిశమ్మ, జంపు హరిబాబు, ఏఎంసీ మాజీ వైఎస్ చైర్మన్‌లు కోయి అంకారావు, యర్రం రత్నారెడ్డి, జజ్జర ఆనందరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ పులికం కోటిరెడ్డి, మాజీ జడ్పీటీసీ ముత్తవరపు రమణయ్య, మాజీ సర్పంచ్ పేరం నాగలక్ష్మి, పోకూరి హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోండి

చీరాలటౌన్, మార్చి 12: సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని రూరల్ సీఐ నిమ్మగడ్డ సత్యనారాయణ, ఈపూరుపాలెం ఎస్సై మర్రి శివకుమార్ అన్నారు. ఎటువంటి ప్రలోభాలకు లోనవ్వద్దని పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం మండల పరిధిలోని ఈపూరుపాలెం స్ట్రయిట్‌కట్ కాలువ వద్ద నుంచి ఈపూరుపాలెం సెంటర్, బోయినవారిపాలెం ప్రాంతాలలో ప్రత్యేక పోలీసు బృందాలతో కవాతు నిర్వహించారు.

ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మాక్‌డ్రిల్‌తో ఓటర్లు ప్రభావితం అవుతారని అన్నారు. ఓటు రాష్ట్ర ప్రజల భవిష్యత్తుగా చెప్పారు. ఈక్రమంలో ఎటువంటి వస్తువులు, నగదు, ఇతర ప్రలోభాలకు చేరువ కాకుండా స్వేచ్ఛగా హక్కును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పోలీసు బలగాలు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

కోనంకి - వలపర్ల రోడ్డులో ట్రాఫిక్‌కు అంతరాయం



కోనంకి - వలపర్ల రోడ్డులో టైరు పంక్చరు కావడంతో ఆగిన వాహనం. వెనుక నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు

మార్టూరు, మార్చి 12: మండల పరిధిలో కోనంకి- వలపర్ల రోడ్డులో రెండు గంటలపాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. కోనంకి వైపు నుంచి ఇసుక లోడుతో వెళుతున్న భారీ వాహనం వెనుక టైరు పంక్చరు అయింది. దాంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. రోడ్డు మలుపు వద్ద భారీవాహనం ఆగిపోవడంతో ద్విచక్రవాహనాలు మినహా మిగిలిన వాహనాలు వెళ్లడానికి వీలుకాలేదు. వలపర్ల వైపు నుంచి కోనంకి వైపు వెళ్లే ఆటోలు ఇసుకదర్శి గ్రామ శివారు గుండా జాతీయ రహదారిపైకి వచ్చాయి. చిలకలూరిపేట నుంచి వలపర్ల మీదగా వినుకొండ వెళ్లే ఆర్టీసీ బస్సు గంటకుపైగా అక్కడే రోడ్డుపై ఆగిపోయింది. అనంతరం భారీ వాహనం డ్రైవరు మెకానిక్‌ను తీసుకువచ్చి మరమ్మతులు చేసిన అనంతరం వాహనం వెళ్లి పోవడంతో ట్రాఫిక్‌కు అవరోధం తొలగింది.

16న వలపర్లలో వాసవీ కన్యకాపరమేశ్వరి విగ్రహ ప్రతిష్ఠ

మార్టూరు, మార్చి 12: మండలంలోని వలపర్ల గ్రామంలో ఈనెల 16న వాసవీ కన్యకా పరమేశ్వరి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. నూతనంగా నిర్మించిన దేవాలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఈనెల 14 నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ముమ్మరంగా ఐద్వా సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదులో ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి

వేటపాలెం(చీరాల), మార్చి 12: వేటపాలెం మండలంలో మంగళవారం ఐద్వా సభ్యత్వ నమోదు ప్రక్రియను ముమ్మరంగా చేపట్టారు. ఐద్వా ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండలంలోని దేశాయిపేట నుంచి ఐద్వా సభ్యత్వ నమోదుకు శ్రీకారం చుట్టారు. ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి సభ్యత్వ నమోదు ప్రక్రియను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతే ఐద్వా లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రతినిధి సుభాషిణి, సభ్యులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లు పట్టివేత

పర్చూరు, మార్చి 12: అక్రమంగా మద్యం బాటిళ్లను తరలిస్తున్న వ్యక్తిని మంగళవారం పర్చూరు పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని నూతలపాడు - చింతగుంటపాలెం రహదారి మధ్యలో యద్దనపూడి మండలం పూనూరుకు చెందిన మధార్‌వలి అనే వ్యక్తి 29 క్వార్టర్ మద్యం బాటిళ్లను తరలిస్తుండగా ఎస్సై రమేష్ అధ్వర్యంలో పట్టుకుని స్థానిక పోలీసు స్టేషన్‌కు తరలించారు.

వేర్వేరు ప్రమాదాలలో ముగ్గురికి గాయాలు

అద్దంకి, మార్చి 12: వేర్వేరు ప్రమాదాలలో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. కొరిశపాడు మండలం అనమనమూరుకు చెందిన అడకా శ్రీనివాసరావు, నాగేంద్రం దంపతులు మంగళవారం మోటార్‌సైకిల్‌పై వెళుతుండగా అద్దంకి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద వెనుక నుంచి లారీ ఢీ కొట్టింది. ఈప్రమాదంలో గాయపడ్డ దంపతులను అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు వైద్యశాలకు తరలించారు. మరోప్రమాదంలో కొరిశపాడు మండలం తమ్మవరంకు చెందిన పి.నాగేశ్వరరావు మోటార్‌సైకిల్‌పై అద్దంకి వస్తున్నాడు. ఈక్రమంలో బలరామకృష్ణాపురం వైపు నుంచి వచ్చిన మోటార్‌సైకిల్ ఢీకొట్టింది. గాయపడ్డ నాగేశ్వరరావును అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

సమాన హక్కుల కోసం ఉద్యమించాలి

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 12: సమానత్వం కోసం, సమాన హక్కుల సాధన కోసం మహిళలు ఉద్యమించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి పిలుపునిచ్చారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) ఆవిర్భావ దినోత్సవం మంగళవారం ఒంగోలులోని సంఘ కార్యాలయంలో జరిగాయి. సీనియర్ నాయకురాలు వై.అంజనీదేవి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి ముందే కృష్ణా జిల్లా గరికపర్రులో మహిళా సంఘం ఏర్పడిందన్నారు. ఆ కాలంలోనే మహిళలకు భర్త ఆస్తిలో హక్కు కావాలని పోరాడారన్నారు. దేశ సంపదను దోచుకుంటూ ప్రజలను బానిసల్లా చూస్తున్న నాటి బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా స్వాతంత్ర్యోద్యమంలో అనేక మంది మహిళలు వీరోచితంగా పాల్గొన్నారని తెలిపారు. జిల్లా అధ్యక్షురాలు సయ్యద్ షర్మిల మాట్లాడుతూ భారత రాజ్యాంగం స్త్రీ పురుషులకు సమాన హక్కులు ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో నాయకులు జి.ఆదిలక్ష్మి, కె.రాజేశ్వరి, జి.కళ్యాణి, బి.గోవిందమ్మ, ఎన్.భవాని, నాగరాణి, అనురాధ, గురవమ్మ పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 1,645 మంది గైర్హాజరు

ఒంగోలు(విద్య), మార్చి 12 : జిల్లాలో జరుగుతున్న ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా మంగళవారం జరిగిన ఇంటర్ మొదటి సంవత్సరం ఫిజిక్స్-1, ఎకనామిక్స్ పరీక్షకు 1,645 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షలకు మొత్తం 23,940 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. కాగా ఆర్ఐవో సైమన్‌విక్టర్ కనిగిరి, పామూరు, సీఎస్‌పురంలోని ఆరు పరీక్షా కేంద్రాలను సందర్శించారు. ఇతర అధికారులు 50 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ఆర్ఐవో తెలిపారు.

ఆర్జేడీ తనిఖీలు

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 12: ఒంగోలు నగరం బండ్లమిట్టలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలను మంగళవారం పాఠశాల విద్య ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థినులు బైజ్యూస్ ట్యాబ్‌ల వినియోగం, ఐఎఫ్‌పీ ప్యానల్ వినియోగాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల టీచర్లకు ఆయన పలు సూచనలు చేశారు. విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలను మెరుగు పరిచి వారిని సమర్థులుగా తీర్చిదిద్దాలన్నారు. ఏప్రిల్ జరిగే గేట్‌ఫెల్ పరీక్షకు విద్యార్థులను సంసిద్ధులను చేయాలన్నారు. ఇంగ్లీషు మాట్లాడే శక్తిని పెంపొందించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో కిషోర్‌బాబు, హెచ్ఎం కృష్ణకుమారి పాల్గొన్నారు.

నేడు ప్రాంగణ ఎంపికలు

ఒంగోలు(విద్య), మార్చి 12: ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం శ్రీరామ ఫైనాన్స్ కంపెనీ ఆధ్వర్యంలో ప్రాంగణ ఎంపికలు జరుగుతాయని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024 బ్యాచ్ బీటెక్ సివిల్, మెకానికల్, ఈఈఈ, ఆల్ మొబైల్ ఇంజనీరింగ్, ఎంబీఏ విద్యార్థులు పాల్గొనవచ్చున్నారు. విద్యార్థులు తమ రెజ్యూమ్, సర్టిఫికెట్ల జెరాక్స్ కాపీలు, పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఆధార్ జెరాక్స్ కాపీలతో హాజరుకావాలన్నారు ఈఅవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సోమశిలలో 13.415 టీఎంసీల నిల్వ



అనంతసాగరం, మార్చి 12 : సోమశిల పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా మంగళవారం నాటికి జలాశయంలో 13.415 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 1600, ఉత్తరకాలువకు 600, దక్షిణ కాలువకు 400 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

మేమున్నాం.. స్వేచ్ఛగా ఓటేయండి!

- నెల్లూరులో బీఎస్ఎఫ్, పోలీసుల కవాతు



కవాతులో పాల్గొన్న పోలీసులు, కేంద్ర బలగాలు



బీఎస్ఎఫ్ సిబ్బందిపై కురిసిన పూలు

నెల్లూరు (క్రైం), మార్చి 12 : స్వేచ్ఛగా ఓటేయండనే సంకేతంతో ఓటర్లలో ఆత్మస్థైర్యం నింపేలా బీఎస్ఎఫ్ బలగాలతో కలిసి పోలీసులు మంగళవారం నెల్లూరు నగరంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఆత్మకూరు బస్టాండు నుంచి కేవీఆర్ పెట్రోల్ బంకు వరకు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రజలు ఓటు హక్కును వినియోగించుకునేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటికే రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్స్, గత ఎన్నికల కేసుల్లో ఉన్న వ్యక్తులను బైండోవర్ చేసుకున్నామని, లైసెన్సు కలిగిన ఆయుధాలను డిపాజిట్ చేసుకున్నట్లు చెప్పారు. ఎక్కడైనా అక్రమమద్యం నిల్వలు, పంపిణీ తదితరాలను గుర్తిస్తే డయల్ 112, స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కవాతులో బీఎస్ఎఫ్ కమాండెంట్ కేపీ కౌర్, నగర ఇన్‌స్పెక్టర్లు బి అశోక్‌కుమార్, బాబి, కల్యాణ్‌రాజు, అల్తాఫ్ హుసేన్, పీవీ నారాయణ, వీరానాయక్, నార్త్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శివాజీ, ఎస్ఐలు, బీఎస్ఎఫ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. కాగా, ఎన్నికల నిర్వహణ కోసం వచ్చిన బీఎస్ఎఫ్ సిబ్బందికి స్వాగతం పలుకుతూ పోలీసులు, సామాన్య ప్రజానీకం పూలవర్షం కురిపించారు.



మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (బుధవారం) : 6.27
సహరి (గురువారం) : 4.53

జగనన్న లేఅవుట్లకు బిల్లులు ఇవ్వండి

- రైతులకు జమకాని ఇన్‌పుట్ సబ్సిడీ
- జడ్పీ స్టాండింగ్ కమిటీలో సభ్యుల విన్నపం

నెల్లూరు (జడ్పీ), మార్చి 12 : జగనన్న లేఅవుట్లలో మౌలిక సదుపాయలు కల్పించిన కాంట్రాక్టర్లకు వెంటనే బిల్లులు మంజూరు చేయాలని జడ్పీ స్టాండింగ్ కమిటీలో పలువురు సభ్యులు పట్టుబట్టారు. మంగళవారం నెల్లూరులోని జడ్పీ కార్యాలయంలో జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ జిల్లాలో హౌసింగ్, పరిశ్రమలు, పశుసంవర్ధక, ఉద్యాన శాఖల్లోని పలు అంశాలపై సమీక్షిస్తున్నట్లు తెలిపారు. స్టాండింగ్ కమిటీ సభ్యులు మల్లు సుధాకర్‌రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, రామాంజనేయులు యాదవ్, తాజుద్దీన్ తదితరులు మాట్లాడుతూ జగనన్న లేఅవుట్లలో పనులు పూర్తి చేసి సంవత్సరాలు గడుస్తున్నా ఇంతవరకు బిల్లులు మంజూరు కాలేదన్నారు. హౌసింగ్, డ్వామా శాఖల నుంచి బిల్లులు రావాలని తెలిపగా, ఇందుకు అధికారులు వివరణ ఇస్తూ త్వరలోనే బిల్లులు మంజూరు అవుతాయన్నారు. గత తుఫాన్ వల్ల నష్టపోయిన రైతులకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల చేసినా జిల్లాలో చాలా మంది రైతుల ఖాతాల్లో నగదు జమ కాలేదని, ఆ నిధులు ఎక్కడ ఉన్నాయో పరిశీలించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. అలాగే ఒక నిమ్మ పంటకు మాత్రమే ఇన్సూరెన్స్ కల్పిస్తున్నారని, బొప్పాయి పంటకూ ఇన్సూరెన్స్ కల్పించాలని కోరారు. దీనిపై నివేదిక ప్రభుత్వానికి పంపుతామని అధికారులు తెలిపారు. అనంతరం హౌసింగ్ పీడీ నాగరాజు మాట్లాడుతూ జిల్లాలో గృహ నిర్మాణాలకు ఎన్నికల కోడ్‌తో సంబంధం ఉండదని, అలాగే పెండింగ్ బిల్లులకు నిధులు మంజూరై ఉన్నాయని చెప్పారు. లబ్ధిదారులకు అవగాహన కల్పించి వేగంగా నిర్మాణాలు జరిగేలా సభ్యులు కృషి చేయాలని కోరారు.

కూటమి జనపక్షం. ఫలితం ఏకపక్షం!

మబ్బులు కమ్మిన ఆకాశం వర్షానికి సూచికగా ఎలా భావిస్తారో.. ఎన్నికల ముందు జరిగే కొన్ని ఘటనల పట్ల ప్రజలు ప్రతిస్పందించే తీరు వెలువడే ఫలితాలకు సూచికగా లెక్కగడతారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీల కలయికను ప్రజలు అలాంటి పాజిటివ్ కోణంలోనే చూస్తున్నారు. ఈ పొత్తు దివాలా దశలో ఉన్న రాష్ట్రానికి మంచి చేసే మిత్రబంధంగా విశ్లేషించుకొంటున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఈ సానుకూల విశ్లేషణ మూడు పార్టీలకు ఓటింగ్ శాతాన్ని పెంచే సూచనలు కనిపిస్తున్నాయి. ఆ సూచనలు తెలుగుదేశం, జనసేన, బీజేపీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని, ఉత్తేజాన్ని నింపుతున్నాయి.

- టీడీపీ, జనసేన, బీజేపీ కలయిక రాష్ట్రానికి మేలు చేస్తుందనే నమ్మకం
- తటస్థులు, సానుకూల దృక్పథం కలవారి ఓటింగ్‌పై చూపనున్న ప్రభావం
- వచ్చే ఎన్నికల్లో గెలుపు తథ్యమని ధీమా
- మూడు పార్టీల శ్రేణుల్లోనూ పెరిగిన జోష్
- మారుతున్న అధికార వర్గాల వైఖరి



నెల్లూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : సాధారణంగా రెండు, మూడు పార్టీలు పొత్తు కడితే ఆ కూటమికి వచ్చే ఫలితాలపై వేసుకునే లెక్కలు, విశ్లేషణలు ఒకవిధంగా ఉంటాయి. ఆయా పార్టీలకు గత ఎన్నికల్లో ఎన్ని ఓట్లు వచ్చాయి... ఆ రెండు పార్టీలకు వచ్చిన మొత్తం ఓట్ల శాతం ఎంత!? ఏ నియోజకవర్గంలో ఏ పార్టీ బలమెంత!? ఏ పార్టీకి ఏ కులానికి చెందిన ఓటర్లు మద్దతుగా ఉన్నారు? వీరందరూ కలిసిస్తే పెరిగే ఓట్ల శాతం ఎంత? అది ఫలితాలపై ఎలాంటి ప్రభావం చూపుతుంది. ఈ తరహాలో విశ్లేషణలు చేయడం సహజం. అయితే తొలిసారిగా ప్రజలు ఈ పొత్తులను కొత్త కోణంలో విశ్లేషించుకొంటున్నారు. విభజన కారణంగా ఆంధ్రప్రదేశ్‌కు తీరని అన్యాయం జరిగింది. రాజధానితో పాటు ఉద్యోగ, ఉపాధి రంగాలు, ఆర్థిక వనరులను కోల్పోయింది. ఈ క్రమంలోనే అనుభవజ్ఞుడు, సమర్థుడు అయిన చంద్రబాబు రాష్ట్రానికి అవసరం అని తెలుగుదేశం పార్టీని గద్దెనెక్కించింది. ఆ ఎన్నికల్లో (2014) తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమిని ప్రజలు విశ్వసించి గెలిపించారు.

పదేళ్ల తరువాత..

ఇప్పుడు మళ్లీ రాష్ట్ర ప్రయోజనాలు ప్రధాన చర్చనీయాంశంగా మారాయి. రాష్ట్రం అప్పులపాలై పోయిందని, అభివృద్ధి మచ్చుకైనా జరగలేదని, రేపటి మన రాష్ట్రం పరిస్థితి ఏమిటనే ప్రశ్నలు, అత్యధికశాతం ప్రజల్లో మెదులుతున్నాయి. రాష్ట్రం భవిష్యత్తు గురించిన ఆలోచన, అంతర్మధనం జరుగుతున్న ఈ తరుణంలో బీజేపీ, జనసేనలతో టీడీపీ పొత్తు పెట్టుకోవడాన్ని ఎక్కువ శాతం మంది ప్రజలు రాజకీయ కోణంలో కాకుండా రాష్ట్రానికి ఏమి ప్రయోజనం అనే కోణంలోనే విశ్లేషించుకొంటున్నారు.

వాస్తవానికి దివాలా తీసిన రాష్ట్రం బతికి బట్టకట్టాలంటే కేంద్రంలో అధికారం చేపట్టగలిగే సత్తా కలిగిన ఒక జాతీయ పార్టీ సపోర్టు అవసరం. కేంద్ర ప్రభుత్వం మద్దతు ఉంటేనే రాజధాని, పోలవరం ప్రాజెక్టులతోపాటు అన్ని రకాల సహాయ సహకారాలు రాష్ట్రానికి అందుతాయి. బీజేపీతో పొత్తును ఇప్పుడు మెజారిటీ ప్రజలు ఈ కోణంలోనే చూస్తున్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఈ పొత్తు రాష్ట్రానికి ఎంత మేలు చేస్తుందనే అంశానే ప్రధానంగా మాట్లాడుకొంటున్నారు. ఈ కూటమి పట్ల ప్రజల్లో వ్యక్తమవుతున్న ఈ భావన యువతరం, విద్యావంతులు, ఉద్యోగ వర్గాలు, సానుకూల దృక్పథం కలిగిన ఓటర్లపై ఖచ్చితంగా ప్రభావం చూపుతాయని అంచనా వేస్తున్నారు. ఈ అంచనాలపై ఆయా పార్టీల నాయకులు, క్యాడర్‌లో సమరోత్సాహాన్ని నింపుతున్నాయి.

మారిన అధికార వర్గాల తీరు

పొత్తుల ప్రభావం ఉద్యోగ వర్గాలను నిష్పాక్షిత వైపు నడిపిస్తున్నాయి. మొన్నటి వరకు ప్రజలపై ప్రత్యక్ష ప్రభావం చూపగలిగే పోలీస్, రెవెన్యూ లాంటి శాఖలు పూర్తిగా అధికార పార్టీ చెప్పుచేతల్లోనే ఉండేవి. ఇష్టంగానో, అయిష్టంగానో అధికార దండం చెప్పినట్లు అధికారులు వ్యవహరించేవారు. అయితే బీజేపీతో పొత్తు ఖరారైన గంటల వ్యవధిలోనే తీరు మారింది. ఎన్నికల కోడ్ రాకముందే వీరిలో ఆ మూడ్ వచ్చేసింది. చాలా మంది ఉద్యోగులు ఒక వర్గానికి సాగిలపడి పని చేయడానికి స్వస్తి పలికి నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించడానికి సన్నద్ధం అవుతున్నారు. బీజేపీ పొత్తు కారణంగా జరిగిన కొత్త మేలుగా, తొలి మేలుగా ప్రజలు దీనిని గుర్తిస్తున్నారు. టీడీపీ-జనసేనలు కలిసి పోటీ చేస్తాయన్న ప్రచారం మొదలైన రోజు నుంచే జిల్లాలో రాజకీయ సమీకరణలు మారడం మొదలయ్యాయి. అధికార పార్టీలో తిరుగుబాట్లు ఊపందుకున్నాయి. ఈ రెండు పార్టీ అధికారిక పొత్తు ప్రకటన తరువాత పార్టీ శ్రేణుల్లో మరింత ఊపు వచ్చింది.

నెల్లూరుకు నేడు గవర్నర్ రాక



గవర్నర్ అబ్దుల్ నజీర్

నెల్లూరు (హరనాథపురం) : రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ బుధవారం నెల్లూరుకు రానున్నారు. మధ్యాహ్నం 1.40 గంటలకు గన్నవరం విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 2.55 గంటలకు నెల్లూరు పోలీసు కవాతు మైదానంలోని హెలిపాడ్‌కు చేరుకుంటారు. అనంతరం శ్రీ వేంకటేశ్వర కస్తూర్బా కళాక్షేత్రంలో జరిగే పీఎం స్వరాజ్ ప్రారంభ కార్యక్రమంలో గవర్నర్ పాల్గొంటారు. అక్కడ ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాళ్లను పరిశీలిస్తారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు రుణాల మంజూరు పత్రాలు, ఆయుష్మాన్ హెల్త్ కార్డులు, ఐఐఈ కిట్లు, మెగా చెక్కును గవర్నర్ నజీర్ అందచేస్తారు. అనంతరం హెలికాప్టర్‌లో గన్నవరం విమానాశ్రయానికి బయలుదేరి వెళతారు. కాగా, పోలీస్ పరేడ్ మైదానం, కస్తూర్బా కళాక్షేత్రంలో జరుగుతున్న ఏర్పాట్లను కలెక్టర్ హరినారాయణన్, ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు.

భద్రతపై సమీక్ష

నెల్లూరు (క్రైం) : గవర్నర్ పర్యటన నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లపై పోలీస్ కార్యాలయంలో ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి పోలీస్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రూట్‌మ్యాప్‌పై ప్రత్యేక దృష్టి పెట్టి భద్రత పెంచాలని, బందోబస్త్‌లో ఎలాంటి పొరపాట్లు తావివ్వకూడదని సూచించారు. వాహనాల పార్కింగ్, ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు.

నిబంధనలకు విరుద్ధంగా పనులు చేయలేమన్నందుకు దౌర్జన్యం

- అధికార పార్టీ నాయకుడి తీరుపై సచివాలయ ఉద్యోగుల ఆగ్రహం



సచివాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

వరికుంటపాడు, మార్చి 12 : నిబంధనలకు విరుద్ధంగా పనులు చేయడం కుదరదని చెప్పిన సచివాలయ ఉద్యోగిపై అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు మంగళ వారం దౌర్జన్యానికి పాల్పడ్డాడు. దీనిని నిరసిస్తూ సహచర ఉద్యోగులు ఆందోళన చేశారు. తిమ్మారెడ్డిపల్లి సచివాలయంలో సోమవారం డిజిటల్ అసిస్టెంట్ యాదాల ఆదినారాయణ వద్దకు వైసీపీకి చెందిన నాయకుడి అనుచరుడు కంచుపాటి సుధాకర్ తన అనుచరులతో వెళ్లి జగనన్న ఇంటి పట్టాకు రిజిస్ట్రేషన్ చేయాలని పట్టుబట్టారు. ఆన్‌లైన్‌లో పేరు లేనందుకు చేయడం కుదరదని ఆ ఉద్యోగి చెప్పినా ఆయన వినిపించుకోలేదు. తీవ్ర పదజాలంతో దౌర్జన్యానికి పాల్పడంతోపాటు ఇష్టానుసారంగా ఉద్యోగులందరినీ అసభ్య పదజాలంతో దూషించినట్లు సచివాలయ ఉద్యోగులు తెలిపారు. ఇది తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు కె. ప్రభుదాస్ ఆధ్వర్యంలో పలు గ్రామాలకు చెందిన ఉద్యోగులు మంగళవారం సచివాలయం వద్దకు చేరుకొని మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబద్ధతతో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులపై దాడులకు పాల్పడటం హేయమైన చర్యని దుయ్యబట్టారు. మరోమారు ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఈ నిరసనలో పంచాయతీ కార్యదర్శులు హరి, వెంకట కృష్ణయ్య, వీఆర్వో చెన్నకేశవులు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫిషింగ్ హార్బర్ ప్రారంభం వాయిదా

- సీఎంకు అత్యవసర సమావేశమంటూ కబురు




నిర్మానుష్యంగా ఉన్న సభా ప్రాంగణం

బిట్రగుంట, మార్చి 12 : బోగోలు మండలం జువ్వలదిన్నె పంచాయతీలో ఫిషింగ్ హార్బర్ ప్రారంభోత్సవం వాయిదా పడింది. సీఎం జగన్ వర్చువల్‌గా ప్రారంభిస్తారని తెలియడంతో ఆ మేరకు అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది. మంగళవారం ఉదయమే తాత్కాలిక హాలుకు కలెక్టర్ హరినారాయణన్, జేసీ సేతు మాధవన్, కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, ఆర్డీవో శీనానాయక్, మత్స్య శాఖ జేడీ నాగేశ్వరావు చేరుకున్నారు. ఇంకొద్ది సేపట్లో ఫిషింగ్ హార్బర్ ప్రారంభం అవుతుందని ఎదురుచూస్తున్న తరుణంలో అధికారులకు ఓ కబురు అందింది. ప్రారంభోత్సవాన్ని వాయిదా వేస్తున్నట్లు తెలియడంతో అక్కడ ఉన్నవారందరిలో నిరుత్సాహం నెలకొంది. ఈ విషయమై ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌కు అత్యవసర సమావేశం ఉన్నందున వాయిదా వేసినట్లు తెలిపారు. రెండు రోజుల్లో ప్రారంభోత్సవ తేదీ ప్రకటిస్తామని చెప్పారు. గడియల్లో తాత్కాలిక హాలును తొలగించడంతో అంతా బోసిపోయింది.

'పది' పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- ప్రత్యేక అధికారిగా మువ్వా రామలింగం
- 30 సెంటర్లలో ఓపెన్ స్కూల్ పరీక్షలు : డీఈవో



నెల్లూరు (విద్య), మార్చి 12 : జిల్లాలో పదో తరగతి పరీక్షలకు విద్యాశాఖ అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 18 నుంచి ఆరంభం కానున్న టెన్త్ పరీక్షల నిర్వహణకు చేస్తున్న ఏర్పాట్లపై డీఈవో రామారావు మంగళవారం మీడియాకు పలు విషయాలను వెల్లడించారు. ఈ ఏడాది పబ్లిక్ పరీక్షల్లో ప్రశ్నపత్రంపై కోడ్ అమలు చేస్తున్నామని, దీనివల్ల ప్రశ్నపత్రం లీక్ అయ్యేదానికి అవకాశం ఉండదన్నారు. ఒకవేళ ఏదైనా తప్పు జరిగినా ఎక్కడ జరిగిందో క్షణాల్లో తెలిసిపోతుందన్నారు. తనతో సహా పరీక్ష కేంద్రంలోకి ఎవరైనా ఫోన్‌తో అడుగుపెడితే శాఖాపరమైన చర్యలు ఉంటాయన్నారు. ప్రతిరోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1.245 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని చెప్పారు. ఇప్పటికే జిల్లాలోని 48 పోలీస్ స్టేషన్లలో ప్రశ్నపత్రాలు భద్రపరిచామని, పరీక్షకు 30 నిమిషాల ముందు మాత్రమే వాటిని తరలిస్తారని తెలిపారు. ఏ ఒక్క విద్యార్థి కూడా నేలమీద కూర్చుని పరీక్ష రాయకుండా అన్ని కేంద్రాల్లో పక్కాగా బెంచీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లాలో జరిగే పరీక్షలను పర్యవేక్షించేందుకు మువ్వా రామలింగంను ప్రత్యేక అధికారిగా నియమించినట్లు చెప్పారు. కాగా, ఈనెల 18 నుంచే ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ పరీక్షలను కూడా నిర్వహిస్తున్నట్లు డీఈవో తెలిపారు. దీనికోసంగా మొత్తం 30 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి రోజూ మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. వీటికి కూడా సాధారణ పదోతరగతి పరీక్షలకు అవలంబిస్తున్న నిబంధనలన్నీ వర్తిస్తాయన్నారు.

కాల్ సెంటర్ ఏర్పాటు..

జిల్లాలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే తమకు తెలియచేసేందుకు కాల్ సెంటర్ ఏర్పాటు చేశామని డీఈవో తెలిపారు. 9989931138, 9000619699, 9000553515, 8919428319 నెంబర్లను సంప్రదించాలన్నారు. ఏ సమస్యనైనా తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు.

మరుభూమికీ ఎన్నిపాట్లో!



ఉలవపాడు మండలంలోని వీరేపల్లి ఎస్సీ కాలనీలో ఏళ్ల తరబడి శ్మశాన వాటికకు దారిలేక పాడె మోయాలంటే పంట పొలాల బురదలో నరకయాతన పడాల్సి వస్తోంది. కాలనీకి ఉత్తరం దిక్కున పంట పొలాలు దాటుకుని శ్మశానానికి వెళ్లాల్సి ఉంటుంది. రెండ్రోజుల క్రితం కాలనీలో కొండమ్మ అనే మహిళ మృతి చెందడంతో అంత్యక్రియల నిర్వహణ కోసం గ్రామస్థులు అవస్థలు పడ్డారు. వరి పొలంలోని బురదలో కాడెను మోసుకొంటూ వెళ్లి దహన సంస్కారాలు చేశారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి శ్మశానానికి దారి సౌకర్యం కల్పించాలని ఎస్సీ కాలనీ వాసులు కోరుతున్నారు.

\- ఉలవపాడు

ప్రొటోకాల్‌కు తిలోదకాలు!


- పనుల ప్రారంభోత్సవ శిలాఫలకాల్లో వైసీపీ నేతల పేర్లు
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం

కావలి, మార్చి 12 : కావలి పట్టణంలో అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాల్లో ప్రొటోకాల్‌కు తిలోదకాలిచ్చారు. ఏ ప్రభుత్వ కార్యక్రమంలోనైనా ప్రొటోకాల్ ప్రకారం ప్రజాప్రతినిధులు, అధికారుల పేర్లు మాత్రమే శిలాఫలకాల్లో ఉండాలి. కానీ కావలిలో ఇందుకు విరుద్ధం గా వైసీపీకి చెందిన చోటా నాయకుల పేర్లు సైతం శిలాఫలకాల్లో దర్శనమిస్తున్నాయి.

- కావలి ఏరియా వైద్యశాలలో రూ.15 కోట్లతో నిర్మించిన భవనాన్ని గత నెల 11వ తేదీన ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. అయితే అక్కడ ప్రొటోకాల్‌ను అతిక్రమంచి ఏడుగురు వైసీపీ నాయకుల పేర్లను శిలాఫలకంపై చెక్కారు. దీనిపై వైద్యాధికారులను వివరణ కోరగా ప్రారంభోత్సవంతో తమకు సంబంధంలేదని చెప్పుకొచ్చారు.
- గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో పట్టణంలోని 13, 30వ వార్డులలో చేపట్టిన అభివృద్ధి పనులను ఈ నెల 11వ తేదీన అధికారుల సమక్షంలో ఎమ్మెల్యే ప్రారంభించారు. 13వ వార్డులో వేసిన శిలాఫలకంలో 9 మంది వైసీపీ నాయకుల పేర్లు పెట్టారు. 30 వార్డులో సైతం ఆరుగురి వైసీపీ నాయకులు పేర్లు శిలాఫలకంలో చెక్కారు.

వీపీఆర్ పేరు లేకుండా..

గత నెల 11వ తేదీన కావలి ఏరియా వైద్యశాల భవనం ప్రారంభ శిలాఫలకంలో రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పేరు ఉంది. అయితే అప్పట్లో ఆయన వైసీపీలో కొనసాగుతున్నారు. ప్రస్తుతం ఆయన వైసీపీని వీడటంతో ఈ నెల 11న మున్సిపాల్టీలోని అభివృద్ధి పనుల ప్రారంభ శిలాఫలకాలలో మాత్రం వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పేరు తొలగించారు. ఆయన పదవీ కాలం పూర్తి అయిందనుకోవడానికి ఈ నెల 12న జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ ప్రారంభానికి సిద్ధం చేసిన శిలాఫలకంలో మాత్రం ఆయన పేరు ఉంది. ఈ శిలాఫలకం ప్రొటోకాల్ పాటించినట్లు ఉంది.





13, 30 వార్డులో ఆవిష్కరించిన శిలాఫలకాల్లోని వైసీపీ నాయకుల పేర్లు

విస్తుపోతున్న ప్రజలు

కావలిలో శిలాఫలకాలను చూసి ఇవి ప్రభుత్వ కార్యక్రమాలా.. వైసీపీ కార్యక్రమాలా అంటూ ప్రజలు విస్తుపోతున్నారు. వాస్తవంగా ఏదైనా అభివృద్ధి పనుల శంకుస్థాపన, ప్రారంభోత్సవ శిలాఫలకాలలో ప్రొటోకాల్ కోసం సంబంధిత అధికారులు జిల్లా రెవెన్యూ అధికారి దృష్టికి తీసుకెళ్లి ఆయన అనుమతించిన వారి పేర్లనే శిలాఫలకాల్లో రాయాలి. అయితే ఇక్కడ స్థానిక అధికారులు అలాంటివేమీ చేయకుండా అధికార పార్టీ నేతలు సూచించిన వారి పేర్లనే శిలాఫలకాలపై వేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

మాకు సంబంధం లేదు

కావలిలోని 13, 30వ వార్డులలో సోమవారం జరిగిన ప్రారంభోత్సవాలు మున్సిపాలిటీకి సంబంధం లేదు. ఈ కార్యక్రమాలకు మా దగ్గర నిధులు లేక పోవడంతో వదిలి వేశామని, కాంట్రాక్టర్లే వారి సొంత నిధులతో శిలాఫలకాలు వేసుకున్నందున అభ్యంతరం చెప్పలేకపోయాం.

\- శ్రావణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి : డీఎస్పీ



కావలి రూరల్ : కేంద్ర బలగాలు, పోలీసు సిబ్బందితో కవాతు నిర్వహిస్తున్న డీఎస్పీ, సీఐలు



ఆత్మకూరు : కేంద్ర బలగాలతో కలిసి ఫ్లాగ్ మార్చ్ చేస్తున్న సీఐ, ఎస్ఐలు

కావలి రూరల్, మార్చి 12: సాధారణ ఎన్నికల నిర్వహణ ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అందరూ సహకరించాలని డీఎస్పీ వెంకటరమణ పేర్కొన్నారు. మంగళవారం కావలి పట్టణంలోని బృందావన కాలనీ నుంచి భాష్యం స్కూల్ వరకు కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల్లో ఎలాంటి లా అండ్ ఆర్డర్ సమస్యలు లేకుండా సమస్యాత్మక గ్రామాలు, ప్రాంతాలను గుర్తించి పటిష్టచర్యలు తీసుకుంటున్నామన్నారు. బీఎస్ఎఫ్ అసిస్టెంట్ కమిషనర్ నిర్మల్ కుమార్ వర్మ ఆదేశానుసారం బీఎస్ఎఫ్ సీఐ కె.చోపి నేతృత్వంలో 402 బెటాలియన్, ఎఫ్ కంపెనీ-19కి చెందిన 100 మంది సిబ్బంది స్థానిక పోలీసులు పట్టణంలో కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 1వ పట్టణ, రెండవ పట్టణ, రూరల్, సర్కిల్ సీఐలు రాజేష్, కొండవీటి శ్రీనివాసరావు, కాటూరి శ్రీనివాసరావు, నాగభూషణం, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఆత్మకూరు : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు సీఐ జీ వేణు తెలిపారు. మంగళవారం పట్టణ పురవీధుల్లో కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

పేదల బతుకులు మార్చడమే ధ్యేయం : కాకర్ల

ఉదయగిరి రూరల్, మార్చి 12: ఉదయగిరి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి పేదల బతుకులు మార్చేడమే ధ్యేయమని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని గంగిరెడ్డిపల్లిలో ఏఎంసీ మాజీ చైర్మన్ మన్నేటి వెంకటరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తల పరిచయ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కాకర్ల సురేష్, అతడి సోదరుడు సునీల్‌ను మన్నేటి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కాకర్ల మాట్లాడుతూ నియోజవకర్గంలో తాగు, సాగునీటి కష్టాలు తీర్చడంతోపాటు వలసల నివారణకు, పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తానన్నారు. ఈనెల 14న సీతారామపురం మండలం చిన్నాగంపల్లి నుంచి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. కాగా దుర్గంపల్లికి చెందిన రమణయ్య అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఆయన కుటుంబ సభ్యులకు రూ.10 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, ఓబులరెడ్డి, నరసింహ, గూడూరు వెంకటేశ్వరరావు, ఆనందరావు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



ఉదయగిరి : కాకర్ల సురేష్‌ను సన్మానిస్తున్న మన్నేటి వెంకటరెడ్డి

టీడీపీ ఆత్మీయ సమావేశం

వింజమూరు, మార్చి 12 : పట్టణంలోని ఎస్వీ కళ్యాణ మండపంలో టీడీపీ ఆత్మీయ సమావేశాన్ని మండల అధ్యక్షుడు గొంగటి రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా ఉదయగిరి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ కార్యకర్తలు, నాయకుల కష్టసుఖాల్లో పాలుపంచుకోవడం ఆనందంగా ఉందన్నారు. రాబోవు ఎన్నికల్లో అందరూ కలిసికట్టుగా కృషి చేసి పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా టీడీపీ నాయకులు దంతులూరు వెంకటేశ్వరరావు, చల్లా వెంకటేశ్వర్లు, గూడా నర్సారెడ్డి, బయ్యపురెడ్డి రామకోటారెడ్డి, కేశవరెడ్డి, వేణుగోపాల్, రంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఏఎస్‌పేట,మార్చి12: స్థానిక కస్తూర్బా బాలికల విద్యాలయంలో 2024-25 సంవత్సరానికి 6వ తరగతి, ఇంటర్‌లో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థి ఆధార్, కుటుంబ సభ్యుల ఆధార్, కుల,ఆదాయ సర్టిఫికెట్‌లు, రేషన్‌కార్డు, ఫొటోలు జతచేయాలని ఆమె తెలిపారు. పూర్తి వివరాలకు 85004 80455 నంబరును సంప్రదించాలని కోరారు.

లక్ష్యాలను అధిగమించాలి

ఉదయగిరి రూరల్, మార్చి 12: ఆశ, వైద్యఆరోగ్య సిబ్బందికి కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయాలని మండల వైద్యాధికారిణి శివకల్పన పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పాత సీహెచ్‌సీలో ఆశ డే నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో శివకుమారి, హెచ్‌ఈ వెంకటసుబ్బయ్య, సూపర్‌వైజర్లు చెన్నయ్య, అంకమ్మ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

ఉదయగిరి రూరల్, మార్చి 12: పట్టణంలోని చాకలివీధికి చెందిన విశ్రాంత లైన్ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు అనారోగ్యంతో సోమవారం రాత్రి మృతిచెందారు. విషయం తెలుసుకున్న నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి మంగళవారం మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు జీ.ఓబులరెడ్డి, ఎంఏ రియాజ్, ఎంఏ సలీం, సైదాపురం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉస్తాద్‌బాబా జెండా ఉత్సవం

ఏఎస్‌పేట,మార్చి12: స్థానిక హజరత్ మీర్జా మహమ్మద్ హుసేన్ బేగ్ ఉరఫ్ ఉస్తాద్‌బాబా దర్గా జెండా ఉత్సవం సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా జెండాను మేళతాళలతో ఊరేగింపుగా దర్గాకు తరలించారు. అక్కడ దాన్ని ఆవిష్కరించి, ప్రార్థనల అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. ఈనెల 23, 24, 25వ తేదీల్లో దర్గా గంధమహోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), మార్చి 12: స్థానిక వైసీపీ కార్యాలయంలో మంగళవారం మండలంలోని కమ్మవారిపల్లికి చెందిన రావిళ్ల సిద్ధమ్మకు రూ.55 వేల సీఎం సహాయనిధి చెక్కును నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ చింతిరెడ్డి వాసుదేవరెడ్డి, సొసైటీ డైరెక్టర్ సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రావెల్ తరలింపునకు వినతి

అనంతసాగరం, మార్చి 12: కాలనీలు, ఇళ్లకు గ్రావెల్ తోలుకొనేందుకు అనుమతి ఇవ్వాలని మండల సీఐటీయూ నాయకులు అన్వర్‌బాష అధికారులను కోరారు. మంగళవారం ట్రాక్టర్ డ్రైవర్లు, ఇళ్ల లబ్ధిదారులతో కలసి తహసీల్దారు శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. ఇళ్ల బేస్‌మట్టాలకు మట్టి అవసరం కాగా, వాటి కోసం గ్రావెల్ తోలుతుంటే అధికారులు వాహనాలు ఆపుతూ అనుమతి పేరిట వేధిస్తున్నారని తెలిపారు. ఇలాగైతే ఇళ్లు ఎలా నిర్మించుకోవాలో మీరే చెప్పాలన్నారు. విషయం ఉన్నత అధికారులకు తెలిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎట్టకేలకు రోడ్లు శుభ్రం !

వరికుంటపాడు, మార్చి 12: ఏళ్ల తరబడి రోడ్ల వెంట దుమ్ము, ధూళి పేరుకుపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా, పట్టించుకోని నేషనల్ హైవే అధికారులు ఉన్నట్టుండి మంగళవారం జాతీయ రహదారిని శుభ్రం చేశారు. స్థానిక బస్టాండ్ సెంటర్ మీదుగా వెళుతున్న 565 జాతీయ రహదారిని శుభ్రం చే యించడం సర్వత్రా చర్చనీయాంశమైంది. ఉన్నతాధికా రులు ఎవరైనా వస్తున్నారా.. లేక బిల్లుల మంజూరు కోసం పాకులాడుతున్నారా? అని పలువురు గుసగుసలాడారు.



రోడ్డు ఊడ్చుతున్న పారిశుధ్య సిబ్బంది

అత్యధిక మెజార్టీతో కూటమి విజయం ఖాయం : ఆనం

ఆత్మకూరు, మార్చి 12 : సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అత్యధిక మెజార్టీతో విజయం సాధించి అధికారంలోకి రావడం ఖాయమని ఆత్మకూరు టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన పట్టణంలో టీడీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి పులిమి శైలజారెడ్డి భర్త అంత్యక్రియల్లో పాల్గొన్నారు. అనంతరం విలేకరుతో మాట్లాడుతూ వైసీపీ దుర్మార్గపు పాలన అంతమయ్యే రోజులు దగ్గర పడ్డాయన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అధికారంలోకి వస్తే అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లల్లో ఉపందుకుంటుందని తెలిపారు. త్వరలో నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుడతామన్నారు. ముందుగా పులిమి కృష్ణారెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు, కార్యకర్తలు, ఆనం అభిమానులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే లక్ష్యం : విక్రమ్

ఆత్మకూరు, మార్చి 12 : మహిళా సాధికారత, స్వావలంబనే లక్ష్యంగా ప్రభుత్వం పొదుపు మహిళలకు పలు పథకాలను అందుబాటులోకి తెచ్చిందని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మంగళవారం వైఎస్ఆర్ చేయూత నాలుగవ విడత సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో 12,179 మంది లబ్ధిదారులు రూ. 2283.56 లక్షలను ఆసరా పథకం కింద ప్రయోజనం పొందడం హర్షదాయకమన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాలకు చెందిన పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, పొదుపు మహిళలు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పొదుపు మహిళలకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

● అభివృద్ధి పనుల ప్రారంభం

చేజర్ల : మంగళవారం ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి మండలంలోని వావిలేరు, మైపాటివారికండ్రిక, దొరవుపాడు గ్రామాల్లో పలు అభివృద్ధి పథకాలను ప్రారంభించారు. అనంతరం గ్రామాల్లో పర్యటించి ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు రాంబాబు, వెంకటరత్నం, వెంకటేశ్వర్లురెడ్డి, ఎంపీపీ తూమాటి విజయభాస్కర్ రెడ్డి, జడ్పీటీసీ పీర్ల పార్థసారధి, సొసైటీ చైర్మన్ వీరరాఘవరెడ్డి పాల్గొన్నారు

సెక్టార్ అధికారులకు శిక్షణ

ఉదయగిరి రూరల్, మార్చి 12: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో మంగళవారం ఎన్నికల సెక్టార్ అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఎన్నికల సహాయ అధికారి నెహ్రూబాబు, మాస్టర్ ట్రైనర్ సమీవుల్లాలు ఈవీఎం పనితీరుపై సూచనలిచ్చారు. అనంతరం చైతన్యవంతమైన ప్రజాస్వామ్యం కోసం ఓటు వేయడం మన హక్కు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

రూ. 21 లక్షలతో జలజీవన్ మిషన్ పనులు

సంగం, మార్చి 12: సంగం ఆనకట్ట వద్ద ఉన్న దళితవాడలో రూ. 21లక్షలతో జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా పైపులైన్ల పనులు చేపట్టారు. కాలనీలో సుమారు 120 కుటుంబాలున్నాయి. కాలనీ ప్రజలందరికి ఇంటింటా కుళాయి ఏర్పాటు చేసి నీటిని సరఫరా చేసేందుకు రూ. 21 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ కాలనీ దక్షిణవైపు ప్రత్యేక బోరు వేసీ, దాని ద్వారా ఇంటింటికి పైపులైన్లతో కుళాయిలకు నీటిని సరఫరా చేయనున్నారు.



జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా నిర్మిస్తున్న పైపులైను

మొక్కుబడిగా లింగసముద్రం మండల సమావేశం

లింగసముద్రం, మార్చి 12 : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ పెన్నా కృష్ణయ్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా జరిగింది. మాలకొండరాయునిపాలెం పంచాయతీలోని ముక్తేశ్వరంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో రెగ్యులర్ ఉపాధ్యాయుడిని నియమించాలని ఆ గ్రామ ఎంపీటీసీ కోరారు. ఆర్ఆర్ పాలెంలో పగిలిన మంచి నీటి పైపును మరమ్మతులు చేయించాలని సర్పంచు చింతగుంపల అంజమ్మ కోరారు. చినపవనిలో జగనన్న లేఅవుట్‌లో కూడా జలజీవన్ మిషన్ ద్వారా పైపులైన్ వేయించాలని సర్పంచు దామా సీతారామయ్య కోరారు. ఈ సమావేశానికి కొందరు అధికారులు హాజరు కాకపోవడం పట్ల సభ్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ నళినీ పద్మ, ఎంపీడీవో యు శేషుబాబు, తదితరులు పాల్గొన్నారు.

బహుజనులంతా ఐకమత్యంతో పోరాడాలి

లింగసముద్రం, మార్చి 12 : ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం, మైనారిటీలపై జరుగుతున్న రాజకీయ, ఆర్థిక, సామాజిక కుట్రలను, ఐకమత్యంతో ఎదుర్కోవాలని భారత్ ముక్తి మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం వెంకట్రావు, మాజీ ఎంపీపీ పీ బాలకోటయ్య తెలిపారు. మంగళవారం స్థానిక ఓ సినిమా హాలులో సామాజిక న్యాయ పోరాట సమితి ఆధ్వర్యంలో జడ నరేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ

కందుకూరు, మార్చి 12: ఐఎఫ్‌సీ ఫౌండేషన్ సంస్థ అధ్యక్షుడు షాజిద్, కార్యదర్శి షంషీర్‌ల ఆధ్వర్యంలో వైసీపీ మహిళా నాయకురాలు సంధ్యారాణి సహకారంతో మంగళవారం పట్టణంలోని నిరుపేద కుటుంబాలకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. హఫీజ్, ఆయూబ్‌ఖాన్ పఠాన్, షంషుద్దీన్ పాల్గొన్నారు.

ప్రధాన రోడ్లపై పశువుల సంచారం

● వాహన రాకపోకలకు ఇబ్బందులు

సీతారామపురం, మార్చి 12 : ప్రతినిత్యం వివిధ పనుల కోసం చుట్టు పక్కల గ్రామాల నుంచి మండల కేంద్రమైన సీతారామపురానికి ప్రజలు వస్తుంటారు. దీంతో బస్టాండ్, మెయిన్ బజారు రద్దీగా ఉంటాయి. ఈ సెంటర్లతోపాటు ప్రధాన కూడళ్లలో పశువుల సంచారంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. వ్యాపారులు, కొనుగోలుదారుల చేతుల్లోని కూరగాయలను పశువులు తినేస్తున్నాయి. అంతేకాక కొన్నిచోట్ల ఇళ్లల్లో కూడా చొరబడుతున్నాయి. వాటి యజమానులు పాలిచ్చే సమయానికి ఇంటికి తోలుకెళ్లి తర్వాత బహిరంగ ప్రదేశాల్లో విడిచి పెట్టేస్తున్నారు. వీటి సంచారంతో వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.



రోడ్డుపై సంచరిస్తున్న ఆవులు

విద్యుత్ చౌర్యంపై విజిలెన్స్ అధికారుల దాడులు

● కరెంట్ అక్రమ వినియోగంపై రూ.3.80 లక్షల జరిమానా

లింగసముద్రం, మార్చి 12 : మండలంలో అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న వారిపై విజిలెన్స్ అధికారులు, సిబ్బంది మంగళవారం దాడులు చేశారు. విజిలెన్స్ ఈఈ కట్టా వెంకటేశ్వర్లు, కందుకూరు డివిజన్ ఈఈ వీరయ్యల నేతృత్వంలో సుమారు 80 మంది అధికారులు, సిబ్బంది 36 టీములుగా ఏర్పడి మండలంలోని లింగసముద్రం, వీఆర్ కోట, చినపవని, పెదపవని, మొగిలిచెర్ల, అన్నెబోయినపల్లి, అంగిరేకులపాడు, ఆర్ఆర్ పాలెం, నారసింహాపురం తదితర గ్రామాల్లో 3,100 సర్వీసులను తనిఖీ చేశారు. వీరిలో 65 సర్వీసుల వారు విద్యుత్‌ను అక్రమంగా వినియోగిస్తున్నట్లు గుర్తించారు. వారికి రూ.3.80 లక్షలు జరిమానా విధించారు. మీటరు లేకుండా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 12 మందికి రూ.40,500, మీటరు ఉండి చౌర్యానికి పాల్పడుతున్న 9 మందికి రూ.1,37,500, అదనపు లోడు వినియోగిస్తున్న 39 మందికి రూ.1.70.000లు, తప్పుడు క్యాటగిరి కింద చౌర్యం చేస్తున్న 5 మందికి రూ.32,000 జరిమానా విధించారు. విజిలెన్స్ ఈఈ కట్టా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యుత్ చౌర్యం చట్టారీత్యా నేరమని, ఇలాంటి వారిపై చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో కందుకూరు రూరల్ డీఈ ఆర్ విజయ్‌బాబు, మండల ఏఈ షేక్ ఫిరోజ్, పలువురు ఏడీలు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విజిలెన్స్ ఈఈ కట్టా వెంకటేశ్వర్లు

కావలి అభివృద్ధికి ఒక్క అవకాశం ఇవ్వండి : కావ్య

కావలి, మార్చి 12: టీడీపీకి ఓటు వేసి కావలి అభివృద్ధికి తనకు ఒక్క అవకాశం ఇవ్వాలని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి కోరారు. టీడీపీ, జనసేన క్యాడర్‌తో కలిసి మంగళవారం కావలి ట్రంకు రోడులోని వాయునందన ప్రెస్‌వీధి నుంచి ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. రోడ్డు మార్జిన్ వ్యాపారులు తమ బాధలు వివరించారు. ఆటోవాలాలు తమకు రూ.10 వేలు సాయమని చెప్పి ట్రాఫిక్ జరిమానాలు రెట్టింపు విధించి తమ సంపాదన అంతా లాగేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీడీపీ అధికారంలోకి వస్తే అమలు చేసే పథకాలకు సంబంధించిన మేనిఫెస్టోను, కావలిలో తనను గెలిపిస్తే కావలి నియోజకవర్గంలో చేపట్టే అభివృద్ధి పనులకు సంబంధించిన తన సొంత మేనిఫెస్టోతో కూడిన కరపత్రాలను వ్యాపారవర్గాలకు అందచేశారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు, ఎంపీ అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి ఓటు వేసి రాష్ట్ర భవిష్యత్తు కోసం చంద్రబాబు నాయుడిని ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్నారు.



ఓటు అభ్యర్థిస్తున్న కావ్య

నాంచారమ్మ కాలనీలో ఇంటూరి ఇంటింటి ప్రచారం

కందుకూరు, మార్చి 12: పట్టణంలోని 30వ వార్డు నాంచారమ్మ కాలనీలో మంగళవారం తెలుగుదేశం పార్టీ శంఖారావం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కందుకూరు ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు ఇంటింటికీ వెళ్లి టీడీపీ మినీ మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. రానున్నరోజుల్లో అందరి ఆకాంక్షలకు అనుగుణంగానే టీడీపీ ప్రభుత్వం పనిచేయనున్నదని, కందుకూరులో టీడీపీ విజయ పతాకం ఎగిరేలా ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దామా మల్లేశ్వరరావు, ముచ్చు శ్రీను, పసుపులేటి రమణయ్య, నరేష్, భోగిశెట్టి మహేష్, పవన్, శ్రీను, సుబ్బారావు, కొండయ్య, వెంకటరమణయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న ఇంటూరి నాగేశ్వరరావు

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

● ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి

లింగసముద్రం, మార్చి 12 : ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి చెప్పారు. మంగళవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఆవరణలో జరిగిన చేయూత చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. 1907 మంది పొదుపు మహిళలకు సంబంధించి రూ.3,57,56,000 చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పెన్నా కృష్ణయ్య, ఎంపీడీవో యు శేషుబాబు, సర్పంచు పులి రాఘవులు, ఏపీఎం సింహాద్రి రావు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు బేరి రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వలేటివారిపాలెం : స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వైఎస్సార్ చేయూత 4వ విడత 2241 మంది మహిళలకు సంబంధించి విడుదలైన రూ.4,20,18,750 చెక్కును ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి పంపిణీ చేశారు. ఎంపీపీ పొనుగోటి మౌనిక అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ ఇంటూరి భారతి, తహసీల్దారు నాగమల్లేశ్వరరావు, ఎంపీడీవో రఫీక్‌అహ్మద్, ఎంఎంఎస్ అధ్యక్షురాలు ముప్పా హరిత, ఏపీఎం చిన బాబు, తదితరులు పాల్గొన్నారు.



వలేటివారిపాలెం : చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

ఆర్వో ప్లాంట్ ప్రారంభం

ఉలవపాడు, మార్చి 12 : హేచరీలకు ఫీడ్, మందులు సరఫరా చేసే విర్బాక్ యానిమల్ హెల్త్ కేర్ ఇండియా ప్రాజెక్టు యాజమాన్యం కరేడు పంచాయతీ పరిధిలోని పెద్దపల్లెపాలెం మత్స్యకార గ్రామంలో ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేసింది. మంచినీటి వసతి లేని ఈ గ్రామంలో ఎమ్మెల్యే మహీధర్ రెడ్డి సూచనల మేరకు రూ.3,34,000తో ఆర్వో ప్లాంటు నిర్మాణం చేశామని ప్రాజెక్టు మేనేజర్ ఎంవీవీ సత్యనారాయణ, బీవో నరేంద్ర చెప్పారు. మంగళవారం స్థానిక హేచరీల ప్రతినిధులతో కలిసి వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించినట్లు తెలిపారు.



ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న సత్యనారాయణ

ప్రధాన రహదారిపై మట్టి కట్టలు

● ప్రమాదాల బారిన వాహనదారులు

కలిగిరి, మార్చి 12: కలిగిరి-కొండాపురం మార్గంలో ప్రధాన రహదారిపై స్థానికంగా పొగాకు సాగు చేసే రైతులు ప్రమాదకరంగా మట్టి కట్టలు అడ్డుగా వేసి ఉండటంతో ఈ మార్గంలో ప్రయాణించే వాహన దారులు ప్రమాదాల బారిన పడి ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నారు. రోడ్డుకు ఒకవైపు నుంచి మరొక వైపు నీటిని తరలించేందుకు పైపు వేసి అది దెబ్బతినకుండా పొలంలోని మట్టిని ఎత్తుగా కట్ట వేయడంతో ఈ మార్గంలో ప్రయాణించే ఆటో వాలాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారే కదా అని ప్రయాణించే వారికి దగ్గరకు వచ్చే వరకు అక్కడ మట్టికట్ట ఉన్నట్లు గుర్తించలేక అకస్మాత్తుగా బ్రేకులు వేయడంతో అదుపుతప్పి పడుతున్నారు. ఈ రహదారిలో కలిగిరి నుంచి కృష్ణారెడ్డిపాలెం గ్రామం మధ్యలో ఐదు కిలోమీటర్ల నిడివిలోనే ఐదుచోట్లకు పైగా ప్రమాదకరంగా ఈ మట్టికట్టలు ఉన్నా, ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. మట్టికట్టల వలన ప్రమాదాల బారిన పడుతున్నామని అధికారులకు తెలియజేసినా వారు స్పందించకపోవడం దారుణమని వాహనదారులు పేర్కొంటున్నారు. వెంటనే వాటిని తొలగించాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

కాకర్ల విజయానికి సమష్టి కృషి

● ముక్తకంఠంతో తీర్మానించిన టీడీపీ నేతలు

జలదంకి, మార్చి 12: టీడీపీ ఉదయగిరి అసెంబ్లీ అభ్యర్థి కాకర్ల సురేష్ విజయానికి శక్తివంచన లేకుండా సమష్టి కృషి చేస్తామని టీడీపీ మండల నేతలు, కార్యకర్తలు, అభిమానులు ముక్తకంఠంగా చెప్పారు. మంగళవారం స్థానిక ఓ కళ్యాణ మండపంలో టీడీపీ మండల అధ్యక్షుడు పి.మధురెడ్డి ఆధ్వర్యంలో కాకర్ల పరిచయ కార్యక్రమం నిర్వహించారు. నాయకులు జయచంద్రారెడ్డి, భాస్కర్‌రెడ్డి, మాల్యాద్రియాదవ్, వినోద్‌నాయుడు, రామారావు, పెంచలయ్యనాయుడు, అప్పలయ్యనాయుడు, సుధీర్, వేణు తదితరులు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే బొల్లినేని రామారావుతో 12 ఏళ్లపాటు పార్టీలో పనిచేవామని, కాకర్లను కూడా ఎమ్మెల్యేను చేస్తామని పేర్కొన్నారు.

బొల్లినేని ఆశీస్సులతో అసెంబ్లీలో అడుగుపెడతా

పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే, నా సోదర సమానుడు బొల్లినేని వెంకటరామారావు ఆశీస్సులతో రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా విజయం సాధించి అసెంబ్లీలో అడుగుపెడతానని ఉదయగిరి అభ్యర్థి కాకర్ల సురేష్ పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, జడ్పీమాజీ చైర్మన్ పి.చెంచలబాబుయాదవ్, కావలి అభ్యర్థికావ్య క్రిష్ణారెడ్డిల ఆశీస్సులు తనకు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పరిశీలకుడు వికాస్ హరికృష్ణ, కంచర్ల వినోద్‌నాయుడు, కొర్రపాటి రామారావు, కె.అప్పలయ్యనాయుడు, పచ్చా పెంచలయ్యనాయుడు, మునగాల తిరుమలరెడ్డి, ఉప్పుటూరి సుధీర్, ఏగూరి రఘు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ వ్యవస్థాపక దినోత్సవం

కావలి, మార్చి 12: వైసీపీ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు మంగళవారం పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో జరిగాయి. పార్టీ కార్యాలయం వద్ద జెండాను ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్‌చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనమర్లపూడి నారాయణ, నగళ్ల శ్రీనివాసకిరణ్, కుందుర్తి శ్రీనివాసులు, గ్రంథం ప్రసన్నాంజనేయులు, కనపర్తి రాజశేఖర్, షాహుల్ హమీద్, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

కందుకూరు, మార్చి 12: వైసీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆపార్టీ కందుకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి బుర్రా మధుసూదన్‌యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణ పోలీస్‌స్టేషన్ ఎదుట ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు షేక్ రఫీ, ముప్పవరపు కిషోర్, గణేశం గంగిరెడ్డి, డీసీహెచ్ మాలకొండయ్య, రేణమాల అయ్యన్న, వల్లూరి కోటేశ్వరరావు, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

వలేటివారిపాలెం, మార్చి 1 : మండలంలోని జమీన్ ఉప్పలపాడులో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 6వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ జె గోవర్ధిని ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో 40 సీట్లు, ఇంటర్‌లో 40 సీట్లు ఉన్నట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న బాలికలకు రాష్ట్ర అధికారులు సీట్లు కేటాయించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు కేజీబీవీ పాఠశాలలో సంప్రదించాలని పేర్కొన్నారు.

పోలేరమ్మకు కుంకుమార్చన



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

అల్లూరు, మార్చి 12 : అల్లూరు పట్టణ పరిధిలోని బీసీ కాలనీ వద్ద వెలసి ఉన్న పోలేరమ్మ చెట్టు వద్ద మంగళవారం సాయంత్రం విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారికి పొంగలి నైవేద్యం సమర్పించి కుంకుమార్చన చేశారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

బోగోలులో టీడీపీ ప్రచారం ప్రారంభం

బిట్రగుంట, మార్చి 12: బోగోలు బేతనీపేటలో కావలి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి దగ్గుమాటి వెంకటకృష్ణారెడ్డిని గెలిపించాలంటూ మండల తెలుగు తమ్ముళ్లు మంగళవారం ప్రచారం ప్రారంభించారు. మాజీ ఎంపీటీసీ ముంతాల వెంకటేశ్వర్లు, గోచిపాతల సంజయ్ ఆధ్వర్యంలో కావ్య సోదరుడు దగ్గుమాటి వేణుగోపాల్‌రెడ్డితో కలసి గ్రామంలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందచేశారు. కాగా మండల అధ్యక్షుడు మాలేపాటి నాగేశ్వరావు, బోగోలు క్లస్టర్ ఇంచార్జి కోడూరు వెంకటేశ్వర్లురెడ్డి, మండల ప్రధానకార్యదర్శి ఎల్. సుధీర్‌బాబులు వేర్వేరు ప్రాంతాల్లో గ్రామ నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించారు.



బేతనీపేటలో ప్రచారం ప్రారంభించిన తెలుగు తమ్ముళ్లు